సమాజం
రూ॥ 60/-
పేజీలు: 64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. భక్తులు సమ్మక్క-సారలమ్మ అమ్మవార్లను దర్శించుకొని అమ్మ వార్ల కృపకు పాత్రులు కావాలని ప్రార్థిస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు. భక్తులంతా దర్శనానంతరం క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినందున ఇతరత్రా ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సీఎం ఆదేశించారు.

సంపుటి 09, సంచిక: 60 | బుధవారం | 28-01-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



### సింగరేణి కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

- సౌకర్యాలు కల్పించేందుకు కమిటీ ఏర్పాటు చేస్తాం
- కారుణ్య నియామకాల్లో వారసుల గరిష్ట వయోపరిమితిని 40 ఏళ్లకు పెంచాం : భట్టి


03



### రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు

- ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యం
- నాటి పాలకుల స్వార్థ పూరిత నిర్ణయాల వల్లే వ్యవస్థ భ్రష్టు పట్టింది
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

03



### తిరోగమనంలో సంక్షేమం.. పెరుగుతున్న అసమానత

- ఆర్థిక స్థితిపై కేంద్ర సర్కార్ మండిపాటు
- 2025లో రూపాయి ఆసియాలో అత్యంత పేలవ పనితీరు కనబరచిన కరెన్సీ : కాంగ్రెస్

05

# నేటి నుంచి నామినేషన్లు...

## ఫిబ్రవరి 11న మున్సిపాలిటీ ఎన్నికలు

- రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు ఒకే విడతలో ఎన్నికలు
- 13న కౌంటింగ్
- షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని
- తక్షణం ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని వెల్లడి




మున్సిపాలిటీలు : 116
కార్పొరేషన్లు : 7
మొత్తం వార్డులు : 2,996
మొత్తం ఓటర్లు : సుమారు 52.43 లక్షలు
పోలింగ్ కేంద్రాలు : 8,203
(పారదర్శకత కోసం 100 శాతం వెబ్ కాస్టింగ్).

ప్రజాపక్షం/హైదరాబాద్ :

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఎన్నికల షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేశారు. ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి వచ్చింది. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల వివరాలు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 28 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుండగా, జనవరి 30 వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు గడువు ఇచ్చారు. ఈనెల 31న నామినేషన్ల స్క్రూటినీ నిర్వహించ



నున్నారు. ఫిబ్రవరి 3న నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు ఉండగా, అదే రోజు తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుండగా, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపడతారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, తరువాయి 2లో

### మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్..

నామినేషన్ల స్వీకరణ ప్రారంభం జనవరి 28
నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ జనవరి 30, (సాయంత్రం 5 గంటల వరకు)
నామినేషన్ల పరిశీలన జనవరి 31
నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఫిబ్రవరి 03, (మధ్యాహ్నం 3 గంటల వరకు)
పోలింగ్ తేదీ ఫిబ్రవరి 11 (ఉదయం 7 నుండి సాయంత్రం 5 వరకు)
రీ-పోలింగ్ (అవసరమైన చోట) ఫిబ్రవరి 12
ఓట్ల లెక్కింపు, ఫలితాలు ఫిబ్రవరి 13
మేయర్లు, చైర్మన్ల పరోక్ష ఎన్నిక ఫిబ్రవరి 16.

# భారత్–యూరప్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం



న్యూఢిల్లీ: భారత్–యూరప్ దేశాలమధ్య రెండున్నర దశాబ్దాలపాటు చర్చల (మధ్యలో కొంత విరామం) తర్వాత న్యూఢిల్లీ వేదికగా మంగళవారం కీలకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) కుదిరింది. భారత్–యూరోపియన్ యూనియన్ నాయకులమధ్య జరిగిన సదస్సులో యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా వోడర్ లేయన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ మధ్య ఈ మైలురాయి ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇందులో జతగా కలిసి ఉన్న భద్రత, రక్షణ సహకార ఒప్పందాలపై కూడా నాయకులు సంతకాలు చేశారు. వచ్చే ఏడాది నాటికి ఒప్పందం అమలు దశకు చేరుకుంటుంది.ఈ ఒప్పందం వల్ల 27 దేశాలతో కూడిన యూరోపియన్ యూనియన్ కూటమి ప్రజలు, ప్రపంచంలోనే అత్యధికంగా 140 కోట్లు జనాభాగల మొదటిదేశం భారత్ మధ్య సరుకుల స్వేచ్ఛా వాణిజ్యానికి, భారతదేశ నైపుణ్యాన్ని ఎగుమతి చేయడానికి, ఇరువైపులా లక్షల ఉద్యోగాల తరువాయి 2లో

ఈ ఒప్పందంతో రసాయనాలు, యంత్రాలు, విద్యుత్ పరికరాలు ఎయిర్‌క్రాఫ్ట్‌లు,స్పేస్ క్రాఫ్ట్‌లు వంటి అనేక వస్తు సేవల ఎగుమతులపై ఎలాంటి టారిఫ్‌ల సమస్యలూ ఉండవు. ఉమ్మడి భద్రతా భాగస్వామ్యం నెలకుంటుంది. ప్రస్తుతం మోటారు వాహనాలపై హెచ్చుమోతాదులో ఉన్న టారిఫ్‌లు క్రమంగా తగ్గిపోతాయి. యూరప్ నుండి వచ్చే వైన్,బీరు, ఆలివ్ ఆయిల్‌లపై భారతదేశం సుంకాల్లో కోత పెడుతుంది. భారత్ నుండి ఎగుమతి చేసే టెక్స్‌టైల్,లెదర్,సముద్ర ఉత్పత్తులు, హస్తకళా ఉత్పత్తులు,రత్నాలు, ఆభరణాలపై సుంకాలు ఉండవు. టీ,కాఫీ,సుగంధ వస్తువులు,ప్రాసెస్డ్ ఫుడ్‌లకు ఒప్పందంతో ప్రయోజనం కలుగుతుంది. పాల ఉత్పత్తులు, పప్పులు, కోళ్ళపరిశ్రమ,కొన్ని పళ్ళు,కూరగాయలకు రక్షణలు ఉంటాయి. భారత్–యూరోపియన్ యూనియన్ మధ్య వృత్తి నిపుణుల స్వల్పకాలిక ప్రయాణాలపై కూడా ఆంక్షలు సడలిస్తారు.



మంత్రుల రహస్య భేటీ అంటూ

## విషప్రచారం చేయొద్దు

- సోషల్ మీడియా, ప్రసార మాధ్యమాల్లో అసత్య ప్రచారాన్ని ఖండిస్తున్నాం
- మంత్రి శ్రీధర్ బాబు ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

'ప్రజాస్వామ్యంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తుల మధ్య జరిగే ప్రతి చర్చకు రాజకీయాలను ఆపాదిస్తూ 'రహస్య భేటీ' అని విష ప్రచారం చేయడం తగదని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మంత్రుల భేటీపై సోషల్ మీడియా, ప్రసార మాధ్యమాల్లో జరుగుతున్న అసత్య ప్రచారాన్ని మంత్రి తరువాయి 12లో

'నరేగా, సర్, యుజిసి' నిబంధనలపై

# నిర్మాణాత్మక చర్చ జరపాల్సిందే

- అఖిలపక్ష భేటీలో ప్రతిపక్షాలు డిమాండ్
- 'విబి–జి రామ్ జి' చట్టాన్ని వెనక్కి తీసుకోమన్న కేంద్రమంత్రి కిరణ్ రిజిజు
- దేశం ముందు ఉంచిన చట్టాలపై 'రివర్స్ గేర్' చేయలేమని వెల్లడి



న్యూఢిల్లీ : పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. తొలి రోజున రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లోక్‌సభ, రాజ్యసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఆ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చ జరగనుంది. అలాగే ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం కేంద్ర ఆర్థిక మంత్రి 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. రెండు విడతలుగా జరిగే బడ్జెట్ సమావేశాలు తొలి దశ బుధవారం నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కొనసాగనున్నాయి. అనంతరం కొద్దిరోజుల విరామం తర్వాత మార్చి 9న మళ్లీ పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. ఏప్రిల్ 2వ తేదీతో బడ్జెట్ సమావేశాలు ముగియనున్నాయి. కాగా, మంగళవారం పార్లమెంటు బడ్జెట్ సమావేశాలకు ముందు కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించింది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ప్రతిపక్ష పార్టీలు యుపిఎ కాలం నాటి ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ పునరుద్ధరణ, కొనసాగుతున్న ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్), భారతదేశ విదేశాంగ విధానం, కొత్త యుజిసి మార్గదర్శకాలపై వివాదం వంటి అనేక అంశాలపై నిర్మాణాత్మక చర్చలు జరపాలని డిమాండ్ చేశాయి. అయితే, కొత్తగా ప్రవేశపెట్టిన 'విబి–జి రామ్ జి' చట్టాన్ని తరువాయి 2లో



### సిఎస్ఎస్‌లో కేంద్రం వాటా పెంచాలి

- 'కగార్'పై సమగ్ర నివేదిక ఇవ్వాలి
- అఖిలపక్ష సమావేశంలో సిపిఐ డిమాండ్

న్యూఢిల్లీ: కార్మిక వర్గానికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్లు, రైతు వ్యతిరేక విత్తన బిల్లు ఉపసంహరణకు సిపిఐ డిమాండ్ చేసింది. కేంద్ర పథకాలు (సిఎస్ఎస్)లో వాటాను 75:25కు పెంచాలని, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసేందుకు రాష్ట్రాలకు వీలు కల్పించాలని సూచించింది. ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం, ప్రజల జీవనోపాధికి భద్రత కోసం ప్రలకు సంబంధించిన అన్ని కీలక అంశాలపై బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలని మంగళవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో సిపిఐ ఎంపి పి.సందోశ్ కుమార్ తేల్చిచెప్పారు. ఆపరేషన్ కగార్ పేరిట తరువాయి 2లో




# ఐదు రోజులే పనిచేస్తాం

- ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేసేదాకా విశ్రమించేది లేదు
- బ్యాంకు ఉద్యోగుల హెచ్చరిక
- ఎస్‌బిఐ హైదరాబాద్ ప్రధాన కార్యాలయం వద్ద సమ్మె నిర్వహించిన ఉద్యోగులు
- ఐదు రోజుల పని దినాల అమలు వల్ల ఉద్యోగుల పనితీరు జీవన సమతుల్యత మెరుగు : బి.ఎస్ రాంబాబు



ప్రజాపక్షం/హైదరాబాద్

బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పనిదినాలు సాధించే వరకు విశ్రమించేది లేదని ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు అన్నారు. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) పిలుపు మేరకు ప్రభుత్వం ఇచ్చిన హామీని ఐదు రోజుల పనిదినాలను వెంటనే అమలు చేయాలని బ్యాంక్ ఉ ద్యోగులు మంగళవారం హైదరాబాద్ కోఠిలోని ఎస్‌బిఐ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన బ్యాంకు ఉద్యోగుల సమ్మెలో బిఎస్. రాంబాబు, ప్రొఫెసర్ తరువాయి 12లో



ఫోన్ ట్యాపింగ్ కేసు


## ఏడున్నర గంటల విచారణలో సంతోష్

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు బిఆర్‌ఎస్ మాజీ ఎంపి సంతోష్‌రావును ఏడున్నర గంటల పాటు విచారించారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమైన విచారణ రాత్రి దాదాపు 11గంటల వరకు కొనసాగింది. ముఖ్యంగా ఈ కేసులో ఇప్పటికే అరెస్టై బెయిల్‌పై ఉన్న నిందితులతో సంతోష్‌రావు జరిపిన ఫోన్ కాల్ లిస్టును ఆధారంగా చేసుకుని సిట్ అధికారులు పలు ప్రశ్నలను ఆయనపై సంధించినట్లు సమాచారం. కవిత ఫోన్‌ను ట్యాప్ చేయడంలో సంతోష్ రావు కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు ఉన్నాయి.కవిత దగ్గర పని చేసే వ్యక్తుల ఫోన్ నెంబర్ లను ఎస్‌ఐబి అధికారి ప్రభాకర్ రావుకు తరువాయి 12లో

# ఫ్రాన్స్ టీనేజర్లకు సోషల్ మీడియా నిషేధం

హైస్కూల్స్‌లో ఫోన్లు నిషేధం : బిల్లు ఆమోదం




పారిస్ : ఫ్రాన్స్ దేశంలో 15 ఏళ్ళ లోపు వయసుగల టీనేజర్లకు సోషల్ మీడియాను, హైస్కూళ్ళలో ఫోన్ల ప్రవేశాన్ని నిషేధించారు. ఈ మేరకు ఫ్రెంచ్ పార్లమెంటు ఒక బిల్లును ఆమోదించింది. పాఠశాల విద్యా సంవత్సరం సెప్టెంబరు 1వ తేదీ నుండీ ఈ చట్టం ఫ్రాన్స్‌లో అమలులోకి వస్తుంది. ఈ విషయంలో రాబోయే నెల నాటికి యూరప్‌లో ఫ్రాన్స్ దేశం ఒక మార్గదర్శిగా ఉంటుందని అధికారపార్టీ నాయకులు ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే పలు దేశాలు టీనేజర్లకు సోషల్ మీడియాను దూరం చేసే చర్యల్లో నిమగ్నమై ఉన్నాయి. టీనేజర్లపై టిక్‌టాక్,యూట్యూబ్,మెటాలు తీవ్ర మానసిక, శారీరక ప్రభావాలు చూపిస్తున్నాయని నివేదికలు వస్తున్న తరుణంలో ఈ వేదికలన్నీ సమీక్షకు గురవుతున్నాయి. ఈ వేదికలు చూపిస్తున్న ప్రభావంపై సర్వేలు, పరిశోధనలు కూడా కొనసాగుతున్నా. ఆస్ట్రేలియా తర్వాత టీనేజర్లకు సోషల్ మీడియాను కఠినంగా నిషేధించిన దేశం ఫ్రాన్స్‌దేశమే. సోమవారం అర్థరాత్రి ఫ్రాన్స్ జాతీయ చట్టసభలో ఎంపిలు తరువాయి 12లో



# వనజాతరకు వెళ్లొద్దాం

- నేటి నుంచి మేడారం మహాజాతర
- పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసిన రాష్ట్రప్రభుత్వం
- విదేశాల నుంచి తరలివస్తున్న భక్తులు

ప్రజాపక్షం/హనుమకొండ

రెండేళ్ల కోసారి అత్యంత వైభవంగా జరగనున్న మేడారం మహాజాతరకు సర్వం సిద్ధ మైంది. బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు మహాజాతర ఘనంగా జరగనుంది.లక్షలాదిగా వచ్చే భక్తులకు ఇబ్బందులు కల గకుండా ప్రభుత్వం 8 జోన్లు, 42 సెక్టర్లుగా జాతరను విభజించి విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. 21 శాఖలకు చెందిన 42,027 మందికి పైగా ఉద్యోగులు, సిబ్బంది మేడారంలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా జాతరలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు ఎఐ సహకారంతో అత్యాధునిక డ్రోన్లు, సిసి కెమెరాలతో నిఘాకు సన్నద్ధం తరువాయి 12లో



# అమెరికాలేని యూరప్ స్వీయరక్షణ ఓ కల

## యూరప్‌కు నాటో అధినేత మార్క్ రట్టే హెచ్చరిక



**స్ట్రాస్‌బర్గ్ :** అమెరికా సైనిక అండదండలు లేకుండా యూరప్ స్వీయ రక్షణ సాధించడం కల మాత్రమేనని నాటో కూటమి ప్రధాన కార్యదర్శి మార్క్ రట్టే యూరప్ దేశాలకు ప్రత్యక్ష హెచ్చరిక చేశారు. గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేయడం లేదా నయానో భయానో స్వాధీనం చేసుకోవడం, అఫ్గానిస్థాన్‌లో అగ్రభాగాన నిలబడి నాటో దళాలు పోరాడలేదని ట్రంప్ చేసిన ఆరోపణలతో ఇటీవల దుమారాలు చెలరేగిన నేపథ్యంలో తాజాగా యూరోపియన్ పార్లమెంటు సమావేశంలో మార్క్ రట్టే మరోసారి యూరప్‌ను అమెరికా దారిలోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ''అమెరికాకు నాటో అవసరం ఉంది, నాటోకు అమెరికా అవసరం ఉంది, అమెరికా లేకుండా యూరప్ మనుగడ సాధ్యం కాదు, అలాంటి స్వీయ రక్షణ కలలు కనడమే అవుతుంది, ఒకవేళ ఎవరైనా మళ్లీ ఆలా ఆలోచిస్తే అలా కలలు కంటూనే ఉండండి, అది సాధ్యం కాదు'' అన్నారు. అమెరికా సైన్యంపై ఆధారపడటం తగ్గించుకోవాలని యూరప్ దేశాలలో పెరుగుతున్న ఆలోచనలు, 'యూరోపియన్ ఫ్రీలోడింగ్' పేరుతో అమెరికా చేస్తున్న ఎద్దేవా నుండి బయటపడేందుకు ఆసియా దిగ్గజాలైన భారత్‌-చైనాలతో సంబంధాల విస్తరణకు యూరప్ యత్నాలు వంటి కొత్త ఆలోచనల నేపథ్యంలో రట్టే చేసిన తాజా హెచ్చరిక మళ్లీ కలకలం రేపింది. అమెరికా సహాయం లేకుండా సైనిక పరంగా యూరప్ తన కాళ్లమీద తను నిలదొక్కుకోవాలన్న వాదనను రట్టే తోసిపుచ్చారు. ''అమెరికా అణు ఛత్రం కింద యూరప్ రక్షణ పొందుతోంది, అమెరికా మనతో లేకపోతే ఈ అణు ఛత్రాన్ని, ఒక హామీదారుణ్ణి కోల్పోతాం'' అన్నా రు.నాటో రక్షణకు ఐదుశాతం కేటాయించాలని యూరోపియన్ యూనియన్ దేశాలు గత ఏడాది అంగీకారానికి వచ్చాయని, కానీ అందుకు రెట్టింపు 10 శాతం మేరకు వారు రక్షణ రంగానికి కేటాయించాల్సి వస్తుందని, అణ్వాయుధాలు నిర్మించుకోవడానికి లక్షలకోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని రట్టే హెచ్చరిస్తూ, ''మీకు శుభం కలుగు గాక!'' అన్నారు. దీనిపై ఫ్రాన్స్ విదేశీమంత్రి జీన్ నోయల్ బారోట్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, యూరప్ తన రక్షణ బాధ్యతలు తాను తీసుకోగలదన్నారు. రట్టో ఇయు పార్లమెంటులో మాట్లాడుతూ, నాటో కూటమి చట్టంలోని ఆర్టికల్‌-5కు అమెరికా కట్టుబడి ఉందని అన్నారు. యూరప్ తన రక్షణ వ్యయాన్ని పెంచుకోవాలనే అమెరికా కోరుకుంటున్నదని, యూరో-అట్లాంటిక్ భద్రత అమెరికా కోరుకుంటోందని, యూరప్ భద్రతను కూడా కోరుతోందని, అందువల్ల మొత్తంగా నాటో అన్ని ప్రయోజనాలను ఆశిస్తోందని అన్నారు.

ట్రాన్స్ అట్లాంటిక్ సంబంధాలు దావోస్ వేదికగా ప్రపంచానికి మరింత స్పష్టంగా అర్థమైన మరునాడే గ్రీన్‌లాండ్ భవితవ్యంపై ట్రంప్‌-మార్క్ రట్టే మధ్య ఒక ఒప్పందం కుదిరింది. తమ దేశం తరపున ఏ విధంగా నాటో అధినేత ఒప్పందం చేసుకుంటారని డెన్మార్క్ ప్రధాన మంత్రి మెట్టే ఫ్రెడరిక్సన్ ఆయనను ప్రశ్నించారు. అమెరికాకు అనుకూలంగా వ్యవహరిస్తున్న రట్టే ట్రంప్‌ను డాడీ అని సంబోధించి, ''మీరు మంచి పని చేస్తున్నారు'' అని ప్రశంసించి యూరప్ దేశాలకు ఇప్పటికే కోపం రప్పించారు. దావోస్‌లో ట్రంప్‌-రట్టే మధ్య సమావేశం మళ్ళీ యూరప్ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి, యూరప్ భద్రత హామీలపై చర్చకు పురిగొల్పింది.

## అత్యంత బలహీన దశలో ఖమేనీ పాలన!

### ట్రంప్‌కు ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం



**జెరూసలెం :** ఇరాన్‌-అమెరికా మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు పెద్దగా వార్తల్లోకి రాకపోయినప్పటికీ, శక్తిమంతమైన అమెరికా విమానవాహక యుద్ధనౌక 'అబ్రహం లింకన్' ఇరాన్‌కు సమీపంలో ఉన్న సముద్రజలాల్లో కేంద్రీకృతమై ఉండటంతో పరిస్థితులు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. మరోవైపు ఇరాన్‌లో ఏం జరుగుతోందో వేగల ద్వారా ట్రంప్ ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. పశ్చిమదేశాల పత్రికల కథనం ప్రకారం, ట్రంప్‌కు ఇరాన్ పరిస్థితులను గూఢచారి వర్గాలు ఎప్పటికప్పుడు చేరవేస్తున్నాయి. మానవహక్కుల సంఘాల రూపంలో అక్కడ అమెరికా కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇరాన్‌లో 1979లో రాజు షా పరిపాలన కుప్పకూలడానికి ముందున్న పరిపాలనాపరమైన బలహీన పరిస్థితులు ఇప్పుడు ఖమేనీ పాలనలో కూడా కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయన్నది ట్రంప్‌కు వేగుల ద్వారా లభించిన సమాచారం. చర్యలకు ఇదే సరైన సమయమని సలహాదారులు చెబుతున్నప్పటికీ ట్రంప్ ఇంకా ఒక నిర్ణయం తీసుకోలేదు. ఖమేనీ ఇప్పుడు సురక్షిత ప్రదేశంలో ఒక బంకరులో ఉన్నారు. తాత్కాలికంగా పాలనా బాధ్యతలన్నీ ఆయన కుమారుడు నిర్వహిస్తున్నారు. ప్రజల్లో అసంతృప్తి తగ్గకుండా వేడి కొనసాగుతూనే ఉందన్నది ట్రంప్‌కు లంభించిన సమాచారం. న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఈ నివేదిక ప్రచురించింది. ''ట్రంప్ అంతిమలక్ష్యం మాత్రం ఖమేనీ ప్రభుత్వాన్ని తొలగించడమే'' అని రిపబ్లికన్‌పార్టీ సెనేటర్ లిండ్సే గ్రాహం టైమ్స్ పత్రికకు చెప్పారు. ''ఈరోజు వారు దేశంలో ఆందోళన చేస్తున్న ప్రజలను చంపడం మానేయవచ్చు, కానీ వచ్చేనెలలో కూడా వారు అధికారంలో కొనసాగితే అప్పుడైనాగానీ ప్రదర్శకులను హతమారుస్తారు. అందువల్ల ఖమేనీ పాలన అంతం కావాల్సిందే'' అని లిండ్సే గ్రాహం అన్నారు.

# దక్షిణ కొరియాపై ట్రంప్ ఆగ్రహం..
# 10 శాతం అదనపు సుంకాలు పెంపు



**వాషింగ్టన్ :** దక్షిణ కొరియాపై అమెరికా సుంకాలు పెంచింది. అమెరికాకు ఎంతో మిత్రదేశమైనప్పటికీ దక్షిణ కొరియా గత ఏడాది కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందానికి కట్టుబడలేదని, ఒప్పందానికి అనుగుణంగా ప్రవర్తించడంలేదని ట్రంప్ ఆగ్రహించారు. ఈ నేపథ్యంలో సుంకాలను 25 శాతానికి పెంచారు. ఇప్పటివరకూ దక్షిణ కొరియా నుండి దిగుమతి చేసుకునే వస్తువులపై ఉన్న 15 శాతం సుంకాలను ఇప్పుడు 25 శాతానికి పెంచారు. ఐతే దక్షిణ కొరియా దీనిపై స్పందిస్తూ, ఈ నిర్ణయంపై తమకు ఎలాంటి సమాచారం లేదని, ఈ విషయంలో తాము తక్షణ చర్చలు కోరుతున్నామని పేర్కొంది. ఆటోమొబైల్స్, చిత్రిక పట్టిన కలప, ఫార్మాస్యూటికల్స్ సహా దక్షిణ కొరియా నుండి వచ్చే ఇతర అనేక దిగుమతి వస్తువులపై ట్రంప్ సుంకాలను పెంచారు. రెండు దేశాలమధ్య సుంకాలలో పరస్పర సమతౌల్యం కొరవడిందని ఆయన పేర్కొన్నారు. తమ దేశం నుండి దక్షిణ కొరియా చాలా ఎక్కువ సుంకాలు వసూలు చేస్తుండగా, తామే తక్కువ సుంకాలు వసూలు చేస్తున్నామన్నారు. తాము ఒప్పందానికి కట్టుబడి సత్వర చర్యలు తీసుకుని టారిఫ్‌లు తగ్గించుకోగా, దక్షిణ కొరియా మాత్రం టారిఫ్‌లను తగ్గించకుండా, ఒప్పందం ప్రక్రియను జాప్యం చేస్తోందని ట్రంప్ ఆరోపించారు. ప్రస్తుతం కెనడాలో పర్యటిస్తున్న దక్షిణ కొరియా పరిశ్రలమంత్రి కిమ్ జంగ్ క్వాన్ సత్వరం అమెరికాలో పర్యటించే అవకాశాలు ఉన్నాయి. అమెరికా వాణిజ్యమంత్రి హోవార్డ్ లుత్నిక్‌తో ఆయన సమావేశమవుతారు. గత ఏడాది అక్టోబరులో దక్షిణ కొరియాతో ట్రంప్ ఒక వాణిజ్య ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందంతోపాటు అమెరికాలో 350 బిలియన్ డాలర్లు )(256 బిలియన్ పౌండ్లు) పెట్టుబడులు కూడా ఆ దేశం సమకూర్చేందుకు సంసిద్ధమైంది. ఈ ఒప్పందం అమలు ప్రక్రియ ప్రారంభమైన నెలలోనే దక్షిణ కొరియా నుండి దిగుమతయ్యే కొన్ని వస్తువులపై టారిఫ్‌లు తగ్గించేందుకు కూడా రెండు దేశాలమధ్య ఒప్పందం కుదిరింది. గత ఏడాది నవంబరు 26 న జాతీయ అసెంబ్లీలో ఈ ఒప్పంద తీర్మానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో ఈ ఒప్పందాన్ని ఆ దేశ ప్రభుత్వం సమీక్షిస్తోంది. చైనాతో ఒప్పందం చేసుకుంటే నూటికి నూరు శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ రెండు రోజుల క్రితమే కెనడా ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. ఐతే చైనాతో తమ దేశం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కొనసాగించడంలేదని కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ అన్నారు. అంతకుముందు గ్రీన్‌లాండ్‌ను ఆక్రమించే ఆలోచనను వ్యతిరేకించే ఎనిమిది యూరప్ దేశాలపైన భారీగా సుంకాలు విధించేందుకు ట్రంప్ ప్రకటన చేసి బెదిరించారు. గ్రీన్‌లాండ్‌పైన కూడా సుంకాలు విధించారు. నాటోతో కూడా సంబంధాలు దెబ్బతినడమే కాకుండా యూరప్ దేశాలు ఎదురు తిరగడంతో దావోస్‌లో జరిగిన సమావేశంలో ట్రంప్ వెనక్కి తగ్గుతున్నట్లు ప్రకటన చేశారు.

## మిన్నెసోటాపై దూకుడు తగ్గించిన ట్రంప్

### రాష్ట్రం వదిలి వెళ్లనున్న ఐసిఇ ఉన్నతాధికారులు


**మిన్నెపొలిస్ :** మిన్నెపొలిస్‌లో అక్రమ వలస నేరస్థుల ఏరివేత పేరుతో ఇప్పటికే ఇద్దరిని ఐసిఇ అధికారులు కాల్చి చంపడంతో తీవ్ర ఒత్తిడికి గురైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన వైఖరి మార్చుకున్నారు. మిన్నెసోటాపై దూకుడు తగ్గించి వెనక్కు తగ్గి, ఆ రాష్ట్రం నుండి ఉన్నతస్థాయి ఫెడరల్ అధికారులను కొంతమందిని వెనక్కు వచ్చేయాలని ఆదేశించారు. దీంతో సరిహద్దు గస్తీ కమాండర్ గ్రెగరీ బొవినో, ఇతర ముఖ్య అధికారులు మిన్నెసోటా నుండి వెళ్లిపోయేందుకు రంగం సిద్ధమైంది. వారంతా వెళ్లిపోయాక ట్రంప్ నియమించిన బోర్డర్ జార్ టామ్ హోమన్ మిన్నెపొలిస్‌లో క్షేత్రస్థాయిలో విచారణా చర్యలు ప్రారంభిస్తారు. ఈనెలలోనే ఇద్దరు మరణించడంతో కాల్పులపై తక్షణం దర్యాప్తు చేయాలని సెనేటర్లు ట్రంప్‌పై ఒత్తిడి పెంచారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, బిల్ క్లింటన్ కూడా తీవ్రస్థాయిలో ట్రంప్‌పై ధ్వజమెత్తారు. సర్వత్రా ఈ విషయంలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి.మిన్నెసోటాలో ఇరవైరోజులుగా ఆందోళనలు జరుగుతుంటే ఈనెల 24న అలెక్స్ ప్రెట్టీ (37)ని నికొల్లెట్ అవే వద్ద సరిహద్దు గస్తీ ఏజంట్లు కాల్చి చంపడంతో ప్రజాగ్రహం రెట్టింపయ్యింది. అమెరికన్ జాతీయుడైన అలెక్స్ ఐసియు నర్సుగా పనిచేస్తున్నాడు. ఆయనకు ఎలాంటి నేర చరిత్ర లేదు. ఆయనకు గన్ లైసెన్సు ఉన్నాగాని, ఏనాడూ దానిని వెంట తీసుకువెళ్లలేదు. అతడు తుపాకీతో బెదిరించినట్లు అధికారులు చెబుతుండగా వీడియోల్లో మాత్రం ఆయన చేతుల్లో ఏమీ కనిపించడంలేదు. మిన్నెసోటాలో మోహరించిన వందల మంది ఫెడరల్ అధికారులను వెనక్కు పంపాలని ప్రజలు కోరుతున్నారు. అమెరికా దేశ మూల విలువలపై దాడులు పెరిగిపోతున్నాయని, పార్టీలకు అతీతంగా ప్రజలు అప్రమత్తం కావాలని బరాక్ ఒబామా తన సందేశంలో హెచ్చరించారు.

## హమాస్ నిరాయుధీకరణపై హడావిడి

**టెల్‌అవీవ్ :** గాజాలో గత ఏడాది అక్టోబరులో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత సజీవ నిర్జీవ బందీలను స్వాధీనం చేసే ప్రక్రియ ఎట్టకేలకు సోమవారం(జనవరి 26)తో ముగిసింది. గాజాలో హమాస్ వద్ద బందీగా ఉండిపోయిన చిట్టచివరి ఇజ్రాయెలీ పౌరుడు, ఉగ్రవాద నిర్మూలన పోలీసు అధికారి రాన్ గ్విలీ మృతదేహ అస్థికలు స్వదేశానికి చేరాయి. 2023 అక్టోబరు ఏడో తేదీన రాన్ గ్విలీని ఉగ్రవాదులు బందీగా తీసుకుపోయారు. ఈ విషయాన్ని నెతన్యాహూ ప్రభుత్వం ధృవీకరించింది. రాన్ గ్విలీ మృతదేహ అస్థికలను స్వాధీనం చేసుకోవడంలో హమాస్ బృందాలు సహాయం చేశాయని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. ఇక ఇజ్రాయెల్‌కు వాగ్దానం చేసినవిధంగా హమాస్‌ను నిరాయుధీకరణ చేయాల్సి ఉందని ఆక్సియోస్ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ చెప్పారు. గాజాలో శాంతి సాధనకు ట్రంప్ ప్రకటించిన 20 సూత్రాల ప్రణాళికలో భాగంగా మొదటి విడత ఇజ్రాయెల్‌-హమాస్ మధ్య పరస్పరం బందీల మార్పిడి, ఖైదీల విడుదల ప్రక్రియ పూర్తి కావాలి. వాస్తవానికి నిర్దేశిత సమయంలోపు ఈ మొదటి దశ ప్రక్రియ పూర్తి కాలేదు. ఇజ్రాయెలీ బందీలు ఎక్కడ ఉన్నారో తమకు జాడ తెలియడంలేదని, వారి మృతదేహాలను వెలికి తీయడానికి పెద్ద పెద్ద యంత్రాలు కావాలని హమాస్ బృందాలు పట్టుపట్టాయి. ఆ తర్వాత ఉమ్మడి గాలింపు చర్యల్లో ఒక్కొక్క మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రక్రియ ఎట్టకేలకు పూర్తయింది. ఇక తదుపరి రెండో దశలో గాజాలో ఉన్న హమాస్ ఉగ్రవాదులను బయటకు పంపేయడం, వారిని నిరాయుధీకరించడం, అంటే వారి ఆయుధాలను స్వాధీనం చేసుకునే ప్రక్రియపై ఇక హడావిడి మొదలవుతుంది. తాము ఆయుధాలు స్వాధీనం చేసే ప్రశ్నే లేదని, పాలస్తీనా ప్రభుత్వానికే తాము ఆయుధాలు స్వాధీనం చేస్తామని హమాస్ వర్గాలు భిన్న ప్రకటనలు చేస్తున్నాయి. ఈ రెండో దశలో రఫా క్రాసింగ్‌ను రాకపోకల కోసం ప్రారంభించడం, లెక్కకు మిక్కిలిగా అంతర్జాతీయ సహాయాన్ని గాజా ప్రజల కోసం ఆ ప్రాంతంలోకి అనుమతించడం, గాజా పునర్నిర్మాణ ప్రక్రియ ఎజెండాలో ఉన్నాయి.

## నగదు రహిత చికిత్సలకు ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని అమలు చేయండి..

ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యోగుల జెఎసి వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు, వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో అన్ని రకాల జబ్బులకు అపరిమిత, నగదు రహిత వైద్య సేవలను అందేలా చూడాలని తెలంగాణ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు కలిపి సుమారు 10 లక్షల మంది ఉన్నారన్నారు. వీరందరూ నెలవారీగా వారిగా కాంట్రిబూషన్‌ను చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి నేతృత్వంలో జెఎసి ప్రతినిధుల బృందం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కలిసి ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఇహెచ్‌ఎస్) అమలు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందచేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ఇన్‌పేషెంట్ అవుట్‌పేషెంట్ నగదు రహిత చికిత్స కోసం మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ అమలులో అనేక ఇబ్బందులు ఉన్నాయన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు హెల్త్ కార్డులను అంగీకరించకపోవడం, ఆసుపత్రి బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర ఆలస్యం ఉండటం వల్ల ఇహెచ్‌ఎస్ లక్ష్యం నెరవేరడం లేదన్నారు. ఉద్యోగుల కాంట్రిబూషన్‌ను సంబంధించి లబ్ధిదారుల సంఖ్య, వయస్సు, ప్రత్యేక సేవలను బట్టి (ఐచ్ఛికంగా)నిర్ణయించడం సమంజసంగా ఉంటుదన్నారు. తెలంగాణ ఉద్యోగుల జెఎసి ప్రతిపాదనపై సిఎస్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత విభాగాల అధికారులతో సంప్రదించి తుది నివేదికను ఇచ్చేలా చర్యలు చేపట్టనున్నట్టుగా స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగుల జెఎసి నాయకులు కె.రామకృష్ణ, రమేష్ పాక, పూల్‌సింగ్ చౌహాన్, గరికె ఉపేందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## వాటా పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

అమాయక గిరిజనులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆక్షేపించారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను పార్లమెంటు, ప్రజల ముందర ఉంచాలని, పారదర్శకతకు, జవాబుదారీతనానికి హామీ ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల ప్రక్షాళన (ఎస్ఐఆర్)... ఓట్ల తొలగింపు ప్రక్రియగా మారిపోయిందని దుయ్యబట్టారు. 'ప్రజాస్వామ్యంలో పాలకులను ఓటర్లు ఎన్నుకుంటారు కానీ మన దేశంలో అందుకు విరుద్ధంగా ఓటర్లను పాలకులు ఎంపిక చేసుకుంటున్నారు. ఎన్నికల సంఘం... నిర్మూలన కమిషన్‌గా వేగంగా మారిపోతోంది' అని సంతోశ్ కుమార్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం విధించిన ఆంక్షలతో రూ.21వేల కోట్లకుపైగా ఉన్న తీవ్రమైన వనరుల వ్యత్యాసాన్ని తగ్గించేందుకుగాను కేరళ రాష్ట్రానికి ప్రత్యేక కరువు ప్యాకేజిని డిమాండ్ చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దుందుడుకు చర్యలనుగానీ వెనిజులా, గ్రీన్‌లాండ్ స్వాధీనానికి బెదిరింపులు వంటి అంతర్జాతీయ పరిణామాలను వ్యతిరేకించే స్థితిలో లేకపోవడం మన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని నీరుగారుస్తోందని సంతోశ్ కుమార్ వ్యాఖ్యానించారు. కేంద్ర ఆరోగ్య మంత్రి గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆశా వర్కర్ల వేతనాలు తక్షణమే పెంచాలని ఆయన సీపీఐ తరపున మరోమారు డిమాండ్ చేశారు. వేతన చెల్లింపుల్లో జాప్యంకేటాయింపుల్లో కోతలు, పని దినాల్లో తగ్గింపు వంటివి గ్రామీణుల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతిస్తున్నాయన్నారు. వ్యవసాయ సంక్షోభం, పెరుగుతున్న నిరుద్యోగం దృష్ట్యా ఉపాధి కల్పించే కీలక యంత్రాంగంగా ఎంఎన్‌ఆర్ఈజీఏ ఉన్నదని, దీనిని తక్షణమే తిరిగి అమల్లోకి తేవాలని సంతోశ్ కుమార్ డిమాండ్ చేశారు.

## స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

సృష్టికి బ్రహ్మాండమైన అవకాశాలు లభిస్తాయి. భారత రైతులకు, చిన్న పరిశ్రమలకు, సేవారంగానికి ఈ ఒప్పందం కొత్త ద్వారాలు తెరవనున్నది. గతంకంటే భిన్నంగా భారత సరుకులపై సుంకాల భారాలు తద్వారా వాటి ధరలు గణనీయస్థాయిలో తగ్గిపోతాయి. ఎఫ్‌టిఎ సహా మొత్తం 13 ఒప్పందాలతో ప్రపంచంలో 200 కోట్లమందితో కూడిన ఒక విస్తారమైన ఉమ్మడి మార్కెట్ ఆవిర్భవించడంతోపాటు ప్రపంచ స్థూల దేశీయోత్పత్తిలో నాలుగో వంతు మార్కెట్ ('25 శాతం)గా నమోదు కానున్నది. అమెరికా-యూరోపియన్ యూనియన్ మధ్య ఆర్థిక, ప్రాదేశిక, రక్షణ భద్రతాపరమైన అంశాల్లో తీవ్ర ఉద్రిక్తతలు, ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్న తరుణంలో ప్రత్యామ్నాయ కృషిలో భాగంగా కుదిరిన ఈ ఒప్పందం యావత్ ప్రపంచం దృష్టినీ ఆకర్షించింది. 27 దేశాల యూరోపియన్ యూనియన్ కూటమి-భారతదేశం మధ్య రాబోయే ఐదు సంవత్సరాలకుగాను ఒక ఉమ్మడి సమగ్ర వ్యూహాత్మక ఎజెండా అమలు చేస్తారు. నిబంధనలతో కూడిన ప్రపంచక్రమాన్ని రూపొందించాలన్న దార్శనిక దృక్పథంతో భారత్‌-యూరప్ కూటమి మధ్య మొత్తం 13 ఒప్పందాలు కుదిరాయి.

ఈ ఒప్పందంతో రసాయనాలు, యంత్రాలు, విద్యుత్ పరికరాలు ఎయిర్‌క్రాఫ్టులు,స్పేస్‌క్రాఫ్టులు వంటి అనేక వస్తు సేవల ఎగుమతులపై ఎలాంటి టారిఫ్‌ల సమస్యలూ ఉండవు. ఉమ్మడి భద్రతా భాగస్వామ్యం నెలకుంటుంది. ప్రస్తుతం మోటారు వాహనాలపై హెచ్చుమోతాదులో ఉన్న టారిఫ్‌లు క్రమంగా తగ్గిపోతాయి. యూరప్ నుండి వచ్చే వైన్, బీరు, ఆలివ్ ఆయిల్‌లపై భారతదేశం సుంకాల్లో కోత పెడుతుంది. భారత్ నుండి



ఎగుమతి చేసే టెక్స్‌టైల్, లెదర్, సముద్ర ఉత్పత్తులు, హస్తకళా ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాలపై సుంకాలు ఉండవు. టీ, కాఫీ, సుగంధ వస్తువులు, ప్రాసెస్డ్ ఫుడ్‌లకు ఒప్పందంతో ప్రయోజనం కలుగుతుంది. పాల ఉత్పత్తులు, పప్పులు, కోళ్ల పరిశ్రమ, కొన్ని పండ్లు, కూరగాయలకు రక్షణలు ఉంటాయి. భారత్‌-యూరోపియన్ యూనియన్ మధ్య వృత్తి నిపుణుల స్వల్పకాలిక ప్రయాణాలపై కూడా ఆంక్షలు సడలిస్తారు.

**మదర్ ఆఫ్ ఆల్ డీల్స్**

**ప్రపంచ సుస్థిరతకు ఇదొక కొత్త నమూనా**

ఒప్పందం అనంతరం ఢిల్లీలో జరిగిన పత్రికాగోష్ఠిలో ఉర్సులా వోందర్ లేయన్ మాట్లాడుతూ, ఈ ఒప్పందాన్ని అన్ని ఒప్పందాలకు కేంద్ర బిందువుగా ''మదర్ ఆఫ్ ఆల్ డీల్స్''గా అభివర్ణించారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లకు ఈ సహకారం ఉత్తమ సమాధానం అన్నారు. ''మేం ఒప్పందం చేసుకున్నాం, అన్ని ఒప్పందాలకు కేంద్ర బిందువులాంటి ఒప్పందం చేసుకున్నాం, 200 కోట్ల మంది ప్రజలకు ఒక మార్కెట్‌ను సృష్టించాం అన్నారు. ఇది రెండు మహా వ్యవస్థల గాథ, ప్రపంచంలో రెండవ, నాలుగవ ఆర్థిక వ్యవస్థలు చేసుకున్న ఒప్పందం, ఈ రెండు వ్యవస్థలు భాగస్వామ్యాన్ని ఎంచుకున్నాయి, ఇది ప్రపంచానికి ఉత్తమ సందేశం అని ఉర్సులా చెప్పారు. యూరోపియన్ యూనియన్ చేసే ఎగుమతులకు ఏటా చెల్లించాల్సిన సుంకాలలో 400 కోట్ల యూరోలమేరకు ఒప్పందం వల్ల కోత పడుతుందని అన్నారు. భారత్, యూరప్ దేశాలలో అనేక లక్షల మంది కార్మికులకు ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. ''ఈ రెండు వ్యవస్థలూ కేవలం ఆర్థిక వ్యవస్థలను మాత్రమే బలోపేతం చేసుకోవడంలేదు, ప్రస్తుత అభద్రతా ప్రపంచంలో ఇరు దేశాల ప్రజలకు భద్రత కూడా ఇస్తున్నాం, ఈనాడు ప్రపంచంలో రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలు మొదటిసారి భద్రత, రక్షణ భాగస్వామ్యాన్ని ప్రారంభించాయి'' అని చెప్పారు.

యూరోపియన్ యూనియన్ ఒక కూటమి, భారతదేశం ఒక అతిపెద్ద వాణిజ్య భాగస్వామి, 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇయుతో భారతదేశ వస్తు వ్యాపారం 136 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఎగుమతులు 76 బిలియన్లు, దిగుమతులు 60 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ ఒప్పందాన్ని చరిత్రాత్మకమైనదిగా పేర్కొన్నారు. ఆంటోనియో కోస్టా మాట్లాడుతూ, పురాతన అనుబంధంగల భారత్‌-యూరప్ మధ్య ఈనాడు కుదిరిన ఒప్పందం చరిత్రాత్మకమైనదని, ఈ ఒప్పందం ప్రపంచ శ్రేయస్సు కోసమేనని అన్నారు. పత్రికాగోష్ఠిలో మోదీ మాట్లాడుతూ, ప్రపంచ క్రమం ఇప్పుడు పెద్ద గందరగోళంలో పడిందని, ఇలాంటి పరిస్థితుల్లో భారత్‌-యూరోపియన్ యూనియన్ భాగస్వాములు అంతర్జాతీయ వ్యవస్థకు స్థిరత్వాన్ని చేకూరుస్తారన్నారు. ''ఈనాడు భారతదేశం చరిత్రలోనే అతిపెద్ద స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని పూర్తిచేసింది, ఈ ఒప్పందంతో భారతదేశ రైతులకు, చిన్న పరిశ్రమలకు కొత్త ద్వారాలు తెరచుకుంటాయి, తయారీ రంగంలో సరికొత్త అవకాశాలు వృద్ధి చెందుతాయి, సేవారంగంలో కొత్త అవకాశాలు పుట్టుకువస్తాయి, సరికొత్త, భాగస్వామ్యాలను పెంపొందిస్తాయి, ప్రపంచవ్యాప్తంగా సరఫరాల వ్యవస్థ పటిష్టవంతమవుతుంది, దీని అర్థం ఏమిటంటే, ఇది కేవలం ఒక ఒప్పందం మాత్రమే కాదు, అంతర్జాతీయ వ్యవస్థను సుస్థిరీకరిస్తుంది, ఉమ్మడి సంపద వృద్ధికి, ప్రగతికి ఇదొక సరికొత్త నమూనా ప్రణాళిక'' అని నరేంద్రమోదీ అన్నారు.

ఆంటోనియో కోస్టా మాట్లాడుతూ, ఈ ఒప్పందంకోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నామన్నారు. ఉమ్మడి సంపద సృష్టికి ఈ రెండు వ్యవస్థలు భాగస్వామ్యంగా ఉంటాయన్నారు. ఐతే భద్రత లేకుండా సంపద సృష్టి,ప్రగతి సాధ్యం కాదన్నారు. భారత్‌-యూరోపియన్ యూనియన్ మధ్య భాగస్వామ్య సహకారం ప్రపంచ శ్రేయస్సుకోసమేనన్నారు. ఆయుధాలతో యుద్ధం చేస్తే శాంతి రాదని అన్నారు. నిరాయుధంగా దేశాలు జీవిస్తేనే న్యాయం చేకూరుతుందన్నారు. ఉక్రేన్‌లో శాంతి రావాలని తమ సదస్సు ఉద్ఘాటించిందని ఆయన చెప్పారు. ఉక్రేన్‌లో శాంతి సాధనకు ఇదే సరైన సమయమన్నారు. మొత్తం 18 సంవత్సరాలపాటు చర్చల కృషి జరిగిన తర్వాత ఈనాడు తుది ఒప్పందం కుదిరింది. 2007లో ఈ చర్చలు ప్రారంభమయ్యాయి, మధ్యలో కొంత చాలా విరామం వచ్చింది, ఆ తర్వాత 2022లో మళ్ళీ చర్చలు మొదలయ్యాయి. సొంత మిత్రులపైనే విరుచుకుపడి, తన మన భేదాలు మరచిపోయిన ట్రంప్ కారణంగా ఈ ఒప్పందం మళ్ళీ శరవేగంగా ప్రాణం పోసుకుని కొత్త చరిత్ర రాసింది. ఇరు పక్షాలు సంతకాలు చేసి ఈ క్రమాన్ని పూర్తి చేయడానికి లాంఛనాలు పూర్తి చేయడానికి ఆరు నెలలు సమయం పడుతుందని పిటిఐ వార్తాసంస్థ పేర్కొంది.

రసాయనాలు, యంత్రాలు, విద్యుత్ పరికాలు, ఎయిర్ క్రాఫ్టులు, స్పేస్‌క్రాఫ్ట్ వంటి చాలా ఎగుమతులపై సుంకాలుండవు. పైగా 2.50 లక్షల కోటా వాహనాలపై ప్రస్తుతం ఉన్న 110 శాతం సుంకాలు 10 శాతానికి తగ్గిపోతాయి.


## నిర్మాణాత్మక చర్చ జరపాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం వెనక్కి తీసుకోదని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు స్పష్టం చేశారు. పార్లమెంట్ ఇప్పటికే దేశం ముందు ఉంచిన చట్టాలపై 'రివర్స్ గేర్' చేయలేమని అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో ప్రధాన దృష్టి బడ్జెట్‌పైనే ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా సభ్యులు ఇతర అంశాలను లేవనెత్తవచ్చని పేర్కొంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో జెపి నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజుతో సహా పలువురు సీనియర్ మంత్రులు, లోక్‌సభ, రాజ్యసభ రెండింటి నుండి వివిధ రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లు పాల్గొన్నారు. బడ్జెట్ సమావేశాలకు సంబంధించిన శాసన సభ ఎజెండాను ప్రభుత్వం ఇవ్వకపోవడంపై కాంగ్రెస్, సిపిఐ(ఎం)తో సహా ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నించాయి. దీనికి ప్రతిస్పందిస్తూ, ఎజెండాను తరువాత పంచుకుంటామని రిజిజు అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా సభ్యులు ఈ అంశాలపై చర్చించవచ్చని ప్రభుత్వం సూచించగా, సంబంధిత మంత్రుల సమాధానాలను అనుమతించే నిర్మాణాత్మక చర్చలను కోరుతూ సిపిఐ(ఎం) ఎంపి జాన్ బ్రిట్టాస్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ధన్యవాద తీర్మానం సందర్భంగా చర్చలు పరిమితంగా ఉన్నాయని, ప్రతిపక్షాల వివరణాత్మక చర్చ డిమాండ్‌ను తీర్చలేవని ఆయన వాదించారు. సమావేశం అనంతరం కిరణ్ రిజుజు మీడియాతో మాట్లాడుతూ పార్లమెంటరీ నిబంధనల ప్రకారం బడ్జెట్ సమావేశాల్లో చర్చలు ప్రధానంగా బడ్జెట్ చుట్టూనే ఉండాలని అన్నారు. 'అఖిలపక్ష సమావేశంలో చాలా మంది సభ్యులు అనేక అంశాలను లేవనెత్తారు. మేము వాటిని గమనించాము. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సమయంలో, బడ్జెట్ చర్చల సమయంలో కూడా వివిధ అంశాలను లేవనెత్తవచ్చని నేను సభ్యులకు తెలియజేశాను. ఇది బడ్జెట్ సెషన్ కాబట్టి, ప్రధాన దృష్టి బడ్జెట్‌పైనే ఉంటుంది' అని ఆయన అన్నారు. పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించిన తర్వాత, ధన్యవాద తీర్మానం ప్రవేశపెడతామని, అందులో అన్ని పార్టీలు పాల్గొంటాయని ఆయన అన్నారు. సూచనలను వినడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది అని రిజిజు అన్నారు. డిఎంకె, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి), వామపక్ష పార్టీలకు చెందిన అనేక మంది ప్రతిపక్ష ఎంపిలు ముఖ్యంగా ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలో 'సర్'పై వివరణాత్మక చర్చను డిమాండ్ చేశారు. అయితే, ఈ అంశంపై మరో చర్చను రిజిజు తోసిపుచ్చారు. గతంలో రెండు సభలలో ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చల సమయంలో దీనిపై విస్తృతంగా చర్చించామని అన్నారు. ఉన్నత విద్యా సంస్థలలో కుల ఆధారిత వివక్షను పరిష్కరించడానికి ఉద్దేశించిన యుజిసి కొత్త నిబంధనల గురించి కూడా పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారని వర్గాలు తెలిపాయి. ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షిరామ్) అధ్యక్షుడు, ఎంపి చంద్రశేఖర్ ఆజాద్ కొత్త మార్గదర్శకాలను సమర్థించారు. పెరుగుతున్న వివక్ష సంఘటనలకు ప్రతిస్పందనగా అవి రూపొందించబడ్డాయని చెప్పారు. ఓట్ల దొంగతనం, సర్, రైతుల వరి సేకరణ, ఎంజి నరేగా పునరుద్ధరణ వంటి అంశాలను తమ పార్టీ లేవనెత్తుతుందని కాంగ్రెస్ ఎంపి మాణికం ఠాగూర్ అన్నారు. కేంద్ర,రాష్ట్ర సంబంధాలు, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో గవర్నర్ కార్యాలయాల దుర్వినియోగంపై చర్చ జరగాలని డిఎంకె, టిఎంసి, వామపక్ష పార్టీలు కూడా డిమాండ్ చేశాయని వర్గాలు తెలిపాయి. అయితే టిడిపి అమరావతి రాజధాని బిల్లు అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతుందని తెలిపింది. భారత్‌-ఇయు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు, 16 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధించాలని కూడా పార్టీ కోరుకుంటున్నట్లు పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీ కృష్ణ దేవరాయలు తెలిపారు. భారత విదేశాంగ విధానంపై సమగ్ర చర్చ అవసరంపై ప్రతిపక్ష పార్టీల మధ్య ఏకాభిప్రాయం ఉందని సిపిఐ(ఎం) నాయకుడు బ్రిట్టాస్ అన్నారు.

## నామినేషన్లు

(మొదటి పేజీ తరువాయి)



అలాగే కార్పొరేషన్ల మేయర్, డిప్యూటీ మేయర్‌ల ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 2,996 వార్డులకుగాను సుమారు 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 8,203 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా, ఓట్ల లెక్కింపుకు 136 కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది. ఈ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు 16,031 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సూచించారు. ఎన్నికల భద్రతపై లా అండ్ ఆర్డర్ అదనపు డిజి మహేశ్ భగవత్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా కఠిన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 22 వేల మంది పోలీసులు ఎన్నికల విధుల్లో పాల్గొంటారని చెప్పారు. 1,926 సెన్సిటివ్, 1,300 అత్యంత క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు చెప్పారు. నిర్మల్, బైంసా, బోధన్, నిజామాబాద్ ప్రాంతాల్లో కమ్యూనల్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని మహేశ్ భగవత్ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో రూ.50 వేల వరకు నగదు మాత్రమే అనుమతిస్తామని, అంతకంటే ఎక్కువ ఉంటే రసీదులు తప్పనిసరిగా చూపాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వెబ్ కాస్టింగ్, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. మేడారం జాతరకు వెళ్లే భక్తులకు తనిఖీల నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపారు.

# ప్రభుత్వ భూముల వేలం అడ్డుకుంటాం

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు



**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రభుత్వ భూములను వేలం వేస్తే వామపక్షాలు, ఇతర ప్రజా సంఘాలతో కలిసి అడ్డుకుంటామని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో వామపక్ష, ఇతర పార్టీల, ప్రజా సంఘాల హనుమకొండ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వామపక్ష, డెమోక్రటిక్ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన గత పది సంవత్సరాలలో వరంగల్ మహానగరంలో అనేక సంవత్సరాల నుండి ప్రజలు కాపాడిన ప్రభుత్వ భూములలో కబ్జాలు చేయడం, పార్టీల భవనాలు కట్టడం, నాయకులే తీసుకోవడం జరిగిందని, కుడా ద్వారా నిర్మించిన కాంప్లెక్స్ (బస్టాండ్ వద్ద) రిలీజ్ ఇవ్వడం మొదలగు ప్రజా వ్యతిరేక నిర్ణయాలు జరిగాయన్నారు. ప్రధానంగా ప్రభుత్వ భూములను రక్షించాలని, గత పాలకులు చేసిన తప్పుడు లీజులను రద్దు చేయాలని, ప్రభుత్వ భూములు, కుడా భూముల అమ్మకాలను నిలిపివేయాలని, రాబోవు తరాలకు ప్రజల అవసరాలకు ఉండేలా పకడ్బందిగా హద్దులు ఏర్పాటు చేసి రక్షించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. బాలసముద్రంలో పార్కులో నిబంధనలు ఉల్లంఘించి బిఆర్‌ఎస్ కార్యాలయానికి అక్రమంగా నిర్మాణం చేశారన్నారు. బాల సముద్రంలో ఉన్న మరికొన్ని పార్కుల స్థలాలను చుట్టూ ఉన్న రోడ్లను కూడా కబ్జా చేస్తున్నారన్నారు. కూరగాయల మార్కెట్ దగ్గర ఖాళీ ప్లాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్ దగ్గర, మరో ఖాళీ ప్లాటు అన్యాక్రాంతమైనట్లు ఉందన్నారు. ప్రజల భూములు మాయమై పోతున్నాయని, కొత్త బస్టాండ్ దగ్గర కూడా కాంప్లెక్స్ నిర్మాణం చేసి నాయకులకు కారు చౌకగా లీజుకి ఇచ్చినారని, ఈ లీజులకు అంతం లేదని అన్నారు. సుప్రభా హోటల్, చెన్నై మాల్ వెనుక భాగంలో పార్క్ రోడ్డును ఆక్రమించినట్లు ఉందని, మిగిలిన స్థలాన్ని కూడా నిబంధనలకు వ్యతిరేకంగా ఆక్రమించి, కబ్జాదారులు బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లుగా తెలుస్తున్నదన్నారు. గత పాలకులు 500 మంది ఆర్టీసీ కార్మికులు పనిచేస్తున్న టైర్ రీట్రేడింగ్ కంపెనీని మూసివేసి కార్మికులను కరీంనగర్ కు బలవంతంగా బదిలీ చేసి ఆనాటి నాయకులు ఈ 5 ఎకరాల స్థలాన్ని 99 సంవత్సరాల సుదీర్ఘ కాలం లీజుకు ఇవ్వడం జరిగిందన్నారు. వడ్డేపల్లి బతుకమ్మ కుంట ప్రభుత్వ భూమి, అది ఇటీవల మాయమై పోతున్నదని, అక్కడే ఉన్న దశాబ్దాల నుండి ఉన్న స్మశాన వాటిక ప్రభుత్వ భూమి అక్రమార్కుల ఆకలికి మాయమైపోయిందన్నారు. వరంగల్ మహానగరంలో 200 పైన చెరువులు, కుంటలు ఉండేవి. ఇవి కూడా కబ్జాలకు గురైనాయని,తక్షణమే చెరువు, కుంటలు ఎఫ్.టి.ఎల్. హద్దులు నిర్ణయించి, చెరువు కుంటలను కబ్జా చేసిన వారిపై చర్యలు చేపట్టాలన్నారు. "కూడా" మునిసిపాలిటీ అధికారులు నగరంలో ప్రభుత్వ భూముల సమగ్ర సర్వే చేసి కాంపౌండ్లు పెట్టి రక్షించాలని ప్రజలు కోరుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ డిసిసి జిల్లా అధ్యక్షుడు, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ భూముల వేలంకు, లీజులకు తెర లేపిందని, వీటన్నింటిపై విచారణ చేపట్టామని, వాటిపైన న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో పేదలు వేసుకున్న ఇండ్ల స్థలాలకు ప్రభుత్వం తరుపున న్యాయం చేస్తామని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర చైర్మన్, రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల పరిరక్షణకై ఉద్యమించాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ పార్లమెంట్ నియోజక వర్గ కన్వీనర్ అర్షనపల్లి విద్యాసాగర్ రావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంసా రెడ్డి, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ జిల్లా నాయకులు నున్న అప్పారావు, సిపిఐ(ఎం) జిల్లా నాయకులు ఎం. చుక్కయ్య, కాంగ్రెస్ నాయకులు రాయపురం సాంబయ్య, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ కన్వీనర్ పుల్లూరు సుధాకర్, ప్రజా వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ తిరునగరి శేషు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం 2026 క్యాలెండర్‌ను ఛత్రినాక చౌరస్తాలో ఉప్పుగూడ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు కర్ణటి యాదయ్యగౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రూ.12 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో గతంలో గీత కార్మికులకు ఉన్న సొసైటీలను 1/70 చట్టం కింద రద్దు చేసిన హక్కులను తిరిగి పునరుద్ధరించాలన్నారు. ఉద్యమ నిర్మాత బొమ్మగాని ధర్మ భిక్షం గౌడ్ మార్క్సిజం, లెనినిజం, కమ్యూనిజం సైద్ధాంతిక పునాదిగా స్థాపించి 1957లో ఉద్యమాన్ని నిర్మించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాపర్తి నరసింహా గౌడ్, బుడ్డోలం శ్రీశైలం గౌడ్, రవీందర్ గౌడ్, కొప్పుల మహేందర్ గౌడ్, లైనోల రవీందర్ గౌడ్, గడ్డమీది సుశీల గౌడ్, గడ్డమీది హరినాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యోగుల హక్కులను కాపాడుతాం

### రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యోగస్తుల హక్కులను కాపాడుతామని, ముఖ్యంగా మైనారిటీ ఉద్యోగస్తుల హక్కులు పరిరక్షిస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్, వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ 2026 డైరీ, క్యాలెండర్‌ను డాక్టర్ చిన్నారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగబద్దంగా మైనారిటీలకు రావలసిన హక్కులను కాపాడటంలో అవసరమైతే పోరాటం చేసి అవి అమలు అయ్యేట్లు కాంగ్రెస్ పార్టీ పూర్తి చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫరూక్ హుస్సేన్, కార్యదర్శి డాక్టర్ వహీద్‌షా ఖాద్రి, కోశాధికారి ఎం.ఎ.రషీద్, నాయకులు జావేద్ అహ్మద్, తక్వుద్దీన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



### ఎమ్మెల్సీ తక్కళ్లపల్లికి జరిగిన అవమానంపై

## చర్యలకు మండలి చైర్మన్‌కు వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎబిఎన్ డిబేట్‌లో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావుకు జరిగిన అవమానంపైన చర్యలు తీసుకోవాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనచారి ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్ ఎంఎల్‌సిలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మదుసూదనచారి, తక్కళ్లపల్లి రవీందర్ రావు, దేశపతి శ్రీనివాస్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎల్.రమణ,నవీన్ కుమార్‌రెడ్డి బృందం శాసన మండలి చైర్మన్ కార్యాలయంలో గుత్తాసుఖేందర్ రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మధుసూదనచారి మాట్లాడుతూ రవీందర్ రావు పై జరిగిన దాడిని శాసనమండలి సభ్యులపైన జరిగిన దాడిగా బావించి తగిన చర్యలు తీసుకోవాలని చైర్మన్‌ను కోరారు. భవిష్యత్ లో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

## బిఆర్‌ఎస్, బిజెపి స్కాముల పార్టీలు

### తెలంగాణ ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ పేదల అభ్యున్నతి కోసం పనిచేసే స్కీంల పార్టీ అయితే, బిఆర్‌ఎస్, బిజెపిలు పారిశ్రామిక వేత్తలకు దొచిపెట్టే స్కాముల పార్టీ అని తెలంగాణ ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పార్టీలో నటులు ఎక్కువయ్యారనీ, కవులు, కళకారుల నాటకాలకు ప్రస్తుతం రవీంద్రభారతీ వేదికగా ఉందని, ఆ తర్వాత స్థానం తెలంగాణభవన్‌కే దక్కుతుందని చురకలు అంటించారు. రవీంద్రభారతిలో సభ వేదిక అందుబాటులో లేకపోతే, తెలంగాణ భవన్‌కి వెళ్లాలని సూచించారు. రానున్నరోజుల్లో తెలంగాణభవన్‌లో రాజకీయాలు వదిలిపెట్టి, నాటకాలు వేసుకోవాలని కెటిఆర్, హరీష్‌రావులకి సూచించారు. బిఆర్‌ఎస్ హయంలో పదేళ్ల రాష్ట్రంలో కల్వకుంట్ల రాజ్యాంగం అమలులో ఉందని, న్యాయం కోసం నిరసన చేస్తే అరెస్టులు ఉండేవని, వీళ్ళు రాజ్యాంగం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. బిఆర్‌ఎస్ నేతల అబద్ధాలు రాస్తే రామకోటి, చెప్పుకుంటే పోతే భగవద్గీత అంత ఉంటుందని సాయికుమార్ విమర్శించారు.



### కుంభకోణాలను అడ్డుకోవాలని

## గవర్నర్‌కు బిఆర్‌ఎస్ వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సింగరేణి ఒబి గనులు, సోలార్ పవర్ కుంభకోణాలను అడ్డుకోవాలని, ఈ రెండు వ్యవహారాలలో జోక్యం చేసుకుని విచారణకు ఆదేశించాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి. రామారావు గవర్నర్‌ను కోరారు. కెటిఆర్ ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్ ప్రతినిధి బృందం మంగళవారం హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిసి ఫిర్యాదు చేసింది. సింగరేణి కుంభకోణం జరిగిందని, ఈ వ్యవ హారంలో జోక్యం చేసుకోని విచారణకు ఆదేశించాలని గవర్నర్‌ను కోరింది. సమావేశనంతరం కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ సింగరేణి కుంభకోణం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే విచారణ పేరుతో నోటీసులు జారీ చేస్తున్నారని ఆరోపించారు. టెండర్ల విషయంలో గతంలో ఎన్నడూ లేని 'సైట్ విజిట్ సర్టిఫికేషన్' అంటే సైట్ మీదకు రావాలని, అక్కడికి వచ్చినట్టుగా సర్టిఫికెట్ తీసుకోవాలనే నిబంధన పారదర్శకతకు పాతరవేసి, ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. భారత దేశంలో ఎక్కడ ఏ కోల్, బొగ్గు గనిలో లేని నిబంధనను ఇక్కడనే ఎందుకు విధించారన్నారు. దీనికి సంధించి ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తే ఇప్పటి వరకు విడుదల చేయలేదని కెటిఆర్ మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితాఇంద్రారెడ్డి, కొప్పుల ఈశ్వర్, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనచారి, ఎంపి రవి చంద్ర, ఎమ్మెల్సీలు వాణి దేవి, ఎల్.రమణ పాల్గొన్నారు.




### ప్రజల ప్రాణాలు కాపాడడంలో

## హైడ్రా పాత్ర అభినందనీయం

### సిఎం రేవంత్‌రెడ్డి ట్వీట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ మహానగర ఆస్తులు, విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడడంలో హైడ్రా పోషిస్తున్న పాత్ర అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ట్విట్టర్ వేదికగా ఒక ట్విట్ చేశారు. వేల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ ఆస్తులను కాపాడటంతో పాటు నగర సౌందర్యానికి, పర్యావరణ పరిరక్షణకు ఆయువుపట్టులైన చెరువుల రక్షణ, పునరుద్ధరణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆలోచనలను హైడ్రా ఆచరణలో పెడుతోందన్నారు. ఆ క్రమంలో మీర్ ఆలం చెరువు పునరుద్ధరణ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న పలువురు ఇంజనీర్లు, కార్మికులు అనుకోని ఆపదలో చిక్కుకోగా రంగంలోకి దిగి, వారి ప్రాణాలను కాపాడిన హైడ్రా సిబ్బందికి సిఎం ప్రత్యేక అభినందనలు తెలిపారు.

### సింగరేణి కార్మికుల

## సంక్షేమానికి పెద్దపీట

### డిప్యూటీ భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో సింగరేణి కార్మికుల కోసం తాజాగా చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సింగరేణి ఉద్యోగుల మారుపేరు అంశానికి సంబంధించి త్వరంగా పరిష్కారిస్తామన్నారు. అదేవిధంగా మెడికల్ ఇన్వాల్యుయేషన్‌లో వాళ్లకున్న జబ్బులకు సంబంధించి బోర్డులోఉన్న అన్ని విధాల పరిష్కారం చూపిస్తామని తెలిపారు. కోల్ ఇండియ నిబంధన మేరకు సింగరేణిలో అధికారుల సంబంధించిన అన్ని సౌకర్యాలను భరిస్తుందో అదేవిధంగా సింగరేణి కార్మికులకు కూడా అన్ని సౌకర్యాలు (టాక్స్) కల్పించడం కోసం ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేయనుందని వెల్లడించారు. సింగరేణి ఉద్యోగుల సొంతింటి కల నెరవేర్చడానికి ఐఫోర్ కమిటీ నిర్ణయించి సహకారం చేస్తుందన్నారు. సింగరేణి ఉద్యోగులందరికీ దేశంలో ఎక్కడా లేని రీతిలోరూ.1.25 కోట్లతో కల్పించిన ప్రమాద బీమా సౌకర్యం దేశవ్యాప్తంగా ఒక నమూనా పథకంగా గుర్తింపు పొందిందన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న 30 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల కోసం రూ.40 లక్షల ఉచిత ప్రమాద బీమా పథకం అమలు చేయడం జరిగిందని వెల్లడించారు. కారుణ్య నియామకాల్లో వారసుల గరిష్ట వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నామన్నారు.సింగరేణిలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత 2,539 పోస్టులను భర్తీ చేశామని, వీటిలో 798 ఎక్స్ టర్నల్ పోస్టులు ఉండగా... 1,741 కారుణ్య నియామక ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందనీ పేర్కొన్నారు. క్యాథ్ ల్యాబ్‌ల ఏర్పాటు ద్వారా సింగరేణి ఆసుపత్రులను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులుగా మార్చేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. 2024–25 లో సింగరేణి చరిత్రలో అత్యధిక లాభాలు (రూ. 6,394 కోట్లు) సాధించగా అత్యధికంగా 34 శాతం లాభాల వాటా కింద కార్మికులకు రూ.802 కోట్లు, పొరుగు సేవల సిబ్బందికి రూ.5,500 చొప్పున లాభాల వాటా చెల్లించడం జరిగిందని తెలిపారు.

### రెవెన్యూ వ్యవస్థలో

## సమూల మార్పులకు శ్రీకారం

### మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజలకు పారదర్శకంగా వేగవంతమైన అత్యుత్తమ సేవలను అందించడమే లక్ష్యంగా రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత 10 ఏళ్లలో ఆనాటి పాలకుల స్వార్ధపూరిత నిర్ణయాల వల్ల రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందని విమర్శించారు.ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల ఏర్పాటుపై మంగళవారం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ గడచిన రెండేళ్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాలు, సూచనల మేరకు భ్రష్టుపట్టిన వ్యవస్థను సంస్కరిస్తూ రెవెన్యూ సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లష్టర్‌లుగా విభజించి ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థికభారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామన్నారు. అ భవన నిర్మాణంతో పాటు 5ఏళ్లు నిర్వహణాబాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని తెలిపారు. మూడు నుంచి ఐదు ఎకరాల స్థలంలో కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. వివాహ రిజిస్ట్రేషన్ల కోసం మినీ మ్యారేజీ హాల్, గర్భిణీలకు, వృద్దులకు ప్రత్యేక వసతులు, విశాలమైన వెయిటింగ్ ఏరియా మహిళల కోసం ఫీడింగ్ రూమ్, చిన్నపిల్లల కోసం క్రెచ్, వృద్దులు, దివ్యాంగుల కోసం ఆధునిక లిఫ్ట్ సౌకర్యం తదితరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో మిగిలిన కార్యాలయాలకు శంకుస్థాపనలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రెండవ విడతలో జిల్లా కేంద్రాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మిస్తామని ఇందుకు అవసరమైన కార్యాచరణను సిద్దం చేయాలని సూచించారు. ఇప్పటికే తాలిమ్‌లో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని జూన్ 2వ తేదీ నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల మేడ్చల్ జిల్లాలో భవనానికి శంకుస్థాపన చేయడం జరిగిందని పఠాన్ చెరువుశంకరపల్లి ప్రధాన రహదారి సమీపంలో రాజపుష్ప కనస్ట్రక్షన్ నిర్మించే ఇంటిగ్రేటెడ్ భవనానికి బుధవారం శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, ఈ ఆధార్ సంతకం వంటి సౌకర్యాలతో ప్రజల సమయాన్ని ఎంతో ఆదా చేశామని అన్నారు. రెవెన్యూ శాఖలో తీసుకుంటున్న ఈ సంస్కరణలు కేవలం కార్యాలయాల మార్పు మాత్రమే కాకుండా, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే సంస్కరణలుగా నిలుస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు.

## చదువుతోనే అభివృద్ధి సాధ్యం : మంత్రి కోమటిరెడ్డి

### రూ.8 కోట్లతో బొట్టుగూడ పాఠశాల నిర్మాణం



**ప్రజాపక్షం/నల్లగొండ :** అవకాశం ఉంటే విద్యాశాఖ మంత్రిగా కార్పొరేట్ పాఠశాలలను మూసివేయాలని ఉందని, విద్యను కార్పొరేట్ చేసేసి వ్యాపారం చేస్తున్నారని అందరి పిల్లలని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తేనే విద్యావ్యవస్థ మెరుగుపడుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 8కోట్లకు పైగా వ్యయంతో జిల్లా కేంద్రంలో నిర్మించిన బొట్టుగూడ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను మంగళవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎలాంటి వసతులు లేకుండా నిర్వహిస్తున్న బొట్టు గూడ పాఠశాలకు శాశ్వత భవన నిర్మాణం చేపట్టి, 2500 గజాల స్థలంలో అన్ని అత్యాధునిక వసతులతో బొట్టుగూడ ప్రాథమిక,ఉన్నత పాఠశాలను నిర్మించడం జరిగిందని, పేదవాడు చదువుకోవాలని, చదువు ద్వారానే అభివృద్ధి సాధ్యమని మంత్రి అన్నారు. సంప్రదాయ విద్య కాకుండా అన్ని రకాల నైపుణ్యాలను అభివృద్ధి చేసే విధంగా ఒక పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా వాల్డాఫ్ విద్యా విధానాన్ని ఈపాఠశాలలో అమలు చేయడం జరుగుతుందన్నారు. పాత సిలబస్‌తో పాటు, సిబిఎస్ఇ కూడా అమలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ బొట్టు గూడ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను అంతర్జాతీయ ప్రమాణాలతో మంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని నిర్మించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్,ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్ష్యులు హఫీజ్ ఖాన్,ప్రతీక ఫౌండేషన్ సీఈఓ గోనా రెడ్డి,జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి,మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీని సందర్శించిన జపాన్ బృందం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జపాన్ దేశంలోని అయిచి రాష్ట్ర అసెంబ్లీ సభ్యులతో కూడిన అయిచి ఎకనామిక్ డెవలప్‌మెంట్ ఫోరం బృందం తెలంగాణ రాష్ట్ర శాసనసభను సందర్శించారు. ఫోరం చైర్మన్ హిరిహితో కోండో, తొమ్మిది మంది అయిచి రాష్ట్ర ఎంఎల్‌ఎల బృందానికి తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనమండలి కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి అధికారులు స్వాగతం పలికారు. స్పీకర్ ఛాంబర్‌లో సమావేశమై తెలంగాణ అయిచి రాష్ట్ర సభ్యుల బృందం, వివిధ రంగాలలో సహకారంపై చర్చించారు. భారతదేశం జపాన్ దేశాల మధ్య మొదటి నుంచి చారిత్రక స్నేహ సంబంధాలు ఉన్నాయని స్పీకర్ ప్రసాద్ కుమార్, గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం సంస్కృతి, సాంప్రదాయాలు ఉన్నతమైనవన్నారు. శాసనసభలో 119 మంది సభ్యులు, శాసనమండలిలో 40 మంది సభ్యులు ఉన్నారని, శాసనసభ సభ్యులను ఎన్నికల ద్వారా నేరుగా ప్రజలు ఎన్నుకుంటారని వివరించారు. తెలంగాణ శాసనసభలో చర్చలు అర్థవంతంగా జరుగుతున్నాయని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ నినాదంతో తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడానికి కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు.

# సర్టిఫికెట్లు సమర్పించాలని 'సర్' వేధింపులు

### బతుకు దెరువు కోసం వలస వెళ్లినవారే బిజెపి ప్రభుత్వ లక్ష్యం

### ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు సుధా సుందర రామన్ విమర్శ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్పెషల్ ఇన్‌సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో బతుకు దెరువు కోసం వలస వెళ్లిన వారిని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు సుధా సుందర రామన్ విమర్శించారు. చనిపోయిన తమ తండ్రి బర్త్ సర్టిఫికెట్లు సమర్పించాలని కొర్రీలు పెడుతూ మహిళలను వేధిస్తున్నారని మండిపడ్డారు. జీవించే హక్కు కోసం భవిష్యత్తులో ఐద్వా పోరాటాలు కొనసాగిస్తుందన్నారు. హైదరాబాద్‌లోని ఆర్‌టిసి కళ్యాణ మండపంలో ఐద్వా 14వ జాతీయ మహాసభల మూడవ రోజు సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుందరరామన్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్, బిజెపి మహిళలపై దాడులను తీవ్రతరం చేశాయని ఆందోళన వ్యక్తం చేశారు. పౌరసత్వాన్ని నిరూపించుకునే విధంగా డాక్యుమెంట్లను సమర్పించాలనే నిబంధనలు పెట్టడాన్ని తప్పుపట్టింది. 'సర్' పేరుతో బీహార్‌లో ఎన్నికలకు ముందు 65 లక్షల మంది ఓట్లను తొలగిస్తే అందులో 45 లక్షల మందికి పైగా మహిళలు ఉన్నారన్నారు.వాతావరణ మార్పుల ప్రభావం మహిళలను మరింత ఒత్తిడికి గురి చేస్తున్నదని, అనేకసార్లు ప్రకృతి విపత్తుల కారణంగా మహిళలకు నివసించేందుకు చోటు కూడా లభించని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ల కోసం అనేక రాష్ట్రాల్లో అడవులను నరికేస్తుంటే వాతావరణంలో అనూహ్యమైన మార్పులు సంభవించి, ప్రకృతి విపత్తులు వస్తున్నాయని, తద్వారా స్వచ్ఛమైన గాలి, తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని ఆయన చెప్పారు. ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ ఎస్‌సి,ఎస్‌టి, మహిళల బతుకులపైన బిజెపి దాడి చేస్తోందన్నారు.కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో ఐద్వా పాల్గొంటుందని తెలిపారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ అభయ హస్తం పథకంలో భాగంగా రాష్ట్రంలో మహిళలు పొదుపు చేసిన రూ.600 కోట్లను తిరిగి బాధితులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అభయహస్తం పథకాన్ని పునరుద్దరించాలని కోరారు. విబిజిరామ్‌జి చట్టాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు.

## పలు తీర్మానాలు ఆమోదం

ఐద్వా మహాసభ మూడవ రోజు పలు తీర్మానాలను ఆమోదించింది. ఉన్నత విద్యను కాషాయీకరణ, వాణిజ్యీకరణ, కేంద్రీకరణకు వ్యతిరేకంగా,మహిళా వ్యతిరేక కార్మిక చట్టాలు. జాతీయ కార్మిక విధానం 2025ను రద్దు చేయాలని, మహిళలకు సురక్షితమైన సరసమైన రుణ హక్కు ఉండాలని, మహిళల సంక్షేమం, సామాజిక న్యాయం కోసం కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం సాధించిన విజయాలను అభినంధిస్తూ, పర్యావరణ క్షీణతను ప్రతిఘటించాలని, ఆదివాసీల హక్కులపై దాడిని వ్యతిరేకించాలని, దళిత మహిళలకు సమానత్వం, గౌరవం, న్యాయం కల్పించాలని, పాఠశాలల విలీనం, మూసివేతకు వ్యతిరేకంగా ఐద్వా మహాసభ తీర్మానం చేసింది.

ప్రజాస్వామ్యం, సమానత్వ విలువలు థీమ్‌తో ఈ నెల 31న గద్దర్ జయంతి సభను హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్టు గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు జి.వి.సూర్యకిరణ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ సంపాదకులు అల్లం నారాయణ, మాజీ ఎంఎల్‌ఎ క్రాంతి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, పృథ్వీ తదితరులతో కలిసి గద్దర్‌జయంతి సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు.

**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on X @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

**ఆహ్వాన నోటీసు ఇ-టెండర్ నెం. E29CTrDSC_12-2025-26, తేదీ: 27.01.2026**
PUB/1819/26

చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, కన్స్ట్రక్షన్, సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్, టెండరింగ్ యొక్క రెండు ప్యాకెట్ల పద్ధతిలో ఈ క్రింది పనుల కోసం భారత రాష్ట్రపతి తరపున ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.: 1, **NIT No.:** E29CTrDSC_12-2025-26 తేదీ 22.01.2026, **పని పేరు:** టెండర్ నెం. E29CTrDSC_12-2025-26 తేదీ 22.01.2026, 'సౌత్ సెంట్రల్ రైల్వేలోని నాందేడ్ డివిజన్‌లో "1. పర్భణి-పార్లి వైజినాథ్ సెక్షన్ మధ్య డబ్లింగ్ పనుల సందర్భంగా గంగాఖేర్ యార్డ్‌లో ప్రతిపాదిత యార్డ్ ఏర్పాట్లు మరియు 2) ముద్ఖేడ్ జంక్షన్ వద్ద ముద్ఖేడ్ - ఆదిలాబాద్ మరియు ముద్ఖేడ్ - సికింద్రాబాద్ లైన్లను కలిపే ముద్ఖేడ్ బైపాస్ లైన్, ఇందులో ముద్ఖేడ్ యార్డ్ నుండి సికింద్రాబాద్ వైపు బై-పాస్ టేక్-ఆఫ్ వరకు డబ్లింగ్ లైన్ కూడా ఉంది" దృష్ట్యా, ఇప్పటికే ఉన్న OHEకి మార్పులతో సహా 2x25kV, 50Hz సింగిల్ ఫేజ్ ఎ.సి. ట్రాక్షన్ ఓవర్‌హెడ్ పరికరాల (65 చ.మి.మీ. కేటెనరీ మరియు 107/150 చ.మి.మీ. హెచ్డిజి కాపర్ కాంటాక్ట్ వైర్‌తో) డిజైన్, సరఫరా, ఏర్పాటు, పరీక్ష మరియు ప్రారంభోత్సవం, LT సరఫరా ట్రాన్స్‌ఫార్మర్ స్టేషన్లు.' **వివరాల అంచనా వ్యయం:** రూ. 15,12,09,525.76/-, **ఇఎండి/బిడ్ సెక్యూరిటీ:** రూ.9,06,100.00/-, **పత్రాల ధర:** ఆన్‌లైన్ టెండర్ పత్రాన్ని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. **పూర్తి చేయు కాలపరిమితి:** 09 నెలలు. **ముగింపు తేదీ:** 19.02.2026 మధ్యాహ్నం 3:00 గంటలకు.

1) బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కోసం, దయచేసి http://ireps.gov.in వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వండి. 2) బిడ్డర్ IREPS.gov.in ద్వారా బిడ్ సెక్యూరిటీని అందించాలి లేదా బ్యాంక్ ఆఫ్ ఇండియాలోని షెడ్యూల్ వాణిజ్య బ్యాంకు నుండి బ్యాంక్ గ్యారెంటీ బాండ్‌గా సమర్పించాలి. బ్యాంక్ గ్యారెంటీ బాండ్ అనుబంధం-VII ప్రకారం ఉంటుంది మరియు బిడ్ చెల్లుబాటు వ్యవధి తర్వాత 90 రోజుల వరకు చెల్లుబాటు అవుతుంది. డిమాండ్ డ్రాఫ్ట్, బ్యాంకర్స్ చెక్కు, డిపాజిట్ రసీదులు, FDR మొదలైన వాటి ద్వారా మాన్యువల్ చెల్లింపు అనుమతించబడదు. 3) టెండర్ సమర్పణ వ్యవధిలో అంటే టెండర్ ముగింపుకు పదిహేను రోజుల వ్యవధిలో టెండరర్ తమ ఆఫర్లను ఆన్లైన్లో సమర్పించవచ్చు. 4) టెండర్ సమర్పణ వ్యవధి ప్రారంభమయ్యే తేదీ వరకు ఏదైనా కొరిజెండా (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది) కోసం టెండరర్ గమనించాలి.

చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/నిర్మాణం/సికింద్రాబాద్.

**ఓపెన్ ఇ-టెండర్ ప్రకటన నెం. C/E.29/Elec/M/SC/35 & 36/OEW/OT/2025-26 తేది 24.01.2026**
PUB/1820/26

భారత రాష్ట్రపతి తరఫున మరియు వారి ఆదేశానుసారం, దిగువ సరితకం చేసిన వారు 16.02.2026వ తేదీన మధ్యాహ్నం 3.00 గంటల వరకు దిగువ ఇవ్వబడిన పని కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.: 1, **ఇ-టెండర్ నెం.:** ఇ-టెండర్ నెం. C/E.29/Elec/M/SC/35/OEW/OT/2025-26 ఇ-టెండర్ నెం. E-M-SC-35-OT-2025-26, **పని పేరు:** సికింద్రాబాద్ డివిజన్ ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్, విద్యుత్ సరఫరా ఏర్పాట్ల విశ్వసనీయతను మెరుగుపరచడానికి MLY-KZJ సెక్షన్, SNF-VKB సెక్షన్ మరియు BIDR-PARLI సెక్షన్లలోని సర్వీస్ భవనాలు / కాలనీలు మొదలైన వాటిని కవర్ చేసే ఓవర్‌హెడ్ లైన్లను అండర్‌గ్రౌండ్ కేబుల్స్‌గా మార్చడం. **టెండర్ విలువ (రూ.):** 7,07,17,503.20, **EMD (రూ.):** 5,03,600.00, **CTF (రూ.):** 0.00, **పూర్తి చేయు కాలం:** 6 నెలలు

క్ర.సం.: 2, **ఇ-టెండర్ నెం.:** ఇ-టెండర్ నెం. C/E.29/Elec/M/SC/36/OEW/OT/2025-26 ఇ-టెండర్ నెం. E-M-SC-36-OT-2025-26, **పని పేరు:** సికింద్రాబాద్ డివిజన్ ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్: షెడ్యూల్ A - SNF & HYB డిపోల అధికార పరిధిలోని సిబ్బంది క్వార్టర్లు & సర్వీస్ భవనాలలో పాతబడిన RCCBs/MCBs/ MCCBs/LT ప్యానెళ్ల మెరుగుదలలు. షెడ్యూల్ B - SC డివిజన్ వ్యాప్తంగా సాంప్రదాయ సీలింగ్/వాల్ మౌంటెడ్/ పెడెస్టల్ ఫ్యాన్ల స్థానంలో శక్తి సామర్థ్యం గల ఫ్యాన్ల (BLDC) ఏర్పాటు. - విద్యుత్ ఏర్పాట్లు. **టెండర్ విలువ (రూ.):** 3,58,51,761.80, **EMD (రూ.):** 3,29,300.00, **CTF (రూ.):** 0.00, **పూర్తి చేయు కాలపరిమితి:** 6 నెలలు

1. టెండర్ షరతులు / ఇతర వివరాలు "www.ireps.gov.in" లోని టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి. వాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు, టెండర్‌లో పాల్గొనవచ్చు మరియు IREPS వెబ్‌సైట్‌లోని ఏవైనా మార్పులు ఉంటే వాటిని చూడవచ్చు.
2. ఈ టెండర్ నోటీసును సికింద్రాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్‌లోని సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (మెయింటెనెన్స్) వారి కార్యాలయంలోని నోటీసు బోర్డులో కూడా ప్రదర్శించబడింది, దీనిని అన్ని పని దినాలలో చూడవచ్చు.
3. ఎటువంటి కారణం చూపకుండానే టెండర్‌ను రద్దు చేసే హక్కు రైల్వేకు రిజర్వ్ చేయబడింది.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (మెయింటెనెన్స్)/సికింద్రాబాద్.

**ఓపెన్ టెండర్ నోటీసు నెం: B-E29-TRD-TNDR-37-2025-26 తేది: 22.01.2026**
PUB/1821/26

**టెండర్ నెం.:** B-E29-TRD-TNDR-37- 2025-26. **పని పేరు:** విజయవాడ డివిజన్ - 'తుని, AKP మరియు YLM స్టేషన్లలో ప్లాట్‌ఫారమ్ యొక్క మిగిలిన పొడవు వద్ద COP షెల్టర్ల ఏర్పాటుతో పాటు, తుని & AKP స్టేషన్లలో ప్లాట్‌ఫారమ్ మరియు ఇతర ప్రయాణీకుల సంబంధిత సౌకర్యాల మెరుగుదలకు సంబంధించి OHEలో అదనపు పనులు చేర్పులు మరియు మార్పులు. **సుమారు విలువ:** రూ. 3,36,76,389.28. **పనుల పూర్తి కాలం:** 12 నెలలు. **బిడ్ సెక్యూరిటీ (EMD):** రూ. 3,18,400/-. **ముగింపు తేదీ:** 13.02.2026. **టెండర్ ఫారం ధర:** ఏమీ లేదు.

పూర్తి వివరాలు మరియు షరతుల కోసం మా వెబ్‌సైట్ 'www.ireps.gov.in' ను సందర్శించండి.
**గమనిక:** టెండర్లు తెరిచే తేదీన సెలవుదినం అయితే, టెండర్లు తదుపరి పని దినాన తెరవబడతాయి.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/TrD/ డిపార్ట్‌మెంట్/విజయవాడ

**ఓపెన్ టెండర్ నోటీసు నెం: B-E29-TRD-TNDR-38-2025-26 తేది: 22.01.2026**
PUB/1822/26

**టెండర్ నెం.:** B-E29-TRD-TNDR-38- 2025-26. **పని పేరు:** విజయవాడ డివిజన్-GDV-MTM సెక్షన్: 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో NH(O) కింద EPC పద్ధతిలో, గుడివాడ మరియు మచిలీపట్నం రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే కి.మీ 2/8-10 వద్ద, NH 165లోని కి.మీ. 231+700 వద్ద ఉన్న LC నెం. 3E/SPL 3 స్థానంలో ప్రతిపాదిత రెండు లేన్ల రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి, గుడివాడ బైపాస్ పట్టణ ప్రాంతంలో 9+660 నుండి రోడ్డు మెరుగుదల పనులతో సహా OHEలో చేర్పులు మరియు మార్పులు. **సుమారు విలువ:** రూ. 66,21,525.48. **పూర్తి చేయు కాలం:** 12 నెలలు. **బిడ్ సెక్యూరిటీ (EMD):** రూ. 1,32,400/-. **ముగింపు తేదీ:** 19.02.2026. **టెండర్ ఫారం ధర:** ఏమీ లేదు.

పూర్తి వివరాలు మరియు షరతుల కోసం మా వెబ్‌సైట్ 'www.ireps.gov.in' ను సందర్శించండి.
**గమనిక:** టెండర్లు తెరిచే తేదీన సెలవుదినం అయితే, టెండర్లు తదుపరి పని దినాన తెరవబడతాయి.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/TrD/ విజయవాడ.
A2303

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

# తెలంగాణ ఇక ఎలక్ట్రిక్ వాహనాల హబ్

### రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రం ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి చిరునామాగా, హైదరాబాద్ నగరం ఈ రంగానికి రాజధానిగా మారబోతోందని రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ అన్నారు. దేశంలో ఇప్పటికే ఈవీ విప్లవం మొదలైందని, పర్యావరణ హితమైన ఈ మార్పును ప్రజలందరూ ఆహ్వానించాలని ఆయన కోరారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సిఐ)లో దేశంలోనే మొదటిసారిగా ప్రవేశపెట్టిన 'ఎలక్ట్రిక్ వెహికల్ బ్యాటరీ సస్టైనబిలిటీ ఇం జనీర్' కోర్సు మెటీరియల్‌ను నవీన్ మిట్టల్ ఆవిష్కరించారు. పెట్రోలియం దిగుమతుల కోసం దేశం బిలియన్ల కొద్దీ నిధులను ఖర్చు చేస్తోందని, ఇది ఆర్థిక వ్యవస్థపై భారాన్ని పెంచుతోందన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా సోలార్, ఎలక్ట్రిక్ ఎనర్జీని వినియోగించుకోవడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో వందలాది ఎలక్ట్రిక్ బస్సు లు, వేలాది కార్లు తిరుగుతున్నాయని, భవిష్యత్తు అంతా ఎలక్ట్రిక్ వాహనాలదేనని ఆయన స్పష్టం చేశారు. ఈఎస్‌సిఐ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు ఈ కొత్త కోర్సు విశేషాలను వెల్లడించారు.

- **కోర్సు పేరు :** ఎలక్ట్రిక్ బ్యాటరీ సస్టైనబిలిటీ ఇంజనీర్ (పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమాతో సమానం).



- **అర్హత :** 18 నుండి 45 ఏళ్ల లోపు ఉండి, బి.టెక్ (మెకానికల్,ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్, ఎన్విరాన్మెంట్) పూర్తి చేసిన వారు లేదా ఫైనల్ ఇయర్ విద్యార్థులు.
- **శిక్షణ విధానం :** మొత్తం 600 గంటల శిక్షణ (150 గంటల థియరీ, 330 గంటల ప్రాక్టికల్స్, 120 గంటల ఆన్‌దిజాబ్ ట్రైనింగ్).
- **ఫీజు :** కేవలం రూ. 20,000.
- **సిలబస్ :** బ్యాటరీ టెక్నాలజీ, రీసైక్లింగ్, సేఫ్టీ, కార్బన్ క్రెడిట్ విధానాలు.

**యువతకు ఉపాధి అవకాశాలు..**

ప్రధాని మోదీ ఆశించిన 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో భాగంగా, నిరుద్యోగ యువతకు ఈ కోర్సు ఎంతో మేలు చేస్తుందని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (ఐఈఐ) ప్రతినిధులు మనీష్ మహేంద్ర కొఠారి,
వి.బి. సింగ్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వివిధ ఇంజనీరింగ్ కళాశాలలు సిఎంఆర్ గోకరాజు రంగరాజు, అనురాగ్, ఎంజిఐటి తదితర విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.



# పులుల గణన సర్వే సక్సెస్

- 6రోజుల పాటు శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వాహణ
- ములుగు మినహా 32 జిల్లాల్లో సర్వే పూర్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో పులుల గణన సర్వే (ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్–2026) విజయవంతంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా జనవరి 19 నుంచి 25 వరకు ఆరు రోజులపాటు శాస్త్రీయ పద్ధతుల్లో ఈ సర్వే చేపట్టారు. సమ్మక్క–సారలమ్మ జాత ర నేపథ్యంలో ములుగు జిల్లాను మినహాయిం చి, 32 జిల్లాల్లోని అన్ని బీట్‌లలో సర్వే పూర్తి చేసినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. సర్వేలో భాగంగా 15 కిలోమీటర్ల మేర కార్నివోర్ సైన్ సర్వే, రోజుకు 2 కిలోమీటర్ల ట్రాన్సెక్ట్ సర్వే నిర్వహించి అటవీ వృక్షజాలం, ఆహార జంతువుల సాంద్రతను అంచనా వేశారు. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారాన్ని ఎంస్ట్రిప్స్ యాప్‌లో నమోదు చేసి, వైల్డ్‌ఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా రిమోట్ సర్వర్‌కు అప్‌లోడ్ చేశారు.ప్రాథమిక గణాంకాల ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా పులులు, ఇతర మాంసాహార జంతువుల ఉనికికి సంబంధించి 994 ఆధారాలు లభించాయి. అలాగే 552 పెద్ద శాకాహార జంతువులకు సంబంధించిన ఆధారాలను అధికారులు గుర్తించారు. ఇతర వన్యప్రాణుల ఆనవాళ్లు కూడా పెద్ద సంఖ్యలో లభ్యమయ్యాయి. ఈ సర్వేలో 4,512 మంది అటవీ శాఖ సిబ్బందితో పాటు దేశ నలుమూలల నుంచి వచ్చిన 1,677 మంది వాలంటీర్లు పాల్గొన్నారు.సర్వే సమయంలో కొన్ని విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. విధి నిర్వహణలో ఒక అటవీ వాచర్ గుండె పోటుతో మృతి చెందగా, ఎలుగుబంటి దాడిలో ఒకరు గాయపడ్డారు. మరొక వాలంటీర్‌కు కాలు విరిగింది. ఇన్ని ప్రతికూల పరిస్థితుల మధ్య అటవీ సిబ్బంది, వాలంటీర్లు సమన్వయంతో పనిచేసి సర్వేను నిర్దేశిత సమయంలో పూర్తి చేశారు. వన్యప్రాణి సంరక్షణలో తెలంగాణ అటవీ శాఖ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ఈ సర్వే ద్వారా వెల్లడైందని అధికారులు తెలిపారు.పులుల గణన సర్వే నివేధికను కేంద్రానికి పంపించారు. అన్ని రాష్ట్రాల నుంచి అందిన నివేధికల ఆధారంగా దేశంలో పులల సంఖ్యపై కేంద్రం ప్రకటన చేస్తుంది.

# సర్వాంగ సుందరంగా రాయసముంద్రం చెరువు పునరుద్ధరణ

### హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జలవనరుల పరిరక్షణ, ప్రజల ప్రాణరక్షణే ధ్యేయంగా హైడ్రా తన కార్యకలాపాలను ముమ్మరం చేసింది. మంగళవారం హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ క్షేత్రస్థాయిలో పర్యటించి రాయసముద్రం చెరువు అభివృద్ధి, రహదారి ఆక్రమణల తొలగింపు, విపత్తుల సమయంలో ప్రాణాలు కాపాడిన సిబ్బందిని సన్మానించడం వంటి కీలక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాయసముద్రం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రంగనాథ్ అన్నారు. చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. సుమారు 120 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువును పర్యటక ప్రాంతంగా మార్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. వాకింగ్ ట్రాక్, పార్కులు, పిల్లల ప్లే ఏరియా, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయనున్నారు. చెరువులోకి మురుగు నీరు చేరకుండా బిహెచ్‌ఈఎల్ అధికారులతో చర్చించి పైపులైన్‌లు, ఎస్‌టిపిలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. 'హైడ్రా అంటే ఇళ్లు కూల్చే సంస్థ కాదు. ఇప్పటికే నిర్మించుకున్న ఇళ్ల జోలికి వెళ్లం. కేవలం నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొలగిస్తాం' అని కమిషనర్ స్పష్టం చేశారు.





**మీరాలం చెరువులో ప్రాణాలు కాపాడిన.. సిబ్బందిని అభినందించిన రంగనాథ్**

మీరాలం చెరువులో గుర్రపు డెక్క, మొసళ్ల భయం మధ్య చిక్కుకుపోయిన 9 మంది కార్మికులను కాపాడిన హైడ్రా బృందాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. 'ప్రజల ఆస్తులే కాకుండా, ప్రాణాలను కాపాడటంలో హైడ్రా పాత్ర అభినందనీయం' అని ఆయన ట్వీట్ చేశారు. ప్రాణాలకు తెగించి రక్షణ చర్యలు చేపట్టిన డిఆర్‌ఎఫ్ రెస్క్యూ టీం ఇన్‌చార్జ్ స్వామి, ఎస్‌ఎఫ్‌ఓ మహమ్మద్ జమీల్, బృందాన్ని కమిషనర్ రంగనాథ్ నగదు బహుమతి, ప్రశంసా పత్రాలతో సన్మానించారు. గతంలో మూసీ వరదల్లో, క్వారీలో దూకిన విద్యార్థిని కాపాడటంలో కీలక పాత్ర పోషించిన స్వామిని ప్రత్యేకంగా అభినందించారు.

**కాచవాని సింగారంలో ప్రహరీ కూల్చివేత**

మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం కాచవాని సింగారంలో దశాబ్ద కాలంగా నెలకొన్న రహదారి ఆక్రమణ సమస్యను హైడ్రా పరిష్కరించింది. 40 అడుగుల రహదారిలో 13 అడుగుల మేర ఆక్రమించి నిర్మించిన కిలోమీటరు పొడవైన ప్రహరీ గోడను అధికారులు మంగళవారం తొలగించారు. దివ్యానగర్ సింగరేణియన్స్ వెల్ఫేర్ సొసైటీ ఫిర్యాదు మేరకు స్పందించిన హైడ్రా, నిబంధనల ప్రకారం రోడ్డును తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది.

# ఫిబ్రవరి 2న దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు: విజయరాఘవన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 2వ తేదిన దేశ వ్యాప్తంగా అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు ఆల్ ఇండియా అగ్రికల్చర్ వర్కర్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు ఎ.విజయరాఘవన్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఆర్‌టిసి కళ్యాణ మండపంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ చట్ట సవరణ సందర్భంగా ఎటువంటి చర్చ లేకుండానే ఆమోదించారని మండిపడ్డారు. పార్లమెంట్‌లో చాలా మంది ఎంపిలు కోటీశ్వరులు అని, వారికి పేదలు, కార్మికుల సమస్యలు తెలియవని, అందుకే ఈ చట్ట సవరణ వల్ల జరిగే ప్రమాదం, కార్మికులకు కలిగే నష్టం కూడా వారికి తెలియదని ఎద్దేవా చేశారు.

# రైల్వే భద్రతే లక్ష్యం

**12 మందికి 'ఎంప్లాయ్ ఆఫ్ ది మంత్' అవార్డులు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైలు నిర్వహణలో భద్రతపై మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిన దక్షిణ మధ్య రైల్వే, అప్రమత్తతతో విధులు నిర్వహించిన ఉద్యోగులను సత్కరించింది. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ బుధవారం సికింద్రాబాద్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో 12 మంది ఉద్యోగులకు 'ఎంప్లాయ్ ఆఫ్ ది మంత్' అవార్డులు ప్రదానం చేశారు.అసురక్షిత పరిస్థితులను ముందుగానే గుర్తించి, ప్రమాదాలను నివారించడంలో నిబద్ధత చూపినందుకు ఈ అవార్డులు అందజేశారు. స్టేషన్ మాస్టర్లు, లోకో పైలట్లు, పాయింట్స్‌మన్, కీమ్యాన్‌లాంటి కీలక విధులు నిర్వహించే సిబ్బంది ఈ గౌరవాన్ని అందుకున్నారు.సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన ముగ్గురు, గుంటూరు డివిజన్‌కు ఇద్దరు, విజయవాడ డివిజన్‌కు ఇద్దరు, గుంతకల్ డివిజన్‌కు ఐదుగురు ఉద్యోగులు అవార్డులు పొందారు. అవార్డు గ్రహీతలను జనరల్ మేనేజర్ అభినందించి, వారి అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ తరహా ప్రోత్సాహకాలు ఉద్యోగుల్లో మరింత అప్రమత్తతను పెంచుతాయని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు ప్రధాన అధికారి



సత్య ప్రకాశ్‌తో పాటు అన్ని విభాగాల ప్రధానాధికారులు పాల్గొన్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ డివిజన్ల డిఆర్‌ఎంలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, అనవసర అంచనాలు, నిర్లక్ష్యమే ప్రమాదాలకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. అధికారులు, పర్యవేక్షకులు క్రమం తప్పకుండా భద్రతా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.పనిస్థలాలు, నిర్మాణ ప్రాంతాల్లో అకస్మాత్తు తనిఖీలు చేసి భద్రతా నిబంధనలు కచ్చితంగా అమలవుతున్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. పని ప్రదేశాల్లో భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించాల్సిందేనని స్పష్టం చేశారు.

# పోలీస్ విధుల కేటాయింపులో ఎఐ వినియోగం

### మానవ ప్రమేయం లేకుండానే పూర్తి పారదర్శకత అత్యాధునిక 'జనరేటివ్ ఎఐ' విధానాన్ని ప్రారంభించిన సిపి సజ్జనర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సాంకేతికత వినియోగంలో నగర పోలీసులు మరో ముందడుగు వేశారు. సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ (సిఏఆర్) సిబ్బంది విధుల కేటాయింపులో మానవ ప్రమేయం లేకుండా, పూర్తి పారదర్శకతతో కూడిన అత్యాధునిక 'జనరేటివ్ ఏఐ' విధానానికి శ్రీకారం చుట్టారు. బషీర్‌బాగ్‌లోని పాత కమిషనర్ కార్యాలయంలో మంగళవారం నగర సిపి విసి సజ్జనర్ ఉన్నతాధికారులతో కలిసి ఈ నూతన విధానాన్ని ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పోలీస్ సిబ్బందికి విధుల కేటాయింపును పారదర్శకంగా, జవాబుదారీతనంతో మార్చడం కోసమే అత్యాధునిక 'జనరేటివ్ ఏఐ' విధానాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ విధాన రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన హన్స ఈక్విటీ పార్ట్‌నర్స్ ఎల్‌ఎల్పికి చెందిన త్రినాథ బాబు, సునీల్ రేగులని ఈ సందర్భంగా అభినందించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద 1,796 దరఖాస్తులను పరిశీలించి, సెక్రటేరియట్, సిఎం ఆఫీస్, ట్రాఫిక్ తదితర విభాగాలతో పాటు ఇంటర్‌సెప్టర్ వాహనాలకు సంబంధించిన 208 డ్యూటీలను సమర్థంగా కేటాయించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో అదనపు సిపిలు ఎం.శ్రీనివాస్, తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సిపిలు డి. జోయల్ డేవిస్, శ్వేత, ఆర్.వెంకటేశ్వర్లు తదితర పాల్గొన్నారు.



**ఈ విధానం ప్రత్యేకతలు**

'హంగేరియన్ మెథడ్' అనే సాంకేతిక పద్ధతి ద్వారా సిబ్బంది సీనియారిటీ, రిజర్వ్‌లో ఉన్న రోజులు, రివార్డులు, క్రమశిక్షణ, ఆరోగ్యం వంటి అంశాలను స్కోర్ ఆధారంగా పరిగణనలోకి తీసుకొని కంప్యూటరే విధులను ఖరారు చేస్తుంది. ఇందులో అధికారుల జోక్యం అస్సలు ఉండదు. ఓపెన్ ఏఐ సాయంతో డ్యూటీ అలాట్‌మెంట్ ఆర్డర్లు క్షణాల్లో తయారవుతాయి. దీనివల్ల ఆఫీసు పనిభారం తగ్గి, పోలీసులు శాంతిభద్రతలపై మరింత దృష్టి పెట్టవచ్చు.ఉద్యోగుల సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేక 'ఏఐ చాట్ బాట్' అందుబాటులో ఉంటుంది. డ్యూటీ అలాట్‌మెంట్‌కు సంబంధించిన అన్ని విషయాలకు చాట్ బాట్ సమాధానం ఇస్తుంది.

# రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాలు వెంటనే చెల్లించాలి

### ఇందిరా పార్క్ ధర్నాలో బిజెపి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరా పార్క్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. బిజెపి ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు, పెద్ద ఎత్తున రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు ఈ ధర్నాకు మద్దతు ఇచ్చారు. రాంచందర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల పట్ల అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రంలో రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన పిఆర్‌సి, డిఏ, గ్రాట్యూటీ, కమ్యూటేషన్, జిపిఎఫ్ వంటి ప్రయోజనాలు దాదాపు రూ. 2,000 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గతంలో కెసిఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు కానీ, ప్రస్తుత డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఇచ్చిన 'నెలవారీ రూ. 700 కోట్ల విడుదల' హామీ కానీ అమలుకు నోచుకోలేదన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల హక్కుల కోసం బిజెపి తన ధర్మ యుద్ధాన్ని కొనసాగిస్తుందన్నారు.

# కల్వకుంట్ల ఫ్యామిలీ ఓ డ్రామా కంపెనీ

### ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కల్వకుంట్ల ఫ్యామిలీ ఓ డ్రామా కంపెనీ అని, బావబామ్మర్ది ఇకపై అసత్య ప్రచారాలు, అబద్ధపు ఆరోపణలు అంటూ డ్రామాలు వేసుకోవాల్సిందేనని ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్ అన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణభవన్ పేరును కల్వకుంట్ల డ్రామా భవన్‌గా మార్చుకోవాలని సూచించారు. ఫోన్ ట్యాపింగ్ ఇష్యూ నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే, సింగరేణి కోల్ టెండర్లపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సింగరేణి ఒక అ




టానమస్ సంస్థ అని, సింగరేణి సంస్థ ప్రోసిజర్స్ ప్రకారమే నిర్ణయాలు జరుగుతాయని, ఆరోపణలు రాగానే రాష్ట్ర ప్రభుత్వం టెండర్లను రద్దు చేసిందని తెలిపారు. సైట్ విజిట్ అనే నిబంధన కోల్ ఇండియా 2018లోనే ప్రవేశ పెట్టిందని, ఇప్పుడు ప్రజా ప్రభుత్వం కొత్తగా పెట్టింది ఏమీ కాదని చెప్పారు. దేశంలోని చాలా కేంద్ర ప్రభుత్వ సంస్థలు, రాష్ట్ర సంస్థలు సైట్ విజిట్ నిబంధనలు అమలు చేస్తున్నాయని, అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ రైల్వే, హిందూస్థాన్ కాపర్ లిమిటెడ్ లోనూ ఇదే నిబంధన ఉందని స్పష్టం చేశారు. పదేళ్లలో వారు చేయని స్కాం లేదు, దోచుకొని రంగం లేదని మండిపడ్డారు. 'మీ ఆడ బిడ్డ చేసిన ఆరోపణలకు ఆన్సర్ చేసే దమ్ము, ధైర్యం లేదు. మీ చెల్లె నీపై, నీ బావపై చేసినవి తప్పుడు ఆరోపణలు అయితే, ప్రెస్‌మీట్ పెట్టి నిజమెంటో చెప్పు, మౌనంగా ఉంటే చేసిన ఆరోపణలన్నీ ఒప్పు అన్నట్లే కదా' అని వెంకట్ ప్రశ్నించారు.

# 'భద్రం నాన్న' షార్ట్ ఫిలిం ఆవిష్కరించిన డిజిపి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రోడ్డు భద్రతపై సర్వేజన ఫౌండేషన్ రూపొందించిన 'భద్రం నాన్న' షార్ట్ ఫిలింను డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి మంగళవారం నాడు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సర్వేజన ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ గురవారెడ్డి, సిఓఓ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ బి. జనార్ధన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం తాము చేపడుతున్న రోడ్డు భద్రతా కార్యక్రమాలను డిజిపికి వివరించారు. రహదారి ప్రమాదాల నివారణే ధ్యేయంగా ఫౌండేషన్ రూపొందించిన ప్రత్యేక రోడ్డు భద్రత స్టిక్కర్‌ను, అలాగే వాహనదారుల్లో బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌పై అవగాహన కల్పించేందుకు ఈ షార్ట్ ఫిలిం దోహదపడుతుందన్నారు. రహదారి భద్రత కోసం స్వచ్ఛంద సంస్థలు పోలీసు శాఖతో కలిసి పని చేయాల్సిన ఆవశ్యకతను ఈ భేటీ సందర్భంగా ప్రతినిధులు ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ అనిల్ గొర్రె, రోడ్డు సేఫ్టీ మేనేజర్ సిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ బోర్డును జిహెచ్‌ఎంసిలో విలీనం చేయాలి

### ఎంఎల్‌ఎ శ్రీగణేష్ దీక్షకు మద్దతు తెలిపిన మెట్టు సాయికుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం కంటోన్మెంట్ బోర్డును వెంటనే జిహెచ్‌ఎంసిలో విలీనం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. విలీనంపై కంటోన్మెంట్ ఎంఎల్‌ఎ శ్రీగణేష్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షకు ఆయన మద్దతు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డు కేంద్రప్రభుత్వ ఆధీనంలో ఉండడంతో, ఆ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి చేయలేక పోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులను తీసుకువచ్చి, అభివృద్ధి చెయ్యాలన్నా కూడా కంటోన్మెంట్ బోర్డు నుంచి ఎన్‌ఓసిల అవసరం ఏర్పడిందని తెలిపారు. ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ చార్జీలు రాష్ట్ర ప్రభుత్వంలో 7.5 శాతం ఉంటే, కంటోన్మెంట్‌లో 11 శాతం ఉందని, అంటే 3.5 శాతం అదనంగా చెల్లించాల్సి వస్తుందన్నారు. 2020లో జరగాల్సిన కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గత 6 సంవత్సరాలుగా తమ పార్టీకి చెందిన వ్యక్తులను సంవత్సరానికి ఒకరి చొప్పున నామినేట్ చేసి, నామినేటెడ్ వ్యవస్థతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ కాలం వెళ్ళదీస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన సర్వీస్ ఛార్జీలు రూ. 1200 కోట్లను కూడా విడుదల చేయకుండా కంటోన్మెంట్ అభివృద్ధికి బిజేపీ మోకాలడ్డుతుందని సాయికుమార్ మండిపడ్డారు.

# సంస్కరణలతో దూసుకుపోతున్న భారత్:మోదీ

### ఇంధన రంగంలో 500 బి.డాలర్ల పెట్టుబడి అవకాశం

**బెతుల్ (గోవా):** భారతదేశం సంస్కరణలతో ముందుకు దూసుకుపోతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఇంధన రంగంలో 500 బిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడుల అవకాశాలు వచ్చాయని చెప్పారు. దేశం ఇంధన సంస్కరణలను వేగిరం చేసిందని, ఇంధన భద్రతదిశగా దేశం ముందుకు వెళుతోందని చెప్పారు. గోవాలోని బెతుల్‌లో 2026 భారత ఇంధన వారోత్సవాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధానమంత్రి ప్రాంభించి మాట్లాడారు. చమురు,సహజవాయువు రంగాలలో ఈ దశాబ్దాంతానికి 100 బిలియన్ డాలర్లు పెట్టుబడులే లక్ష్యంగా దేశం సంస్కరణలు చేపట్టిందన్నారు. 10 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో చమురు,సహజవాయువులను కనుగొంటామని, తుది ఉత్పత్తులు చేయడం ద్వారా దేశాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రంగా మార్చడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2030 నాటికి సహజ వాయువురంగం వాటాను 15 శాతం మేరకు రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఎల్‌ఎన్‌జి, పైప్‌లైన్లకు అవకాశాలు సృష్టిస్తామని చెప్పారు. "ఈనాడు ఇంధన రంగంలో భారత్ బ్రహ్మాండమైన అవకాశాలుగల దేశంగా మారింది" అన్నారు. ప్రపంచంలోనే శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్రో ఉత్పత్తులు ఎగుమతి చేసే ఐదు దేశాలలో భారతదేశం కూడా ఉందన్నారు. 150 దేశాలకు పెట్రో ఉత్పత్తులను సరఫరా చేస్తున్నామన్నారు. అంతర్జాతీయ భాగస్వాములకు ఈ సామర్థ్యం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

## యాసిడ్ దాడుల వివరాలివ్వండి

### రాష్ట్రాలు, యుటిలకు 'సుప్రీం'ఆదేశాలు




**న్యూఢిల్లీ:** యాసిడ్ దాడుల కేసుల విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. యాసిడ్ దాడుల వివరాలను సంవత్సరాల వారీగా తమకు అందించాలని దేశంలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. అలాగే చార్జిషీట్లు దాఖలైన కేసుల సంఖ్య గురించి కూడా సమాచారం అందించాలని కోరింది. కోర్టు స్థాయిలో విచారణలో ఉన్న, పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య గురించి కూడా సమాచారం ఇవ్వాలని పేర్కొంది. 'హైకోర్టులు సహా అప్పీలేట్ కోర్టులలో దాఖలైన అప్పీళ్ల సంఖ్య గురించి సమాచారం అందించాలి. యాసిడ్ దాడి బాధితుల అర్హత, వైవాహిక స్థితి, చికిత్స, పునరావాసం వంటి వివరాలను అందించాలి. బాధితులను యాసిడ్ తాగమని బలవంతం చేసిన కేసుల వివరాలను సమర్పించాలి' అని సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచించింది.

## తిరోగమనంలో సంక్షేమం...పెరుగుతున్న అసమానత

### ఆర్థికస్థితిపై కేంద్ర సర్కార్‌పై కాంగ్రెస్ మండిపాటు

**న్యూఢిల్లీ:** దేశంలో సంక్షేమం తిరోగమనంలో ఉందని, అసమానత పెరుగుతోందని కాంగ్రెస్ విమర్శించింది. ఆర్థిక సర్వే విడుదల, కేంద్ర బడ్జెట్ సమర్పణకు ముందు కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతిస్తున్న సంఖ్యలను కాంగ్రెస్ ప్రశ్నించింది. ప్రతిపక్ష పార్టీ పరిశోధన విభాగం పార్లమెంటు బడ్జెట్ సమావేశానికి ఒక రోజు ముందు ఆర్థిక స్థితిపై ఒక నివేదికను విడుదల చేసింది. ప్రభుత్వం ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం, ఆర్థిక సర్వే, కేంద్ర బడ్జెట్ ద్వారా తన ప్రచారాన్ని ప్రకటిస్తుంది కాబట్టి ప్రజల ముందు వాస్తవాలను బహిర్గతం చేయడం ముఖ్యమని పేర్కొంది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) పరిశోధన విభాగం చైర్మన్ రాజీవ్ గౌడ, పార్టీ సహోద్యోగి అమితాబ్ దుబేతో కలిసి పార్టీ ప్రధాన వార్షిక నివేదిక 'అసమానత పెరుగుదలలో, సంక్షేమం తిరోగమనంలో ఆర్థిక వ్యవస్థ నిజమైన స్థితి 2026'ను విడుదల చేశారు. దుబేతో విలేకరుల సమావేశంలో ప్రసంగించిన గౌడ... మోదీ ప్రభుత్వ సంఖ్యలను నమ్మవచ్చా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'ఐఎంఎఫ్ భారతదేశ గణాంకాలకు 'సి' గ్రేడ్ ఇచ్చింది. 0.5 శాతం ద్రవ్యోల్బణ రేటు ప్రజల జీవితాల వాస్తవికత కాదు. మాజీ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ ప్రస్తుత వాస్తవికత కంటే జిడిపి గణాంకాలు కనీసం 2.5 శాతం ఎక్కువగా ఉన్నాయని లెక్కించారు' అని ఆయన అన్నారు. 2024లో జిడిపి కోసం ప్రభుత్వ ఉత్పత్తి మెట్రిక్ 9.2 శాతం జిడిపి వృద్ధిని చూపించింది, 4.9 శాతం వ్యయ మెట్రిక్ ద్వారా జిడిపి కంటే 47 శాతం ఎక్కువ అని గౌడ చెప్పారు. '2025–26 మొదటి అర్ధభాగంలో తయారీ రంగం 8.4 శాతం వృద్ధి చెందిందని నివేదించబడింది. కానీ ఎనిమిది ప్రధాన పరిశ్రమల సూచిక 2.9 శాతం వృద్ధిని మాత్రమే చూపించింది' అని ఆయన అన్నారు. 2025లో రూపాయి ఆసియాలో అత్యంత పేలవ పనితీరు కనబరిచిన కరెన్సీ అని గౌడ అన్నారు. రూపాయి విలువ పడిపోవడంపై ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. 2017–18, 2023–24 మధ్య తయారీ రంగంలో కార్మికుల వాటా 12.1 శాతం నుండి




11.4 శాతానికి పడిపోయిందని ఆయన అన్నారు. 'మేక్ ఇన్ ఇండియా ఏమైంది? వ్యవసాయ వాటా 44.1 శాతం నుండి 46.1 శాతానికి పెరిగింది... ఉద్యోగ వృద్ధి తక్కువ విలువ, అనధికారికష గిగ్ ఆర్థిక వ్యవస్థలో కేంద్రీకృతమై ఉంది' అని గౌడ అన్నారు.'పెరుగుతున్న అసమానత' సమస్యను ఎత్తిచూపుతూ, టాప్ 10 శాతం మంది జాతీయ ఆదాయంలో 58 శాతాన్ని సంగ్రహిస్తున్నారని గౌడ అన్నారు; దిగువ సగం మంది 15 శాతం మాత్రమే పొందుతారన్నారు. టాప్ 10 శాతం మంది భారతదేశ సంపదలో 65 శాతం కలిగి ఉన్నారు; దిగువ సగం మంది 6.4 శాతం కలిగి ఉన్నారు; టాప్ 1 శాతం మంది 40 శాతం కలిగి ఉన్నారు' అని ఆయన అన్నారు. 5 మంది భారతీయులలో 4 మంది రోజుకు రూ.200 కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్నారని గౌడ అన్నారు. మూడింట ఒక వంతు మంది రోజుకు రూ.100 కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్నారన్నారు. నికర గృహ ఆర్థిక పొదుపు ఐదు దశాబ్దాల కనిష్ట స్థాయి 5.2 శాతంగా ఉంది, గృహ రుణం 2019లో 35 శాతం నుండి 41 శాతానికి పెరిగిందని తెలిపారు. 'కొంతమందికి మాత్రమే ప్రయోజనం చేకూర్చే వృద్ధి విజయం కాదు. ఇది ఒక హెచ్చరిక సంకేతం. పెరుగుతున్న అసమానత, క్షీణిస్తున్న సంక్షేమం భారీ ఆర్థిక దుర్వినియోగానికి స్పష్టమైన గుర్తులు' అని దుబే అన్నారు. తయారీలో క్షీణత, ఎంఎస్‌ఎంఇలు ఎదుర్కొంటున్న సవాళ్లను ఎత్తి చూపడం ద్వారా మేక్ ఇన్ ఇండియా చొరవ 'వైఫల్యాలను కూడా దుబే గుర్తించారు.

## 'మహారాజుల' యుగానికి దేశం

### ప్రధాని మోదీ కుట్ర చేస్తున్నారని రాహుల్‌గాంధీ మండిపాటు



**న్యూఢిల్లీ:** 'ఎంజి నరేగా'ను ధ్వంసం చేయడం వెనుక ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ అసలు ఉద్దేశాన్ని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ బయటపెట్టారు. అధికారం అంతా కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం చేసి కార్మికుల వేతనాలపై చర్చలు జరిపే హక్కును, పంచాయతీల అధికారాన్ని తొలగించడం, దేశాన్ని రాజుల యుగం నాటికి తిరిగి నెట్టడమేనని ఆయన ఆరోపించారు. మంగళవారం రాహుల్‌గాంధీ ఎక్స్‌లో నరేగా కార్మికులతో తన ఇటీవలి సంభాషణ వీడియోను షేర్ చేశారు. ఎంజి నరేగా వారి జీవితాలను మార్చిందని ప్రకటించిన కార్మికులు.. ఇప్పుడు మోదీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మారుస్తోందని చెబుతున్నారని అన్నారు. వీడియోతో పాటు హిందీలో తన పోస్ట్‌లో రాహుల్‌గాంధీ 'ఎంజి నరేగా'ను నాశనం చేయడానికి మోదీ జీ చేసిన ప్రయత్నం వెనుక ప్రేరణ ఏమిటి? కార్మికుల రోజువారీ వేతనాలపై చర్చలు జరిపే హక్కును తొలగించడం; పంచాయతీల అధికారాన్ని తొలగించి వారి చేతులు కట్టేయడం; రాష్ట్రాల అధికారాన్ని తొలగించి ఢిల్లీలో అధికారాన్ని కేంద్రీకరించడం; దేశాన్ని రాజులు, మహారాజుల యుగానికి తిరిగి నెట్టడం, అధికారం, సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమై' అని అన్నారు. కనీస వేతనాలు, ఏడాది పొడవునా పనికి హామీ, స్వేచ్ఛ, గౌరవంతో పనిచేసే హక్కు వంటి వాటిని దేశంలోని లక్షలాది మంది కార్మికులు ఒకే గొంతుతో వినిపిస్తున్నారన్నారు. వీడియోలో, ఒక నరేగా కార్మికుడు గాంధీకి ఈ ప్రభుత్వం 'కార్మికులను బానిసలుగా' మారుస్తోందని చెబుతున్న దృశ్యం కపిపించింది. జీవనోపాధి భద్రత కల్పించడంలో చట్టం తమకు ఎలా సహాయపడిందో నరేగా కార్మికులు మాట్లాడుకుంటున్నారు, కానీ ప్రభుత్వం పరివర్తన చొరవను నాశనం చేయాలని సంకల్పించుకుందని రాహుల్ ఆరోపించారు.

## నరేగా రద్దుకు వ్యతిరేకంగా కర్నాటకలో 'చల్ రాజ్‌భవన్'

### సిఎం సిద్ధ, డికె, సుర్జేవాలా పార్టీ ప్రజాప్రతినిధులు గవర్నర్‌కు మెమోరాండం సమర్పణ



**బెంగళూరు:** బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ సర్కార్ 'ఎంజి నరేగా'ను రద్దు చేయాన్ని వ్యతిరేకిస్తూ కర్నాటకలో అధికార కాంగ్రెస్ మంగళవారం 'చలో రాజ్‌భవన్' నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఎంజి నరేగా స్థానంలో కొత్త గ్రామీణ ఉపాధి హామీ చట్టం అయిన 'విబి– జి రామ్ జి' ని తీసుకురావడాన్ని నిరసిస్తూ రాష్ట్ర గవర్నర్ అధికారిక నివాసం లోక్‌భవన్ వైపు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సిఎం డికె శివకుమార్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా, పార్టీ ఎంపిలు, ఎమ్మెల్యేలు ర్యాలీగా వెళ్లారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వం బస్సులో లోక్‌సభవన్ వెళ్లి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు మెమోరాండం సమర్పించారు. నిరసన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కూల్చివేస్తోందని, పంచాయతీల హక్కులను కాలరాస్తోందని వారు ఆరోపించారు. అనంతరం నిరసనకారులనుద్దేశించి సిద్ధరామయ్య మాట్లాడుతూ, 'విబి– జి రామ్ జి' లోని 'రామ్' అనే పదం దశరథ్ రామ్ లేదా సీతా రామ్ కాదన్నారు. ఇది రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) కోసం వికసిత్ భారత్ హామీని సూచిస్తుందని చెప్పారు. యుపిఎ హయాంలో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) జీవనోపాధి, ఉపాధి హక్కు అని ఆయన అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం దానిని నాశనం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 'ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ ప్రజల హక్కు, కానీ ఇకపై కాదు. వికలాంగులతో సహా దాదాపు ఐదు కోట్ల మంది గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్నారు. గతంలో పంచాయతీలు చేసే పని అయితే, ఇప్పుడు కేంద్రం ఏ పని చేయాలో నిర్ణయించాలనుకుంటోంది' అని సిద్ధరామయ్య ఆరోపించారు. పంచాయతీల పాత్రను తీవ్రంగా తగ్గించారని మండిపడ్డారు. ప్రతి పంచాయతీకి గతంలో సుమారు రూ. కోటి వరకు వచ్చేదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇప్పుడు వారికి అది అందకుండా పోతుంది. గ్రామీణ భారతదేశంపై బిజెపి దాడి చేస్తోందని సిద్ధరామయ్య ఆరోపిస్తూ, 'గ్రామాలు అభివృద్ధి చెందకపోతే దేశం అభివృద్ధి చెందదని గాంధీజీ అన్నారు. నరేగాను రద్దు చేయడం ద్వారా బిజెపి మరోసారి మహాత్మా గాంధీని హత్య చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఆందోళనకు ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కర్ణాటక ఇన్‌చార్జ్ కూడా అయిన సుర్జేవాలా, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయడానికి కేంద్రం పట్టుబడిందని ఆరోపించారు. 'కేంద్ర ప్రభుత్వం నరేగాను రద్దు చేయాలనుకుంటోందని, పంచాయతీ కేంద్రాలను మహాత్మా గాంధీ కేంద్రంగా పేరు మార్చాలని కర్ణాటక ప్రభుత్వాన్ని కోరుతున్నానన్నారు. నరేగాను రద్దు చేయడం ద్వారా, బిజెపి తనకు తానుగా ఇబ్బందులను ఆహ్వానించిందని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు 'విబి– జి రామ్ జి'ని అంగీకరించరని శివకుమార్ అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసినందుకు వారు బిజెపిని క్షమించరని చెబుతూ, బిజెపికి రాజకీయ పరిణామాలపై శివకుమార్ హెచ్చరించారు. తర్వాత, వారు గెహ్లాట్‌కు మెమోరాండం సమర్పించారు. కాగా, కర్నాటక కాంగ్రెస్ నాయకత్వం గవర్నర్‌ను తమ అభ్యంతరాలను గమనించాలని విజ్ఞప్తి చేసింది. నరేగాను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. కోట్లాది మంది గ్రామీణ కార్మికుల ఉపాధి భద్రత, జీవనోపాధిపై దాడిగా వారు అభివర్ణించినందుకు క్షమాపణ చెప్పాలని వారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రివర్గాన్ని కోరారు.

## యుజిసి కార్యాలయం వెలుపల విద్యార్థుల నిరసన

### కొత్త నిబంధనలపై మండిపాటు : ఉపసంహరించుకోవాలని డిమాండ్



**న్యూఢిల్లీ :** యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) జారీ కొత్త నిబంధనలు క్యాంపస్‌లలో గందరగోళానికి దారి తీస్తాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలను వ్యతిరేకిస్తూ మంగళవారం ఢిల్లీ వ్యాప్తంగా ఉన్న కళాశాలల విద్యార్థుల బృందం యుజిసి ప్రధాన కార్యాలయం వెలుపల నిరసన చేపట్టింది. ఒక వైపు భారీ బారికేడింగ్, మరో వైపు వర్షం కురుస్తున్నప్పటికీ దాదాపు 100 మంది విద్యార్థులు నిరసనలో పాల్గొన్నారు. నిబంధనలను పూర్తిగా ఉపసంహరించుకోవడంతో సహా తమ డిమాండ్ల జాబితాను విద్యార్థి బృందం యుజిసికి సమర్పించింది. 'యుజిసి అధికారులు మా మెమోరాండం స్వీకరించారు. మా డిమాండ్ల జాబితా నుండి కొన్ని అంశాలను చర్చించడానికి వారు అంగీకరించారు' అని ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన పిహెచ్‌డి విద్యార్థి అలోకిత్ త్రిపాఠి పిటిఐకి తెలిపారు. ఈక్విటీ స్క్వాడ్‌లో జనరల్ కేటగిరి నుండి ఒకరిని నియమించాలనే డిమాండ్‌ను పరిశీలిస్తామని యుజిసి అధికారులు తెలిపారన్నారు. 15 రోజుల్లోపు, అంటే ఫిబ్రవరి 12లోపు ఒక పరిష్కారాన్ని కనుగొంటామని కమిషన్ తమకు హామీ ఇచ్చిందని, తప్పుడు ఫిర్యాదులను నిరుత్సాహపరిచేందుకు నిందితుడి గుర్తింపును ప్రైవేట్‌గా ఉంచబోమని అధికారులు చెప్పినట్లు అని త్రిపాఠి పేర్కొన్నారు. నిరసనకారుల గళాన్ని వినిపిస్తాయని వారు హామీ ఇచ్చారన్నారు. ఈనెల 13న యుజిసి నోటిఫై చేసిన 'ఉన్నత విద్యా సంస్థలలో సమానత్వాన్ని ప్రోత్సహించడం నిబంధనలు, 2026' కొత్త నియమాలు జనరల్ కేటగిరీ విద్యార్థుల నుండి విస్తృత విమర్శలకు దారితీశాయి. ఈ నియమాలు వారిపై వివక్షకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో కుల ఆధారిత వివక్షను ఆపడానికి ప్రవేశపెట్టిన కొత్త నిబంధనల ప్రకారం, ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి విద్యార్థుల నుండి వచ్చే ఫిర్యాదులను నిర్వహించడానికి ప్రత్యేక కమిటీలు, హెల్ప్‌లైన్‌లు, పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయాలని జియుసి సంస్థలను కోరింది. కొత్త నిబంధనలు కళాశాలల్లో పూర్తి గందరగోళాన్ని సృష్టిస్తాయని, ఎందుకంటే రుజువు భారం ఇప్పుడు పూర్తిగా నిందితులపైకి మార్చబడుతుందజని, తప్పుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఎటువంటి రక్షణలు లేవు అని విద్యార్థులు చెబుతున్నారు. కాగా, శ్రీ వెంకటేశ్వర కళాశాల బిఎ పొలిటికల్ సైన్స్ విద్యార్థి హర్ష్ పాండే మాట్లాడుతూ కొత్త నిబంధనలను తగిన పరిశీలన లేకుండా తీసుకువచ్చారని మండిపడ్డారు. ఈ నిబంధనలను పూర్తిగా ఉపసంహరించుకోవాలని తాము డిమాంట్ చేస్తున్నామన్నారు. ఎందుకంటే అవి వ్యతిరేక వివక్షకు దారితీస్తాయని, క్యాంపస్‌లో అమాయక విద్యార్థులను నేరస్థులుగా చేయడానికి వీటిని ఉపయోగిస్తారని ఆయన పేర్కొన్నారు. యుజిసి నిబంధనలపై దేశ వ్యాప్తంగా చర్చలు మొదలయ్యాయి. అనేక రాష్ట్రాల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, సామాజిక సంస్థల నుండి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఉన్నత విద్యా సంస్థలకు ఎక్కువ న్యాయబద్ధత, జవాబుదారీతనం తీసుకురావడమే ఈ మార్పుల లక్ష్యం అని ప్రభుత్వం చెప్పినప్పటికీ, చాలా మంది అవి సామాజిక విభజనలను తీవ్రతరం చేస్తాయని, విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లో కొత్త సవాళ్లను కలిగిస్తాయని భయపడుతున్నారు.

## భారత్–ఇయు వాణిజ్య ఒప్పందం హైలైట్స్

1. భారతదేశం నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, యూరోపియన్ యూనియన్ రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. రెండూ కలిస్తే ప్రపంచ స్థూల దే శీయోత్పత్తిలో 25 శాతం అవుతుంది. అంటే ప్ర పంచ వాణిజ్యంలో మూడోవంతుతో సమానం.
2. భారత్ ఎగుమతి చేసే 99 శాతం వస్తువులకు యూరప్ దేశాలలో ప్రవేశానికి ప్రాధాన్యత ఉం టుంది. దీంతో ఇప్పటివరకూ లభించని సామూ హిక వృద్ధి సామర్థ్య సాధనకు ద్వారాలు తెరచు కుంటాయి.
3. సూక్ష్మ చిన్న మధ్య తరహా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలు ప్రారంభమవుతాయి. మహిళలు, చేతివృత్తిపనివారులకు, యువకులు, వృత్తినిపుణులకు కొత్త అవకా శాలు వస్తాయి.
4. టెక్స్‌టైల్స్,తోలుపరిశ్రమ,సముద్ర ఉత్పత్తులు, రత్నాలు, అభరణాలు వంటి శ్రామికులు ఎక్కువ గా పనిచేసే రంగాలకు చెందిన 33 బిలియన్ డా లర్ల విలువైన ఎగుమతులకు అవకాశాలు వస్తా యి. స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కింద శ్రమాధిక్యతగల ఈ రంగాలకు అత్యంత ప్రాధాన్యత లభిస్తుంది.
5. ఈ ఒప్పందం అమలులోకి వచ్చిన మొదటి రోజున 33 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులపై సుం కాలను 10 శాతం తగ్గించడం వల్ల దాదాపు సుంకాలు లేనట్టే.
6. ఆటోమొబైల్స్, ఖచ్చితమైన కొలతలతో చేసిన వస్తువులు, చెక్కిన అలంకరణ వస్తువులు, కోటా ప్రాతిపదికపై ఉదారంగా సుంకాల సడలింపు ఉంటుంది.
7. యూరోపియన్ ఆటో ఉత్పత్తిదారులు భారతదేశంలో తమ కొత్త నమూనాలను భారీ ధరలతో పరిచయం చేయడానికి సులభంగా అనుమతించడం మాత్రమే కాకుండా, భవిష్యత్‌లో మనదేశంలోనే తయారు చేసి ఎగుమతులు చేసే అవకాశాలు కూడా ఇస్తారు.
8.హైటెక్ ఉత్పత్తుల నుండి, బ్రహ్మాండమైన పోటీ నుండి భారత వినియోగదారులు ప్రధానంగా లబ్ది పొందుతారు.
9. యూరోపియన్ యూనియన్‌లో పరస్పరం ఇచ్చిపుచ్చుకునే మార్కెట్ కూడా భారత్‌లో తయా రు చేసిన ఆటోమొబైల్స్‌కు అందుబాటులోకి వ స్తుంది.
10.పాల ఉత్పత్తులు,తృణ ధాన్యాలు, కోళ్ళపరిశ్రమ ,సోయా ఉత్పత్తులు, కొన్ని పండ్లు, కూరగాయలకు దేశీయ ప్రాధాన్యతలతో ఎగుమతులు చేయడానికి రక్షణలు సమకూరతాయి.
11.ఎఫ్‌టిఎ ద్వారా సుంకాల లేమి ఆటంకాలను పరిష్కరించేందుకు నియంత్రిత సహకారం అమలు చేస్తారు. బ్రహ్మాండంగా బాహాటత్వ విధానం అమలు చేస్తారు. నిబంధనలను క్రమ బద్ధీకరస్తారు.
12. నైపుణ్యంగల, తక్కువ నైపుణ్యంగల భారత వృత్తినిపుణులకు ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు విస్తరించేవిధంగా భవిష్యత్ వ్యవస్థను పటిష్టం చేస్తారు.
13. స్టీలు,సిమెంటు వంటి కార్బన్ ఉత్పత్తి చేసే వస్తువులపై పన్ను (సిబిఎఎం) నిబంధనలు ఉన్నప్పటికీ కూడా అత్యంత సన్నిహిత మిత్రదేశ హోదా కింద పట్టువిడుపులు ఉంటాయి.
14. కొన్ని మార్కెట్లను అందుబాటులోకి తెచ్చే విషయంలో వివక్షలేకుండా వ్యవహరిస్తారు, డిజిటల్ సేవలపై దృష్టి పెడతారు. దీనివల్ల భారత్ నుండి రాకపోకలు చేయడానికి ఉద్యోగులకు సేవల ఎగుమతులకు సులభతరంగా ఉంటుంది.
15. సమాచార సాంకేతికత, సమాచార సాంకేతికత ఆధారిత సేవలు వంటి యూరోపియన్ యూ నియన్‌లోని 144 ఉప రంగాలలోకి వృత్తి సేవలు, విద్యా సేవలు చొరబడేందుకు అవకాశాలుంటాయి.
16. భారతదేశం కూడా యూరోపియన్ యూనియన్‌కు 102 ఉప రంగాలలో చొరబడేందుకు అ వకాశం ఇచ్చింది.
17. భారత్ ఇచ్చే అవకాశం వల్ల హైటెక్ సర్వీసులు, పెట్టుబడులు యూరప్ నుండి మనదేశంలోకి వస్తాయి. రెండు వ్యవస్థలూ పరస్పర అంగీకృత విధానం ద్వారా ఈ ప్రయోజనాలకు ఏర్పాట్లు చేసుకున్నాయి.
18. ఇరువైపులా వృత్తి నిపుణులు స్వల్పకాలిక ప్రయాణాలు చేయడానికి చాలా సులభమైన విధానాలు అమలు చేస్తారు.
19. యూరోపియన్ యూనియన్ కాంట్రాక్టు సేవల సరఫరాలు చేయడానికి 37 రంగాలు, ఉప రంగాలను అనుమతించేందుకు కట్టుబడింది. అదేవిధంగా వ్యక్తిగతమైన నైపుణ్యకోసం కూడా 17 రంగాలు, ఉప రంగాలను అనుమతిస్తారు.
20. నియంత్రణలు లేనిచోట్ల భారతదేశ సంప్రదాయ వైద్య విధానాల ద్వారా సేవలు చే యడానికి యూరప్ దేశాలలో అనుమతులు ఉంటాయి.
21.ఇరు వ్యవస్థల మధ్యా డిజిటల్ చెల్లింపులకు అవకాశాలు ఉంటాయి.
22. భారతదేశం ఈ విధంగా యూరోపియన్ యూనియన్‌తో కలిపి ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా 22 స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం చేసుకుంది.

### వరుసగా 9వసారి బడ్జెట్...

## 'చరిత్ర' సృష్టించనున్న నిర్మల సీతారామన్



**న్యూఢిల్లీ :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరోసారి చరిత్ర సృష్టించబోతున్నారు. ఫిబ్రవరి 1వ తేదీన ఆమె వరుసగా తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలో ఒకే ప్రధానమంత్రి హయాంలో వరుసగా తొమ్మిది బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన తొలి ఆర్థిక మంత్రిగా ఆమె రికార్డు సొంతం చేసుకోనున్నారు. దేశ ఆర్థిక పరిస్థితులు, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ అనిశ్చితుల మధ్య ఈసారి బడ్జెట్‌లో కీలక సంస్కరణలు ఉండనున్నాయని అంచనాలు ఉన్నాయి. 2019లో ప్రధాని నరేంద్ర మోదీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మలా సీతారామన్‌ను మహిళా ఆర్థిక మంత్రిగా నియమించారు. అప్పటి నుంచి వరుసగా బడ్జెట్‌లు ప్రవేశపెడుతూ వస్తున్నారు. 2024లో మోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా ఆర్థిక శాఖ బాధ్యతలు ఆమెకే కొనసాగాయి. ఇప్పటివరకు ఆమె ఎనిమిది బడ్జెట్‌లు ప్రవేశపెట్టగా, 2024 ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్ కూడా ఇందులో భాగమే. అయితే ఈసారి ప్రవేశపెట్టనున్న తొమ్మిదో బడ్జెట్‌తో ఆమె మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ రికార్డుకు నిర్మలా సీతారామన్ మరింత దగ్గరవుతారు. దేశాయ్ మొత్తం 10 బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన రికార్డు ఇప్పటికీ అగ్రస్థానంలో ఉంది. అయితే వరుసగా తొమ్మిది బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన ఘనత మాత్రం నిర్మలా సీతారామన్‌కే దక్కనుంది.

**హల్వా వేడుక:** మరోవైపు, ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో నిర్మలా సీతారామన్ మంగళవారం హల్వా వేడుకను నిర్వహించారు. భారత్‌లో ఏ మంచి కార్యక్రమం ప్రారంభించినా ముందుగా తీపి పదార్థాలు పంచడం శుభప్రదంగా భావిస్తారు. అందుకే ఏటా బడ్జెట్‌కు ముందు సంప్రదాయం ప్రకారం, ఢిల్లీలోని కేంద్ర ఆర్థిక శాఖ కార్యాలయం నార్త్ బ్లాక్‌లో హల్వా వేడుక చేస్తుంటారు. బడ్జెట్ తయారీ ప్రక్రియలో పాల్గొనే అధికారులకు, సిబ్బందికి ఆ హల్వాను పంచిపెడతారు. హల్వా వేడుకతో బడ్జెట్ లాక్‌ఇన్ పీరియడ్ ప్రారంభం అవుతుంది. అంటే బడ్జెట్ తయారీలో ప్రత్యక్షంగా పాల్గొనే అధికారులు, సిబ్బంది పార్లమెంట్‌లో దానిని ప్రవేశపెట్టేవరకు ఆ నార్త్ బ్లాక్‌లోనే ఉంటారు. వారు బయటకు వెళ్లడానికి వీలుండదు. వారు ఎల్లప్పుడూ సిసిటివి కెమెరాలు, ఇంటెలిజెన్స్ బ్యూరోల నిరంతర పర్యవేక్షణలో ఉంటారు. కనీసం వారు ఫోన్ చేయడానికి కూడా వీలుండదు. అత్యవసర సమయాల్లో మాత్రం భద్రతా సిబ్బంది సమక్షంలో ఫోన్ చేసుకునే వీలు కల్పిస్తారు.

### 2026 యుజిసి నిబంధనలలో 'కుల వివక్ష నిర్వచనాన్ని' సవాల్ చేస్తూ..

## 'సుప్రీం'లో పిటిషన్

### విద్యార్థులను రక్షించడంలో యుజిసి విఫలమైందని పిటిషన్ ఆరోపణ
### పిటిషన్ దాఖలు చేసిన వినీత్ జిందాల్




**న్యూఢిల్లీ:** ఇటీవల నోటిఫై చేయబడిన విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) నిబంధనను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. ఆ నిబంధన కుల ఆధారిత వివక్షకు ఒక చేర్చలేని నిర్వచనాన్ని స్వీకరించిందని, సంస్థాగత రక్షణ నుండి కొన్ని వర్గాలను మినహాయించిందని ఆ పిటిషన్ ఆరోపించింది. ఇటీవల యుజిసి (ఉన్నత విద్యా సంస్థలలో సమానత్వాన్ని ప్రోత్సహించడం ) 2026లోని నిబంధన 3(సి) 'చేర్చబడనిది' అని, విద్యార్థులను రక్షించడంలో విఫలమైందని, రిజర్వ్ కేటగిరీలకు చెందకుండా రక్షించుకోవడంలో విఫలమైందని పిటిషన్ తెలిపింది. వినీత్ జిందాల్ దాఖలు చేసిన పిటిషన్‌లో కుల ఆధారిత వివక్ష అనేది షెడ్యూల్డ్ కులాలు (ఎస్‌సి), షెడ్యూల్డ్ తెగలు (ఎస్‌టి), ఇతర వెనకబడిన తరగతుల (ఒబిసి) సభ్యులపై జరిగిన హింసగా నిర్వచించబడిందనే నిబంధనల ఆధారాలను కొట్టిపారేశారు.'కుల ఆధారిత వివక్షత' పరిధిన ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాలకు మ్రాతమే పరిమితం చేయడం ద్వారా యుజిసి సాధారణ లేదా రిజర్వు చేయని వర్గాలకు చెందిన వ్యక్తులకు సంస్థాగత రక్షణ, ఫిర్యాదుల పరిష్కారాన్ని సమర్థవంతంగా అందించిందని, వారు వారి కుల గుర్తింపు ఆధారంగా వేధింపు లేదా పక్షపాతాన్ని కూడా ఎదుర్కోవచ్చని తెలిపింది.( పస్తుత మినహాయింపు రూపం రక్షణ సోపాన క్రమంలోని నిబంధన రాజ్యాంగ విరుద్ధం అని అది పేర్కొంది. ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు), 15(1) (మతం, జాతి, కులం, జన్మస్థలం ఆధారంగా రాష్ట్రం వివక్షతను నిషేధించడం) కింద హామీ ఇవ్వబడిన ప్రాథమిక నిబంధనలను ఈ నిబంధన ఉల్లంఘిస్తుందని పిటిషన్ పేర్కొంది.ఈ నిబంధన ఆర్టికల్ 21 జీవితాన్ని, వ్యక్తిగత స్వేచ్ఛను ఉల్లంఘిస్తుందని, ఇందులో రాజ్యాంగంతో గౌరవప్రదంగా జీవించే హక్కు కూడా ఉందని ఆరోపించింది.ప్రస్తుత రూపంలో రెగ్యులేషన్ (సి)ని అమలు చేయకుండా అథారిటీలను నిరోధించాలని, కుల ఆధారిత వివక్షతను కుల తటస్థంగా, రాజ్యాంగ బద్ధంగా ఫిర్యాదు చేసే పద్ధతిలో పునర్వ్యిర్వచించడానికి దిశా నిర్దేశం చేయాలని అది సుప్రీంకోర్టును కోరింది. ఈ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయబడిన 'సమాన అవకాశ కేంద్రాలు','ఈక్విటీహెల్ప్‌లైన్లు','అంబుడ్స్‌పర్సన్' యంత్రాంగాలను అన్ని విద్యార్థులు అందరికీ వివక్ష లేని విధంగా అందుబాటులో ఉంచాలని, నిర్వచనం అధికారిక పున: పరిశీలన వరకూ కేంద్ర ప్రభుత్వం, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి)కి మధ్యంతర ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్ కోరింది.

### అదానీ గ్రూప్, 'ఎంబ్రేయర్' ఆధ్వర్యంలో...

## భారత్‌లో ప్రాంతీయ విమానాల తయారీ కేంద్రం ఏర్పాటు

**న్యూఢిల్లీ :** భారతదేశంలో ప్రాంతీయ విమానాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో అదానీ గ్రూప్, బ్రెజిలియన్ ప్రధానసంస్థ 'ఎంబ్రేయర్' ఒక వ్యూహాత్మక సహకారాన్ని ప్రకటించారు. ఇది దేశ స్వదేశీ తయారీ సామర్థ్యాలకు గణనీయమైన ప్రోత్సాహాన్ని ఇవ్వనుంది. భారతదేశం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పౌర విమానయాన మార్కెట్లలో ఒకటిగా పేరొందింది. ఈ భాగస్వామ్యం టైర్ 2, టైర్ 3 నగరాలకు ఎయిర్ కనెక్టివిటీని మెరుగుపర్చేందుకు సహాయపడుతుంది. దేశరాజధానిలోని పౌర విమానయాన మంత్రిత్వ శాఖలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో అదానీ డిఫెన్స్, ఏరోస్పేస్, ఎంబ్రేయర్ అధికారులు భారతదేశంలో వ్యూహాత్మక సహకార ప్రాంతీయ రవాణా విమానాల కోసం అవగాహనా ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకున్నారు. దేశంలో ఎంబ్రేయర్ ప్రాంతీయ విమానాల కోసం రెండు కంపెనీలు ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఎఎల్)ను ఏర్పాటు చేస్తాయి. భారతదేశంలో ప్రాంతీయ విమాన తయారీ కేంద్రం అయిన ఎంబ్రేయర్ సహకారాన్ని అదానీ డిఫెన్స్, ఏరోస్పేస్ డైరెక్టర్ జీత్ అదానీ ప్రారంభించారు. ఎంబ్రేయర్ 150సీట్ల వరకూ వాణిజ్య జెట్‌లను తయారు చేస్తుంది. పెట్టుబడులు, సౌకర్యం ఉన్న ప్రతిపాదిత ప్రదేశం గురించి వివరాలు వెల్లడించలేదు. ఎయిర్ క్రాఫ్ట్ తయారీ, సప్లయ్ చైన్, ఆఫ్టర్ మార్కెట్ సర్వీసెస్, పైలట్ శిక్షణలో అవకాశాల కోసం కంపెనీలు సహకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయని విడుదల చేసిన ఒక ప్రకటన తెలియజేసింది. పౌర విమానయాన కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా మాట్లాడుతూ ఈ సహకారం కేవలం ప్రాంతీయ విమానాలను అసెంబుల్ చేయడానికి మాత్రమే కాదని, ప్రగతిశీల సాంకేతిక బదిలీ, నైపుణ్యాభివృద్ధి, బలమైన సరఫరాను కలిగి ఉండటం ద్వారా భారతదేశాన్ని ప్రాంతీయ విమానాలకు విశ్వసనీయ కేంద్రంగా మార్చడం ద్వారా ఒక స్థితిస్థాపకమైన, స్థిరమైన విమానయాన పర్యావరణ వ్యవస్థ దిగుమతులను పరిమితం చేయగలదని ఆయన తెలిపారు. తయారీ కేంద్రం కోసం రెండు స్థలాలను పరిశీలిస్తున్నామని, రాబోయే నెలల్లో పనులు ఖరారు అవుతాయని జీత్ అదానీ వెల్లడించారు. పౌరవిమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ భారతదేశంలో తయారీ, వృద్ధి సామర్థ్యాలను హైలెట్ చేసేందుకు సరైన సమయం ఇది అన్నారు. ప్రస్తుతం భారతదేశంలో 2005లో ఇజెట్స్ కార్యకలాపాలు ప్రారంభించిన ఎంబ్రేయర్ దేశంలో దాదాపు 50విమానాలను ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ప్రభుత్వ సంస్థలు, వ్యాపార జెట్ ఆపరేటర్లు, వాణిజ్య విమానయాన సంస్థ స్టార్ ఎయిర్‌కు సేవలు అందిస్తుంది. ఎంబ్రేయర్ కమర్షియల్ ఏవియేషన్ ప్రెసిడెంట్, సిఇఒ అర్జన్ మీజెర్ మాట్లాడుతూ భారతదేశం ఎంబ్రేయర్‌కు కీలకమైన మార్కెట్ అని, ఈ భాగస్వామ్యం అదానీ బలమైన పారిశ్రామిక సామర్థ్యాలతో మా ఏరోస్పేస్ నైపుణ్యం, స్వదేశీకరణకు నిబద్ధతతో కలిసి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ రక్షణ మంత్రిత్వ శాఖ దృక్కోణం నుండి ఇటువంటి భాగస్వామ్యాలు దిగుమతి ఆధారపడటాన్ని తగ్గించడం, కార్యాచరణ సంసిద్ధతను పెంచడం, ప్లాట్‌ఫారమ్‌లు, విడిభాగాలు సకాలంలో లభ్యతను నిర్ధారించడం అనే లక్ష్యాలను నేరుగా విరుద్ధంగా ఉంటాయని అన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
బుధవారం
28-01-2026
www.prajapaksham.in


# రాజకీయ పార్టీలకు 'మున్సిపల్' పరీక్ష

రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఇసి) మున్సిపల్ నగారా మోగించింది. 116 మున్సిపాలిటీలు, 7మున్సిపల్ కార్పొరేషన్‌లకు మంగళవారం ఎన్నికల నిర్వహణ షెడ్యూలు ప్రకటన ఆకస్మికంగా వచ్చినట్లు అనిపించినా, కనిపించినా పిడుగుపాటు మాత్రం కాదు. రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల సన్నాహాల్లో మునిగిఉన్నాయి. గత నెలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసి కొత్త పాలక విభాగాలు కొలువుతీరిన నాటి నుంచే మున్సిపల్ ఎన్నికలు త్వరలోనే జరుగుతాయని ప్రభుత్వ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి; ఎస్ఇసి ఓటర్ల జాబితాలు తాజాపరచటం, రిజర్వేషన్‌ల ఖరారు, శాంతి–భద్రతల యంత్రాంగాన్ని అప్రమత్తం చేయటం వంటి ఎన్నికల సన్నాహాలు పరిపూర్తి చేసింది – ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ కోసం వేచిచూస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్‌నుంచి అమెరికా వెళ్లినప్పటికీ అంతకు మునుపు జనవరి 18న మేడారంలో జరిగిన మంత్రివర్గ సమావేశం లోనే మున్సిపల్ ఎన్నికల నిర్వహణ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా మంత్రివర్గ ఆదేశం ఎన్నికల కమిషన్‌కు అందింది.

**మున్సిపల్ ఎన్నికలు పార్టీ ఎన్నికల గుర్తులపై జరుగుతాయి. అందువల్ల, పార్టీ టిక్కెట్లలో 42 శాతం ఒబిసిలకు కాంగ్రెస్ పార్టీ ఇస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించి ఉన్నారు. మిగతా పార్టీలకూ అదే విజ్ఞప్తి చేశారు. అయితే ఏ పార్టీ పాటిస్తుందో, పాటించదో వేచి చూడాలి. ఇది ముఖ్యంగా మేయర్, చైర్మన్ పదవుల్లో ప్రతిఫలించినపుడే బిసిలకు ఆచరణలో న్యాయం జరుగుతుంది.**

నీటి పారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి రెండ్రోజుల్లో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని కొద్ది రోజుల క్రితం వెల్లడించారు.

మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుమిదినీదేవి ప్రకటన ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తున్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్‌లలో 2996 వార్డులు, డివిజన్‌లున్నాయి. ఓటర్లసంఖ్య 53లక్షలు. నామినేషన్‌ల దాఖలు గడువు జనవరి 28–30 తేదీలు. 31న స్క్రూటినీ. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12న అవసరమైన చోట రీపోలింగ్, 13న ఓట్ల లెక్కింపు, 16న కార్పొరేషన్స్‌లో మేయర్, డిప్యూటీ మేయర్‌లు, మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్–చైర్‌పర్సన్‌ల ఎన్నిక నిర్వహిస్తారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో మండల, జిల్లా పరిషత్ పాలక మండళ్ల ఏర్పాటు నిమిత్తం ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలు బహుశా మార్చి/ఏప్రిల్ మాసాల్లో జరుగుతాయి.

స్థానిక సంస్థల్లో ఒబిసిలకు 42శాతం రిజర్వేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన లీగల్, చట్టబద్ధ ప్రయత్నాలన్నీ కేంద్రప్రభుత్వ మహాద్వారం వద్ద నిలిచిపోవటంతో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఆలస్యమైంది. 73, 74 రాజ్యాంగ సవరణలు స్థానిక సంస్థలను మూడవ దొంతర ప్రజాపాలనగా(పార్లమెంటు, అసెంబ్లీల తదుపరి) గుర్తించి, వాటి పాలక మండళ్లకూ విధిగా ఐదు సంవత్సరాలకు ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించాయి. అయితే రిజర్వేషన్‌ల ఖరారు వంటి అధికారాలు రాష్ట్రాలకు అప్పగించినందున, అత్యధిక రాష్ట్రాల్లో రాజ్యాంగ ఆదేశం పాటింపు జరగటం లేదు. అదలావుంచితే, ప్రస్తుత మున్సిపల్ ఎన్నికలు పార్టీ ఎన్నికల గుర్తులపై జరుగుతాయి. అందువల్ల, పార్టీ టిక్కెట్లలో 42 శాతం ఒబిసిలకు కాంగ్రెస్ పార్టీ ఇస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించి ఉన్నారు. మిగతా పార్టీలకూ అదే విజ్ఞప్తి చేశారు. అయితే ఏ పార్టీ పాటిస్తుందో, పాటించదో వేచి చూడాలి. ఇది ముఖ్యంగా మేయర్, చైర్మన్ పదవుల్లో ప్రతిఫలించినపుడే బిసిలకు ఆచరణలో న్యాయం జరుగుతుంది. చట్టరీత్యా 42 శాతం బిసి రిజర్వేషన్‌లు కల్పించేవరకు స్థానిక ఎన్నికలు జరపరాదని అప్రజాస్వామిక డిమాండ్ చేస్తూ వస్తున్న బిసి సంఘాల నాయకులు, ఎన్నికలు జరిపితే భూకంపం సృష్టిస్తామన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అది సాధ్యం కాలేదు. పురపాలక ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగుతాయి కాబట్టి పార్టీలు పోటీ చేసే సీట్లలో 42 శాతం తమకు కేటాయింపు కోసం రాజకీయ పార్టీలపై ఒత్తిడి చేస్తే కొంత ఫలితం ఉండవచ్చు.

ఈ రోజు (బుధవారం) నుంచి నామినేషన్‌ల ప్రక్రియ మొదలవుతున్నందున అభ్యర్థుల నిర్ణయం, స్థానిక సర్దుబాట్లకు సమయం బహుతక్కువ ఉన్నందున రాజకీయ పార్టీలకు ఉరుకులు పరుగుల పరిస్థితి ఎదురవుతోంది. అయితే ప్రధాన పోటీదారులైన కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి ఇప్పటికే ఎన్నికల సన్నాహాల్లో మునిగి ఉన్నాయి. అయినా స్థానిక వైరాల కారణంగా కొన్నిచోట్ల రెబల్స్ బెడద తప్పకపోవచ్చు. ఏమైనా ఎన్నికలు జరిగి కిందిస్థాయిలో ప్రజాస్వామ్యయుత పాలన పునఃప్రారంభమయ్యే ప్రక్రియ ఆహ్వానించదగింది.



## నా మూలాలు గోవాలో...

నేను యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడిని. అలాగే నేను ఓవర్సీస్ ఇండియన్ సిటిజన్‌ను కూడా. నా మూలాలు గోవాలో ఉన్నందుకు గర్వపడుతున్నాను. నా తండ్రి కుటుంబం అక్కడి నుంచే యూరోప్‌కు వెళ్ళింది. కాబట్టి యూరోప్, భారత్‌ల అనుబంధం నాకు వ్యక్తిగతమైంది. భారతదేశంతో యూరోపియన్ యూనియన్ చర్చలు ఇవాళ పూర్తయ్యాయి. మా సమావేశం ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్ని పంపిస్తుంది. ప్రపంచ క్రమం మౌలికంగా పునఃపొందిక జరుగుతున్న సమయంలో ఇయు, భారతదేశం వ్యూహాత్మక, విశ్వసనీయ భాగస్వాములుగా కలిసికట్టుగా నిలబడ్డాయి. రెండు దేశాలు కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చారిత్రాక ప్రాధాన్యత కలిగింది.

- యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టా






# యువతకు ప్రేరణ 'పంజాబ్ కేసరి' జీవితం

పంజాబ్, దుడుకే గ్రామంలో ఒక సాధారణ కుటుంబంలో మున్షీ రాధా కృష్ణ, గులాబ్ దేవి దంపతులకు 28 జనవరి 1865న జన్మించిన లాలా లజపతి రాయ్ చిన్ననాటి నుంచే తల్లి తండ్రుల నుంచి ప్రేరణను పొంది దేశభక్తి, అంకితభావం, క్రమశిక్షణలతో పెరిగారు. స్వంత గ్రామంలో పాఠశాల విద్యను పూర్తిచేసి లాహోర్ ప్రభుత్వ కళాశాలలో న్యాయ పట్టా పొందారు. ఆర్య సమాజ్ ఉద్యమం నడిపిన స్వామి దయానంద్ సరస్వతి ప్రేరణతో సంఘ సంస్కర్తగా, జాతీయ భావాలను నరనరాన జీర్ణించుకున్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, రచయిత, దార్శనికుడు అయిన లాలా లజపతి రాయ్ ధైర్యసాహసాలు అనన్య సామాన్యమైనవి. బెంగాల్ విభజన, సహాయ నిరాకరణ, సైమన్ కమీషన్ వ్యతిరేక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని వేలమంది సాధారణ ప్రజలను స్వతంత్ర పోరాటంలో పాల్గొనే విధంగా మేల్కొలిపారు. 'నా శరీరంపై తెల్లోడి ప్రతి దెబ్బ బ్రిటీష్ పాలన శవపేటికకు మేకులు అవుతాయి' అనే వాక్యం లాలా లజపతి రాయ్ దేశభక్తి, భరతమాత స్వేచ్ఛా కాంక్షకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. స్వయం పాలన కోసం స్వదేశీ ఉద్యమంలో పాల్గొన్న లాలా లజపతి రాయ్ తన మిత్రులు బాలగంగాధర్ తిలక్, బిపిన్ చంద్రపాల్‌లతో కలిసి లాల్ బాల్ పాల్ అనే పేరుతో త్రయంగా పోరాటాలు కొనసాగించారు.

స్వతంత్ర పోరాటంతో పాటు ప్రముఖ రచయితగా యంగ్ ఇండియా, ఇంగ్లాండ్స్ డెట్ టు ఇండియా, ది స్టోరీ ఆఫ్ మై డిపోర్టేషన్ అనే పుస్తకాలు రచించారు. దీనికి తోడుగా విద్య ప్రాధాన్యాన్ని ప్రచారం చేయడం, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా అవగాహన, మహిళా సాధికారత లాంటి సంఘ సంస్కరణ యజ్ఞాల్లో సమిధగా సేవలు అందించారు. అంతే కాకుండా పంజాబ్ నేషనల్ బ్యాంక్, గులాబ్ దేవి స్మారక ఆసుపత్రి, సర్వెంట్స్ ఆఫ్ ది పీపుల్స్ సొసైటీ లాంటి సంస్థలను ప్రారంభించి స్థానికపు మెప్పుపొందారు. స్వతంత్ర భారత చరిత్రలో ఒక ముఖ్య అధ్యాయంగా లాలా లజపతి రాయ్ నిలుస్తున్నారు. 28 జనవరి 2026న నిర్వహించుకుంటున్న లాలా లజపతి రాయ్ జయంతి ఉత్సవాల్లో యువతరానికి ఆయన జీవిత విశేషాలను వివరించడం లేదా పోటీలు నిర్వహించడం, నివాళులు అర్పించడం, పబ్లిక్ ర్యాలీలు లాంటి కార్యక్రమాలు అనేకం చేయవచ్చు.

1928లో, యునైటెడ్ కింగ్‌డమ్ భారతదేశంలోని రాజకీయ పరిస్థితులను నివేదించడానికి సర్ జాన్ సైమన్ నేతృత్వంలో సైమన్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కమిషన్‌ను భారతీయ రాజకీయ పార్టీలు బహిష్కరించాయి, ఎందుకంటే ఇందులో భారతీయ సభ్యులు ఎవరూ లేరని, దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కమిషన్ 30 అక్టోబర్ 1928న లాహోర్‌ను సందర్శించినప్పుడు, దానికి నిరసనగా లజపత్ రాయ్ ఒక మార్చ్‌కు నాయకత్వం వహించి 'సైమన్ గో బ్యాక్' అనే నినాదాన్ని ఇచ్చాడు. లాహోర్‌లోని పోలీసు సూపరింటెండెంట్, జేమ్స్ ఏ.స్కాట్, నిరసనకారులపై లాఠీఛార్జ్ చేయమని పోలీసులను ఆదేశించాడు, రాయ్‌పై వ్యక్తిగతంగా దాడి చేశాడు. 1928 నవంబరు 17న లాలాజీ కన్నుమూశారు. పోలీసు దెబ్బలవల్లే ఆయన మరణించారని వైద్యులిచ్చిన నివేదిక బ్రిటన్ పార్లమెంటులో ఆందోళనకు దారితీసింది. కానీ, బ్రిటిష్ ప్రభుత్వం మాత్రం ఈ ఘటనతో తమకు ఎలాంటి ప్రమేయం లేదని బుకాయించింది. కానీ లాలాపై దాడికి ప్రత్యక్ష సాక్షులైన భగత్‌సింగ్ వంటి యువ ఉద్యమకారులు.. తర్వాతి రోజుల్లో అగ్గిపిడుగుల్లా మారి బ్రిటిష్ ప్రభుత్వానికి చెమటలు పట్టించటమే గాక భారతావనిలో స్వాతంత్ర్య ఆకాంక్షను రగిల్చారు. భారత స్వాతంత్ర్యోద్యమానికి దశ దిశను నిర్దేశించి, తన జీవితకాలమంతా అవని భారతి సేవకే అర్పించిన మహనీయుడు లజపతిరాయ్ 161వ జయంతి సందర్భంగా వారికి ఘన నివాళి.

*(28 జనవరి లాలా లజపతి రాయ్ జయంతి సందర్భంగా)*

# మొజాంబిక్ హక్కుల యోధకు ఇందిరాగాంధీ శాంతి బహుమతి

**జగ్‌మోహన్ థాకెన్**

'ఇందిరా గాంధీ శాంతి, నిరాయుధీకరణ, అభివృద్ధి బహుమతి–2025'కు మొజాంబిక్ నాయకురాలు గ్రాసా మాషెల్ ఎంపికయ్యారు. అందరికీ మరింత న్యాయమైన, సమానమైన సమాజాన్ని సృష్టించడం ద్వారా,స్వయం పాలన ,మానవ హక్కుల రక్షణ కోసం పోరాటం చేసి బలహీన వర్గాల జీవితాలను మెరుగుపరిచేందుకు తన జీవితాన్ని అంకితం చేసినందుకు ఆమెకు ఈ బహుమతి ప్రకటించబడింది.

ఇందిరా గాంధీ శాంతి, నిరాయుధీకరణ, అభివృద్ధి బహుమతి కింద రూ.1 కోటి నగదు, ప్రశంసా పత్రంతో కూడిన ట్రోఫీ లభిస్తుంది.న్యూఢిల్లీలోని శక్తి స్థల్ వద్ద ఇందిరా గాంధీ సమాధికి ఉపయోగించిన హెమటైట్ జాస్పర్ అనే రాయి చదరపు ముక్కతో ఈ ట్రోఫీ తయారుచేయబడింది. భారతదేశంలో లభించే అత్యంత గట్టిగా ఉండే రాళ్ళలో ఇదొకటి. ఇది 200 కోట్ల సంవత్సరాల పురాతనమైందని అంచనా.

వెండి అంచుతో ఉన్న రాయిలో ఇందిరా గాంధీ చిత్రపటాన్ని చొప్పించారు. దీనిని జైపూర్ మినియేచర్ (సూక్ష్మ వస్తువు) సంప్రదాయంలో నిపుణుడైన హస్తకళాకారుడు బాబు లాల్ మరోటియా చిత్రించారు. దేవనాగరి లిపిలో ఇందిరా గాంధీ పురస్కార్ అనే పదాలు కింద లఖించబడ్డాయి. ఈ ట్రోఫీని వెండి అంచులు కలిగిన రోజ్‌ఉడ్ పెట్టెలో ఉంచారు.





భారత మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ జాతీయ, ప్రపంచ శ్రేయస్సుకు చేసిన విశేష కృషిని స్మరించుకునేందుకు, ఆమె ప్రతిపాదిత లక్ష్యాలను ప్రోత్సహించేందుకు భారతదేశం 1985లో ఇందిరాగాంధీ శాంతి, నిరాయుధీకరణ, అభివృద్ధి బహుమతిని ఏర్పాటు చేసింది. దీనిని ఇందిరా గాంధీ మెమోరియల్ ట్రస్ట్ నిర్వహిస్తుంది.

అంతర్జాతీయ శాంతి, నిరాయుధీకరణ, జాతి సమానత్వం, దేశాల మధ్య సద్భావన, సామరస్యాన్ని ప్రోత్సహించడం, ఆర్థిక సహకారాన్ని కల్పించడం, కొత్త అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడం; అభివృద్ధి చెందుతున్న దేశాల సర్వతోముఖాభివృద్ధిని వేగవంతం చేయడం; సైన్స్, ఆధునిక జ్ఞాన ఆవిష్కరణలను మానవ జాతి విస్తృత ప్రయోజనం కోసం ఉపయోగించబడుతున్నాయని నిర్ధారించడం; స్వేచ్ఛ పరిధిని విస్తృతం చేయడం, మానవ స్ఫూర్తిని సుసంపన్నం చేయడం వంటి సృజనాత్మక ప్రయత్నాలను గుర్తించి, జాతీయత, జాతి లేదా మతం అనే తేడా లేకుండా ఒక వ్యక్తి లేదా సంస్థకు ఈ బహుమతిని ప్రతి సంవత్సరం ప్రదానం చేస్తున్నారు.

2025 సంవత్సరానికి బహుమతిని ప్రకటిస్తూ, అవార్డు నిర్ణయ జ్యూరీ ఇలా పేర్కొంది : 'భారత ప్రభుత్వ మాజీ జాతీయ భద్రతా సలహాదారు, విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి శివశంకర్ మీనన్ అధ్యక్షతన ఉన్న ఇందిరా గాంధీ శాంతి, నిరాయుధీకరణ, అభివృద్ధి బహుమతి అంతర్జాతీయ జ్యూరీ, 2025 సంవత్సరానికి బహుమతిని ప్రకటించినందుకు సంతోషం వ్యక్తం చేస్తుంది. ఒక విశిష్ట ఆఫ్రికన్ రాజనీతిజ్ఞురాలు, రాజకీయ నాయకురాలు, మానవతావాది మేడమ్ గ్రాసా మాషెల్. స్వయం పాలన, మానవ హక్కుల రక్షణ కోసం పోరాటంలో ఆమె జీవితం పెనవేసుకుంది. అందరికీ మరింత న్యాయమైన, సమానమైన సమాజాన్ని సృష్టించడం ద్వారా బలహీన వర్గాల జీవితాలను మెరుగుపరచడానికి ఆమె తన జీవితాన్ని అంకితం చేశారు.'

ఇందిరా గాంధీ మెమోరియల్ ట్రస్ట్ 2026 జనవరి 21వ తేదీన ఒక ప్రకటనలో ఇలా వెల్లడించింది:' 1945 అక్టోబర్ 17న గ్రామీణ మొజాంబిక్‌లోని గ్రాకా సింబినేలో జన్మించిన మేడమ్ గ్రాసా మాషెల్, లిస్బన్ విశ్వవిద్యాలయంలో జర్మన్ అధ్యయనం చేయడానికి స్కాలర్‌షిప్ పొందే ముందు మెథడిస్ట్ మిషన్ పాఠశాలలకు హాజరయ్యారు. అక్కడ ఆమెలో మొదటిసారి స్వాతంత్ర్యం గురించి రాజకీయ స్పృహ రగిలింది. 1973లో మొజాంబిక్‌కు తిరిగి వచ్చిన తర్వాత, ఆమె మొజాంబికన్ లిబరేషన్ ఫ్రంట్ (ఫ్రిలెమో)లో స్వాతంత్ర్య సమరయోధురాలు,ఉపాధ్యాయురాలిగా చేరారు. 1975లో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, ఆమె మొజాంబిక్ మొదటి విద్య, సంస్కృతి శాఖ మంత్రి అయ్యారు. ఆమె పదవీకాలంలో పాఠశాలల్లో నమోదులో భారీ పెరుగుదల కనిపించింది. ప్రాథమిక,మాధ్యమిక విద్యార్థుల భాగస్వామ్యం పురుషులలో 40 శాతం నుండి 90 శాతం కంటే ఎక్కువ, మహిళలలో 75 శాతం పెరిగింది.'

1990లలో తన దిశను మాచెల్ ప్రపంచ స్థాయికి మార్చుకున్నారు. పిల్లలపై సాయుధ పోరాట ప్రభావంపై ఒక సెమినల్ అధ్యయనానికి నాయకత్వం వహించేందుకు ఆమెను ఐక్యరాజ్యసమితి నియమించింది. 'ది ఇంపాక్ట్ ఆఫ్ ఆర్మ్‌డ్ కాన్‌ఫ్లిక్ట్ ఆన్ చిల్డ్రన్ ( పిల్లలపై సాయుధ ఘర్షణల ప్రభావం)' అనే అంశంపై 1996లో ఆమె నివేదిక యుద్ధ ప్రాంతాలలో పని చేసే యుఎన్, దాని సభ్యులు ప్రభావాన్ని తెలియజేసింది. ఆమె అవిశ్రాంత కృషికి ఐక్యరాజ్య సమితి నాన్సెన్ రెఫ్యూజీ అవార్డు లభించింది. 1997లో ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్ గౌరవ డేమ్ కమాండర్‌గా నియమించబడినట్లు ట్రస్ట్ తెలిపింది.

'ఆమె నాయకత్వం, అనేక ఉన్నత స్థాయి అంతర్జాతీయ సంస్థలకు విస్తరించిన ఆమె ప్రయత్నాలు సామాజిక–ఆర్థిక అభివృద్ధి రూపాంతరం చెందేలా చేశాయి. ఆమె ది ఎల్డర్స్ వ్యవస్థాపక సభ్యురాలు, గర్ల్స్ నాట్ బ్రైడ్స్‌ను స్థాపించడంలో కీలక పాత్ర పోషించారు. ఆమె యుఎన్ సెక్రటరీ జనరల్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ అడ్వొకసీ గ్రూప్ సభ్యురాలిగా కూడా పనిచేస్తున్నారు. ఆమె ఆఫ్రికా చైల్డ్ పాలసీ ఫోరం పోషకురాలిగా, మండేలా ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్మెంట్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా ప్రమాదంలో ఉన్న పిల్లలు, యువత లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి విధానాలు, కార్యాచరణపై ప్రభావితం చేస్తున్నారు' అని ఆ ప్రకటన వివరించింది.

'ఇటీవలి సంవత్సరాలలో మాచెల్ తన సొంత సంస్థలు, విద్యావిషయక నాయకత్వం ద్వారా సామాజిక పరివర్తనపై దృష్టి సారించారు.

2010లో, ఆమె గ్రాసా మాషెల్ ట్రస్ట్‌ను స్థాపించారు. ఇది మహిళల ఆర్థిక సాధికారత, ఆహార భద్రత, సుపరిపాలనను ప్రోత్సహిస్తుంది. ఆమె జిజిలే ఇన్‌స్టిట్యూట్ ఫర్ చైల్డ్ డెవలప్‌మెంట్‌ను కూడా స్థాపించారు. 2018లో మహిళలు, యుక్తవయస్కుల శ్రేయస్సుకు ఆమె చేసిన ప్రశంసనీయమైన కృషికి గాను ఆమెకు ప్రపంచ ఆరోగ్య సంస్థ అత్యున్నత గౌరవం అయిన డబ్ల్యుహెచ్‌ఒ బంగారు పతకం లభించింది'. విద్య, ఆరోగ్యం, పోషకాహారం, ఆర్థిక సాధికారత, క్లిష్ట పరిస్థితులలో మానవతావాద కృషిలో ఆమె చేసిన విప్లవాత్మక కృషికి, మరింత సమానమైన, న్యాయమైన ప్రపంచాన్ని నిర్మించడానికి లక్షలాది మందిలో ఆశను ప్రేరేపించినందుకు, 2025 సంవత్సరానికి ఇందిరా గాంధీ శాంతి, నిరాయుధీకర ణ, అభివృద్ధి బహుమతిని మేడమ్ గ్రాసా మాచెల్‌కు ప్రదానం చేయనున్నారు.

2024 ఇందిరా గాంధీ బహుమతిని చిలీ మాజీ అధ్యక్షురాలు హెచ్.ఇ.వెరోనికా మిచెల్ బాచెలెట్ జెరియాకు ప్రదానం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళలు, పురుషులకు ఆమె ఒక ఉదాహరణగా, ప్రేరణగా నిలిచి, క్లిష్ట పరిస్థితులలో శాంతి, లింగ సమానత్వం, మానవ హక్కులు, ప్రజాస్వామ్యం, అభివృద్ధి కోసం స్థిరంగా కృషి చేయడంలో, చిలీతో భారతదేశ సంబంధాలకు ఆమె చేసిన కృషికి గాను ఈ బహుమతిని ప్రదానం చేశారు.

# మేడారం మహా జాతరలో ప్రకృతి–పర్యావరణ రక్షణ ముఖ్యం

ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి అడవి తల్లి ఒడిలో జరిగే ఆధ్యాత్మిక వేడుక మేడారం జాతర. అయితే, ఈ భక్తి ప్రవాహం వెనుక పర్యావరణ విధ్వంసం పొంచి ఉన్న పరిస్థితుల్లో ప్లాస్టిక్ రహిత జాతర సాధ్యమేనా అనే ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతుంది. ఈ తరుణంలో గిరిజన సంస్కృతిని కాపాడుతూనే ప్రకృతిని రక్షించుకునేలా ముందుకు సాగాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ప్రతి ఒక్కరిపై ఉందనేది మరువకూడదు.

ములుగు జిల్లా తాడ్వాయి అడవుల్లో జరిగే ఈ జాతరకు గతంలో సుమారు కోటిన్నర మంది భక్తులు పాల్గొన్నట్లు అంచనా. ఈసారి రెండు కోట్ల జన సముద్రం తప్పదని అంచనాలు కూడా వస్తున్నాయి. వనదేవతల జాతరను ఆధునికరిస్తూ ప్రభుత్వం చర్యలు చేపడుతున్న నేపథ్యంలో భారీ సంఖ్యలో జనాలు పాల్గొనే అవకాశం గతంకంటే ఎక్కువగా ఉన్నది. పర్యావరణపై ఒత్తిడి పడటం సహజం.

జాతరలో పారిశుధ్య, ప్లాస్టిక్ నిర్వహణ, జాతర ముగిశాక మిగిలే ప్లాస్టిక్ వ్యర్థాలతో ముప్పు పొంచి ఉంది. అడవి తల్లి ఒడిలో చేరుతున్న ప్లాస్టిక్ పర్యావరణాన్ని కోలుకోలేని దెబ్బతీస్తున్నది. ఇది ప్రభుత్వానికి,అధికారులకు, నిర్వహాకులకు పెద్ద సవాల్ గా మారనున్నది. ఏటా జాతర తర్వాత అభయారణ్యంలో విచ్చలవిడిగా పేరుకపోతున్న ప్లాస్టిక్ ఇటు పర్యావరణానికి, అటు మూగజీవులకు ప్రాణసంకటంగా మారుతున్నది. గత జాతరలో ఏకంగా 12 వేల టన్నుల చెత్త పేరుకుపోగా.. అందులో సగభాగం ప్లాస్టిక్ భూతమే. ఈసారి 2 కోట్ల మందికి పైగా జనం వస్తుండటంతో. ప్లాస్టిక్ వ్యర్థాలు మరింత పెరిగే ఛాన్స్ ఉంది.

జాతరకు వచ్చే భక్తులను ప్లాస్టిక్ బాటిల్స్, ప్లాస్టిక్ కవర్స్ తీసుకురావద్దని ఫారెస్ట్ ఆఫీసర్లు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ.. ప్రధాన జాతర జనవరి 28 నుండి 31 వరకు ఉన్నందున లక్షల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఇప్పటికే గత నెల రోజులుగా వేల సంఖ్యలో భక్తులు వచ్చి పోతున్నారు. టన్నుల కొద్దీ త్రాగి పారేసిన ఖాళీ బాటిల్స్ ఎక్కడబడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. దీనితో నేల, నీరు, గాలి కలుషితం.. అటవీ ప్రాంతం కావడంతో వన్యప్రాణులపై ఎఫెక్ట్. జాతర ముగిసిన తర్వాత టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇస్తరాకులు, గాజు సీసాలు అడవిలోనే మిగిలిపోతున్నాయి. ఇది వన్యప్రాణుల మనుగడకు ముప్పుగా మారుతుంది.



**నేల, నీరు, గాలి కలుషితం కాకుండ చూడాలి!**

ఇక మరోవైపు పవిత్రంగా భావించే జంపన్న వాగులో భక్తులు స్నానాలు ఆచరించే సమయంలో సబ్బులు, షాంపులు వాడటం దుస్తులు వదిలి వేయడం వల్ల నీరు కలుషితం అవుతోంది. ఇలాంటి గతకాలపు అనుభవాలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి. ఇంకోవైపు ప్రభుత్వం ప్రతి ఏటా కోట్లాది రూపాయలను జాతర ఏర్పాట్ల కోసం ఖర్చు చేస్తుంది. గతం కంటే కూడా ఈసారి బడ్జెట్ పెంచి అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, ప్రణాళికలు కూడా రచించింది. పర్యావరణ పరిరక్షణ కోసం ఈసారి ఈ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది. వేల సంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులను నియమించి, ఎప్పటికప్పుడు చెత్తను తరలించేలా 'స్వచ్ఛ మేడారం' కార్యక్రమం తోడ్పాటును అందించాలి. అడవికి హాని కలగకుండా పర్యావరణహితమైన తాత్కాలిక మరుగుదొడ్లు, వసతి సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. అలాగే 'మేడారం జాతరలో ప్లాస్టిక్ వాడకండి.. పర్యావరణాన్ని రక్షించండి ' అని ప్రభుత్వం నినాదంగా ముందుకు సాగడం మంచి విషయమే. కానీ, ఈ జాతరలో లక్షలాది మంది భక్తుల వసతికి సంబంధించి తాత్కాలిక ఏర్పాట్లు చేసి పర్యవేక్షించాలి. కల్తీ మద్యం, మాంసం పట్ల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాల్సిన బాధ్యత సర్కార్ దే.

**ప్లాస్టిక్ ఫ్రీ మేడారానికి భక్తులు సహకరించాలి:**

నదులు, అడవులు కాలుష్యం కావటం, పర్యావరణానికి ప్రమాదం. ఇవి జాతర ప్రభావంతో మరింత తీవ్రమవుతాయి.

ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ప్రయత్నాలు ఎన్ని ఉన్నా, క్షేత్రస్థాయిలో కొన్ని సవాళ్లు ఎదురవక తప్పదు. ఇలాంటి స్థితిలో భక్తుల్లో పర్యావరణం పట్ల అవగాహన పెరగాలి. అమ్మవారికి బంగారం (బెల్లం) సమర్పించడం పుణ్యంగా భావించేవారు, అడవిని శుభ్రంగా ఉంచడం కూడా అంతే ముఖ్యం. జంపన్న వాగు శుద్ధి కోసం అత్యాధునిక ఫిల్టరేషన్ పద్ధతులను ప్రవేశపెట్టాలి. జాతర పరిసరాల్లోనే వ్యర్థాలను వేరు చేసి అవకాశాలు ఉంటాయి.

మేడారం జాతర నిర్వహణకు ప్రభుత్వం ట్రస్ట్ ఏర్పాటు చేసింది. ఈ ట్రస్టు ప్రత్యేకంగా జాతరకొచ్చే అసంఖ్యాక భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని చెప్తున్నప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ఈ చెత్తనంతా ఎప్పటికప్పుడు క్లియర్ చేసేందుకు 24 గంటలు షిఫ్టుల్లో పనిచేసేలా 10 వేల మంది పారిశుద్ధ కార్మికులను నియమించారు. చెత్త తరలింపునకు ట్రాక్టర్లు, జెసిబిలు, డోజర్లను సిద్ధం చేశారు. జాతరలో బలి ఇచ్చే కోళ్లు, మేకల వ్యర్థాలతో దుర్వాసన రాకుండా వాటిని బయో ప్లాంట్ కు తరలించి శాస్త్రీయంగా నిర్మూలించనున్నారు. వాష్ రూమ్, మరుగుదొడ్ల నుంచి వాసన రాకుండా కెమికల్స్ స్ప్రే చేస్తున్నారు. ఫినాయిల్ ఇతర రసాయనాలను వాడనున్నారు. రోజు ఫాగింగ్ చేసేలా ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా.. భక్తుల సహకారం లేనిదే ప్లాస్టిక్ ఫ్రీ మేడారం సాధ్యం కాదని, ఇంటి నుంచి వచ్చేటప్పుడే ప్లాస్టిక్ సంచులు తీసుకురావద్దని, గుడ్డ సంచులు తెచ్చుకోవాలని ఫారెస్ట్ అధికారులు కోరుతున్నారు.

మేడారం కేవలం ఒక జాతర మాత్రమే కాదు, అది గిరిజన అస్తిత్వానికి ప్రతీక. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, భక్తులు సమన్వయంతో పని చేసినప్పుడే అడవి తల్లి ఒడి చల్లగా ఉంటుంది. పర్యావరణాన్ని కాపాడుకుంటూ జరుపుకునేదే అసలైన జాతర.

ఉజ్జిని రత్నాకర్ రావు,
9490952646



## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ల రద్దు కోరుతూ 12న సమ్మె :ఎఐటియుసి

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 12వ తేదీన నిర్వహించనున్న సమ్మెకు సంబంధించి ఎఐటియుసి ఆధ్వర్యంలో సమ్మె నోటీసును మంగళవారం నిజాంపేట డిప్యూటీ కమిషనర్ సాబేర్ అలీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వాటి స్థానంలో గతంలో ఉన్న 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కోరారు. ఈ సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ఆశీ యాదయ్య, బక్క మల్లేష్, పొన్నకంటి దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.



## కాలనీ సమస్యలపై పాదయాత్ర

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** 124 ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలో శివమ్మ కాలనీలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మంగళవారం జిహెచ్ఎంసి అధికారులు, కాలనీ వాసులతో కలిసి పాదయాత్ర చేసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివమ్మ కాలనీలో కొంతమేర డ్రైనేజీ, సిసి రోడ్లకు సంబంధించిన పెండింగ్ వర్క్స్ ఉన్నాయని, వాటిని శేరిలింగంపల్లి శాసనసభ్యులు పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీ దృష్టికి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చేయించి అతి త్వరలో నిర్మాణ పనులు మొదలుపెడతామని హామీ ఇచ్చారు. కాలనీలో తొంభై శాతంపైన అభివృద్ధి పనులన్నీ పూర్తయ్యాయని, కొంతమేర పెండింగ్‌లో ఉన్న పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, కాలనీ ప్రెసిడెంట్ కె.నరసింహులు, మన్యం, ఆదినారాయణ, గిరి, జిహెచ్ఎంసి అధికారులు ఎస్ఆర్‌పి నాగేశ్వర నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, యుబిడి నాగరాణి, ఎంటమాలజీ సూపర్‌వైజర్ డి.నరసింహులు, వాటర్ వర్క్స్ సూపర్‌శైజర్ శివ, ఎస్ఎఫ్ఎ వెంకటరెడ్డి, మల్లేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రైల్వే వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** గత 17 ఏళ్లుగా నరకయాతన చూస్తున్న ప్రజలకు రైల్వే వంతెన నిర్మాణాన్ని ఇకనైనా తొందర్లో పూర్తిచేసి అందుబాటులో ఉంచాలని మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ తెలిపారు. మంగళవారం అబ్బసాని యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్‌లో కాలనీ ప్రజలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యూత్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం కొరకు మొదటి కాంట్రాక్టర్ 18 నెలల్లో బ్రిడ్జి పూర్తి చేస్తామని ఒప్పందం కుదుర్చుకుని 16ఏళ్ళయినా పూర్తి చేయలేదు, బ్రిడ్జి కోసం అప్పట్లో నిరాహార దీక్షలు, ఎన్నో ధర్నాలు చేశామని బ్రిడ్జి కాంట్రాక్టర్ తొందర్లో పూర్తిచేయకుంటే ఆయన స్థానంలో వేరే అతనికి కాంట్రాక్ట ఇచ్చి తొందరలో బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని యాదగిరి యాదవ్ కోరారు.



## అద్రాస్‌పల్లి అన్ని రంగాల్లో అభివృద్ధి

### ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అద్రాస్‌పల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని యువకులు ముందుకు వచ్చి గ్రామాభివృద్ధికి చేయూత నివ్వాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మున్సిపల్ అద్రాస్‌పల్లిలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే మల్లారెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు గ్రామాభివృద్ధికి కలిసి రావాలని ఈ మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకుందామని చెప్పారు. ఇప్పటికే గ్రామంలో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, గుడులు, గోపురాలు కట్టించామని చెప్పారు. ఇంకా గ్రామాన్ని అభివృద్ధిబాటలో నడిపించేందుకు బిఆర్ఎస్‌ను గెలిపిద్దామని చెప్పారు. అద్రాస్‌పల్లి గ్రామాన్ని కోటి రూపాయలతో అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలిత నర్సింహా, మాజీఉపసర్పంచ్ జహంగీర్, నాగరాజు, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

## కూన శ్రీశైలంగౌడ్‌కు ఆహ్వానాల వెల్లువ

**ప్రజాపక్షం/ కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ను మంగళవారం పలువురు కలిసి ఆహ్వానాలు అందజేశారు. అనంతరం శ్రీశైలంగౌడ్ ఆహ్వానాలను స్వీకరించి, పలు సమస్యల పరిష్కారానికై వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చే ప్రతీ సమస్యను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేడ్చల్‌లోని 3 మున్సిపాలిటీల్లో

# మొదలైన ఎన్నికల సందడి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** రాష్ట్ర వ్యాప్తం గా జరుగనున్న మున్సిపాలిటీలకు ఎన్నికలకు నగారా మోగించటంతో మేడ్చల్ జిల్లాలో మిగిలిన మూడు మున్సిపాలీటీలకు జిల్లా యంత్రాంగం అధికారికంగా సిద్ధమైంది. మంగళవారం సాయంత్రం నుండే ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని జిల్లా కలెక్టర్ మనుచౌదరి ప్రకటించారు. ఈ నెల 28 బుధవారం నుండి 30 శుక్రవారం వరకు నామినేషన్లు స్వీకరణ, 31న నామినేషన్ల స్క్రూటిని ఉంటుందని, అనంతరం ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఫిబ్రవరి 11న పోలింగ్, కౌటింగ్ 13న జరుగుతుందని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని, వార్డు సభ్యుల ఎన్నిక్ల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని, ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులకు, ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బందికి సూచించారు. ఎన్నికల నిర్వహనకు అవసరమైన కార్యాచరణ, శాంతిభద్రతలను కాపాడుతూ ఎన్నికల నియమావళి పటిష్టంగా అమలు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎన్నికల పరిశీలకులకు శిక్షణ అందించామన్నారు. 2011 ఎన్నికల జాబితా ప్రకారం షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, 2024 ఎన్నికల జాబితా ప్రకారం ఎస్ఈఈఈపిసి సర్వే ప్రకారం వెనుక బడిన తరగతులకు రిజర్వేషన్లు కేటాయించటం జరిగిందన్నారు.




**ఎన్నికల ఏర్పాట్లకు సన్నిద్ధం**

మేడ్చల్ జిల్లాలో తొలుత ఉన్న 12 మున్సిపాలిటీలు, మున్సిపల్ కమిషనరేట్లలో 9 జిహెచ్ఎంసిలో విలీనం కాగా మిగిలిన మూడు మున్సిపాలిటీలకు ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సన్నిద్ధమైంది. మూడుచింతలపల్లి, ఎల్లంపేట, ఆలియాబాద్ మున్సిపాలిటిలలో 65866 మంది ఓటర్లలో 33051 మంది పురుషులు, 32812 మంది మహిళలు, ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఈ మున్సిపాలిటీల్లోని ఎన్నికలు జరిగే 68 వార్డులకు గాను 136 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసారు. మరో వైపు మున్సిపల్ చైర్మన్లు, వార్డుల రిజర్వేషన్లను ప్రకటించారు. ఎన్నికలను సజావుగా నిర్వహించే క్రమంలో బ్యాలెట్ బాక్సులు పరిశీలన, టీ పోల్ యాప్‌లో పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల మ్యాపింగ్‌ను పూర్తి గావించారు.ఎన్నికల నిర్వహణలో భాగంగా ఇప్పటికే జిల్లా కలెక్టర్ పలు సార్లు ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశాలు నిర్వహించటంతో పాటు దిశానిర్దేశం చేస్తూనే రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికార్లు, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఓట్ల లెక్కింపు సిబ్బందికి జిల్లా స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు పూర్తి చేసారు. నామినేషన్లను స్వీకరించే సమయంలో తీసుకోవలసిని జాగ్రత్తలు, నామినేషన్ల పరిశీలన, పోటీ చేయనున్న అభ్యర్థులకు కేటాయించే సింబల్స్ కేటాయించటం, పోస్టల్ బ్యాలెట్ పేపర్ ఇచ్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మోడల్ ఆఫ్ కండక్టు, పోలింగ్ కంటె ముందు, పోలింగ్ సమయం, పోలింగ్ పూర్తయిన తర్వాత చేయాల్సిన పనులు, కౌటింగ్ జాగ్రత్తలపై సవివరంగా శిక్షణనిచ్చారు. దీంతో పాటు పోటీ చేసే అభ్యర్థులు చేయవలసిన ఖర్చుల వివరాలు, వాటి అకౌంట్ నిర్వహణ, పరిశీలన అంశాలపై సైతం సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండే విధంగా దిశానిర్దేశం చేసారు.

**సిద్ధమైన రాజకీయ పార్టీలు**

మరో పక్క అధికార పార్టీతో సహా ప్రతిపక్ష పార్టీలు ఎవిరికి వారు తమ అభ్యర్థులను గెలిపించుకొనేందుకు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. గెలుపు గుర్రాల కోసం ఓ వైపు వెతుకుతూనే పార్టీలో తిరుగుబాటు లేకుండా ఉండే విధంగా అభ్యర్థులను ఎంపిక చేసే యత్నాల్లో అన్ని పార్టీల అధినేతలు యత్నిస్తున్నారు. జిల్లాలోని మూడు చింతలపల్లి, ఆలియాబాద్, ఎల్లంపేట మున్సిపాలిటీల్లోని ఎన్నికలు జరుగనున్న 68 కౌన్సిలర్ స్థానాల్లో తమ సత్తా చాటుకొనే లక్ష్యంగా కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిలతో పాటు కార్మిక, కర్షక వర్గాల్లో పట్టున్న సిపిఐ, సిపిఎం సన్నిద్ధమయ్యాయి. అధికారిక పార్టీ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ మూడు మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశాలు ఇప్పటికే నిర్వహించారు. మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి బిఆర్ఎస్ నేత తన శైలిలో అన్ని మున్సిపాలిటీలు తమవే అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఇక పోతే మల్కాజిగిరి ఎంపిగా బిజెపి పార్టీ పక్షాన ఉన్న ఈటెల రాజేందర్‌కు కింది స్థాయిలో పట్టు లేనప్పటికి తమ ఉనికిని చాటుకొనే యత్నాల్లో ఉన్నారు.




## తెలంగాణ ఉత్తమ హాస్పిటల్‌గా రాందేవ్‌రావ్ హాస్పిటల్

### 'గవర్నర్ ఎక్సలెన్సీ–2025 ఎట్ హోమ్'లో దక్కిన అరుదైన గౌరవం

### మెడికల్ డైరెక్టర్ కమలాకర్ కు 2లక్షల నగదు బహుమతి అందజేసిన గవర్నర్

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 26న 'గవర్నర్ ఎక్సలెన్సీ–2025 ఎట్ హోమ్' కార్యక్రమాన్ని లోక్ భవన్ నందు ఘనంగా జరిగింది. లోక్‌భవన్‌లో మంగళవారం 2లక్షల రూపాయలు నగదు బహుమతి, అవార్డు గ్రహీతలకు ప్రశంసాపత్రాన్ని గవర్నర్ చేతుల మీదుగా రాందేవ్‌రావు ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ కమలాకర్ అందుకున్నారు. ఈ సందర్భంగా రాందేవ్‌రావు ఆసుపత్రి మేనేజ్‌మెంట్ అభినందన కార్యక్రమం నిర్వహించి, ఉద్యోగులందరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రంతిదేవ్‌రావు, మీరారావు, విక్రందేవ్ రావు, జ్యోతిరావు, విజయలక్ష్మి, పృథ్వీరెడ్డి, భారతిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, అపర్ణరావు, జివి రమణ, సిఇఓ డా.ఎన్ యోబు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి 'హిస్ ఎక్స్‌లెన్సీ' గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సుధాదేవ్‌వర్మ, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, గడ్డం ప్రసాద్ కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, అడలూరి లక్ష్మణ్, మాజీ గవర్నర్ బండారు దత్తత్రేయ, ఎంపీ ఈటెల రాజేందర్, ప్రభుత్వ ప్రధాన సలహాదారులు, కె.కేశవరావు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ రమణ, డి.శ్రవణ్, ఎమ్మెల్యే వివేకానంద, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు, డిజిపి శ్రీధర్‌రెడ్డి అధికార పార్టీ కార్యకర్తలతో పాటు బిజెపి, బిఆర్ఎస్, ఐఎఎస్, ఐపిఎస్ విదేశీ రాయబారులు, స్వతంత్ర సమరయోధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కార్పోరేట్ సంస్థల కృషి

### డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కార్పోరేట్ సంస్థల కృషి అభినందనీయమని మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. మంగళవారం శామీర్‌పేట డివిజన్‌లోని దేవరయాంజాల్ ప్రాథమిక పాఠశాలకు రాజబొల్లారంలోని మోనార్క్ ఎర్గో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం విద్యార్థులకు విరాళంగా అందజేశారు. జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిల సహాకారంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కల్యాణికి అందజేశారు. అనంతరం ముఖ్య అతిథి వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులు కల్పించడం ద్వార నాణ్యమైన విద్య అందుతుందన్నారు. సంస్థ అధినేత కోటేష్ జగన్నాథం మాట్లాడుతూ విద్య సమాజాభివృద్ధికి పునాది లాంటిదని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించడం సామాజిక బాధ్యతలో ఓ భాగమని భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు. అనంతరం పాఠశాల యాజమాన్యం సంస్థ అధినేత జగన్నాథంకు, వజ్రేష్‌యాదవ్, బీమిడి జైపాల్ రెడ్డిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, శ్రీసీతా రామచంద్రస్వామి కమిటీ చైర్మన్ పెండెం లక్ష్మినారాయణ(నాని), కమఠం కృష్ణారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కట్ట మీనా కుమారి, ఆలయ ధర్మకర్తలు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.





## రైల్వే అండర్ బ్రిడ్జి ప్రారంభం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉండే నేరేడ్‌మెట్ చౌరాస్తా, మల్కాజిగిరి మార్గంలో ఉన్న వాజిపేయినగర్ రైల్వేగేట్ వద్ద ఎదురయ్యే ట్రాఫిక్ సమస్యలు ఎట్టకేలకు తీరనున్నాయి. సుదీర్ఘకాలంగా ఈ రైల్వే గేట్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలన్న ప్రజల పోరాటానికి ఫలితం దక్కింది. మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డిలు దీనికోసం పలుసార్లు కేంద్ర రైల్వే మంత్రి, దక్షిణ మధ్య రైల్వే అధికార్లకు వినతి పత్రాలివ్వటం, సమావేశమవ్వటంతో పాటు స్థల పరిశీలన చేసారు.ఈ పనులకుగాను కేంద్రంతో రూ.80.47కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వీటి నుండి వాజ్‌పేయినగర్ రైల్వేగేట్ వద్ద రూ.74.47కోట్ల వ్యయంతో రైల్వే అండర్ బ్రిడ్జి, సఫిల్‌గూడ రైల్వే స్టేషన్ సమీపంలో రూ.6 కోట్ల వ్యయంతో సబ్‌వే నిర్మాణ పనులను మంగళవారం మల్కాజిగిరి ఎంపి ఈటెల, ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి, కార్పొరేటర్లు శ్రావణ్, సునీత శేఖర్ యాదవ్, మేకల సునీత రాము యాదవ్, అనిల్ కిషోర్ గౌడ్, శాంతి శ్రీనివాసరెడ్డి, రైల్వే శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులతో బైక్ ర్యాలీ : ఎసిపి శంకర్‌రాజు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరు తప్పకుండా పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ఎసిపి శంకర్‌రాజు అన్నారు. మంగళవారం తూంకుంటలోని విశ్వవిశ్వాణి కళాశాలలో 'అరైవ్–అలైవ్ 2026' లో భాగంగా విద్యార్థులతో కలిసి రోడ్డు భద్రత నిబంధనలపై బైక్ ర్యాలీ నిర్వహించి విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలను ప్రజలందరూ తూ.చ తప్పకుండా పాటించి రోడ్డు ప్రమాదాలు జరుగుకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పకుండా హెల్మెట్‌లు ధరించాలని చెప్పారు. నాలుగు చక్రాల వాహనాలు నడిపే వాహనదారులు సీటు బెల్ట్ పెట్టుకోవాలని పరిమితికి మించి వ్యక్తులు వాహనాలపై ప్రయాణించకూడదని అన్నారు. మద్యం సేవించి, మొబైల్ వాడుతూ, నిర్లక్ష్యంగా, వేగంగా డ్రైవింగ్ చేయకూడదని చెప్పారు. తమ వాహనాలకు సంబంధించిన ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్‌లను గడువులోపు విధిగా చేయించుకోవాలని సూచించారు. అనంతరం విశ్వవిశ్వాణి కళాశాల గ్రూప్ డైరెక్టర్ రామకృష్ణ చిన్నంతో కలిసి విద్యార్థులతో బైక్ ర్యాలీ నిర్వహించి ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ సిఐ శంకరయ్య, శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్ఐలు శశివర్ధన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఉప్పర్‌పల్లిలో మెప్మా మహిళా సంఘాలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన నిర్వహించారు. చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకునేందుకు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటిస్తు సురక్షితంగా వాహనం నడిపే విధంగా తమ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు.






## భాషా నైపుణ్యంతో విద్యార్థుల వికాస అభివృద్ధి

### ఎంఇఒ చంద్రప్ప

**ప్రజాపక్షం/కోట్‌పల్లి:** కోట్‌పల్లి మండల కేంద్రంలో రూప్ టీఎస్–2026 క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంఇఒ చంద్రప్ప, ఎంపిడిఒ హేమంత్, ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులలో భాషా నైపుణ్యాలను పెంచడం వలన వారు మరింత అభివృద్ధి సాధించగలరని పేర్కొన్నారు. జాతీయ భాష హిందీ, మాతృ భాష తెలుగులో విద్యార్థుల పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి భాషా ఉపాధ్యాయులు తీవ్రంగా కృషి చేస్తున్నారని, విద్యార్థులలో భాషా నైపుణ్యాలను మెరుగు పరచడానికి మరింత అంకితభావంతో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రవి, శ్రీనివాస్, ఫాతిమా బేగం, మల్లికార్జున్,తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత పిలుపిచ్చారు. డివిజన్‌లోని హన్మాన్‌నగర్ కమ్యూనిటీ హాలులో మంగళవారం జరిగిన చైతన్య మహిళా మండలి 37వ వార్షికోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలు, యువతులు, మహిళల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయ ని, పలురంగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నాయన్నారు. వీటిని వినియోగించుకొంటూ విద్యతో పాటు వ్యాపార, రాజకీయ తదితర రంగాల్లో తమ సత్తా చూపించేందుకు కృషి చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి.

## మర్డర్ మిస్టరీని ఛేదించిన పోలీసులు... బంగారం ఆభరణాల కోసమే మహిళ హత్య

### డిఎస్‌పి నర్సింగ్ యాదయ్య

**ప్రజాపక్షం/తాండూరు:** ఈ నెల 24న వెలుగు చూసిన మహిళ హత్య కేసును పెద్దేముల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం తాండూరు డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తాండూరు డిఎస్పీ నర్సింగ్ యాదయ్య రూరల్ సిఐ ప్రవీణ్‌కుమార్, పెద్దేముల్ ఎస్ఐ శంకర్‌లతో కలసి వివారలను వెల్లడించారు. యాలాల మండల పగడ్యాల గ్రామానికి చెందిన బందెమ్మ(54) తాండూరు పట్టణంలో అడ్డకూలీగా పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తుంది. అయితే ఆమె వద్ద ఉన్న బంగారు, వెండి నగలను అపహరించేందుకు అడ్డకూలీలుగా పనిచేస్తున్న పెద్దేముల్ మండల బండమీదిపల్లి గ్రామానికి చెందిన మాల నర్సిములు, కర్నాటక రాష్ట్ర బసవకళ్యాణ్ చరణ్‌నగర్‌కు చెందిన కిషోర్ షిండే ఇద్దరు కలసి ఈ నెల 22న కూలీ పని ఉందంటూ నమ్మించి బందెమ్మను పెద్దేముల్ మండల రెగొండి అడవి ప్రాంతంలోకి తీసుకుని పోయి గొంతుకోసి హత్య చేశారు. అనంతరం ఆమె వద్ద ఉన్న 2.2గ్రాముల బంగారం ఆభరణాలు, 30తులాల వెండి కడియాలు, ముక్కు పోగులు తస్కరించిన వీరు శంకర్‌పల్లిలోని బంగారు దుకాణంలో రూ.49వేలకు విక్రయించారు.పోలీసులు పట్టణంలోని కూలీల అడ్డల వద్ద ఉన్న సిసి కెమెరాలను పరిశీలించగా బందెమ్మను తీసుకవెళ్తున్న ఇద్దరి కూలీలను గుర్తించి విచారణ చేయగా మహళను తామే హత్య చేసినట్లు ఒప్పుకున్నారని, వారు ఆ మహిళ నుండి చోరి చేసిన నగలను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితులను అదుపులోకి తీసుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందికి డిఎస్పీ అభినందించి వారికి రివార్డులను అందజేశారు.

## నేటి నుండి 30వరకు నామినేషన్ల స్వీకరణ

**ప్రజాపక్షం /వికారాబాద్ :** నేటి నుండి 30వరకు ఎన్నికల నామినేషన్‌లు స్వీకరించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. జిల్లాలోని నాలుగు మున్సిపల్స్‌లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తక్షణమే అమల్లోకి వచ్చిందని తెలిపారు. మున్సిపల్ సాధారణ ఎన్నికలు–2026 నిర్వహించే , రాష్ట ఎన్నికల కమిషన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో, వికారాబాద్ జిల్లా నుండి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా, అదనపు కలెక్టర్ సుధీర్, కొడంగల్, వికారాబాద్, పరిగి, తాండూర్ మున్సిపల్ కమిషనర్లతో కలిసి పాల్గొన్నారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ 28.01.2025 నుండి 30.01.2026 5గంటల వరకు స్వీకరించ దం జరుగుతుందన్నారు. 31నుండి 1వరకు పరిశీలినచేయడం జరుగుతుందన్నారు. 02.02.2026 అప్పీల్స్ పరిష్కారం, 03.02.2026 తుది జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. 11.02.2026న పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 13.02.2026 ఓట్ల లెక్కింపు ఉదయం 8గంటల నుండి జరుగుతుందన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు ఎలాంటి ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు తావు లేకుండా అన్ని రాజకీ య పార్టీలు, అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్నికల నియమాలను కచ్చితంగా పాటించాలని, పట్టణ పరిధిలో ఉన్న అన్ని రాజకీ య బ్యానర్లు, ఫ్లెక్సీలు, పోస్టర్లు, ఫోటోలు, అభ్యంతరకరమైన ప్రచార సామగ్రిని వెంటనే తొలగించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

## కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**ప్రజాపక్షం /వికారాబాద్ :** జిల్లాలోని రైతుల సౌకర్యార్థం కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు మార్క్‌ఫెడ్ జిల్లామేనేజర్ తహిమీనా ఒక ప్రకటనలో తెలిపారు.వికారాబాద్ జిల్లాలో నాఫెడ్ ఆధ్వర్యంలో మార్కెట్ ద్వారా ఏడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొడంగల్, మర్పల్లి, తాండూర్, పరిగి, వికారాబాద్, ధారూర్, పూడుర్ ల లో గల పిఎసిఎస్ కేంద్రాల ద్వారా కందులు కొనుగోలు కేంద్రాల ద్వారా కందులు సేకరించడం జరుగుతుందని అన్నా రు. క్వింటాలుకు రూ.8వేల కనీస మద్దతు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రైతులు ప్రభుత్వం కల్పించే ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దళారుల ద్వారా మోసపోకూడదని జిల్లా మేనేజర్ సూచించారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
బుధవారం
28-01-2026
www.prajapaksham.in
స్థానికం LOCAL NEWS

# మున్సిపోల్స్‌కు మోగిన ఎన్నికల నగరా

ఆరు పురపాలికలకు షెడ్యూల్

28 నుంచి నామినేషన్ల స్వీకరణ

ఫిబ్రవరి 11న పోలింగ్...13న ఫలితాలు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మున్సిపల్ ఎన్నికల నగరా మోగింది. ఇప్పటికే చైర్మన్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు చేసిన ఎన్నికల కమిషన్ తాజాగా రంగారెడ్డిలో ఆరు మున్సిపాలిటీలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలో ఆరు మున్సిపాలిటీల పరిధిలో 126 వార్డులు ఉండగా, వీటి పరిధిలో 1,75,974 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 88,542 మంది మహిళలు ఉండగా, 87,478 మంది పురుషులు ఉన్నారు. ముగ్గురు ఇతరులు ఉన్నారు. వీటి పరిధిలో మొత్తం 274 పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేశారు. ఇబ్రహీంపట్నం లో ప్రతి 542 మందికి ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, ఆమనగల్‌లో 567 మందికి, చేవెళ్లలో 686 మందికి, మెయినాబాద్‌లో 632 మందికి, శంకర్‌పల్లిలో 713 మందికి, షాద్‌నగర్‌లో 676 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం చొప్పున ఏర్పాటు చేశారు.

### జిల్లాలోని మున్సిపాలిటీల్లో వార్డులు,ఓటర్లు ఇలా.....

| మున్సిపాలిటీ | వార్డులు | పోలింగ్ స్టేషన్లు | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| ఆమనగల్లు | 15 | 30 | 8475 | 8509 | 0 | 16984 |
| ఇబ్రహీంపట్నం | 24 | 48 | 12741 | 13252 | 0 | 25993 |
| షాద్‌నగర్ | 28 | 76 | 26679 | 26723 | 1 | 53403 |
| శంకర్‌పల్లి | 15 | 31 | 10551 | 10850 | 0 | 21401 |
| చేవెళ్ల | 18 | 37 | 12579 | 12791 | 1 | 25371 |
| మెయినాబాద్ | 26 | 52 | 16453 | 16453 | 1 | 32871 |




## అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

బియన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** బియన్‌రెడ్డి నగర్ డివిజన్‌ల్లో జరుగుతున్న అభివృద్ధి పనులల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకోవాలని బియన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని వైదేహి నగర్ కాలనీలో 83 లక్షల సీసీ రోడ్డు, సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేస్1లో 19.50 లక్షల సీసీ రోడ్డు, శ్రీపురం కాలనీలో 37 లక్షల సీసీ పనులను కాలనీ వాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, కాలనీ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, కృష్ణరెడ్డి, ముత్యంరావు, శ్రీధర్‌రెడ్డి, పద్మారెడ్డి, వెంకట్రాంరెడ్డి, విఠల్‌రెడ్డి, చంద్రయ్య, పురుషోత్తంరెడ్డి, శిరీష్, రాజేందర్‌రెడ్డి, వేంకటేశ్వర్‌రావు, దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలం




**ప్రజాపక్షం/కొందుర్గు:** గ్రామ పంచాయతీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నరసింహారెడ్డి ఆరోపించారు. మంగళవారం కొందుర్గు మండల కేంద్రంలో ఎంపిఓ విజయ్‌కుమార్ పాల్ పంచాయతీ వర్కర్స్ యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, నరసింహారెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు మౌళిక సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి భాగల నరసింహా, సురేష్, యాదయ్య, జంగయ్య, సత్యంలు పాల్గొన్నారు

## గ్రామ పంచాయతీలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి : ఎంపిడిఓ



**ప్రజాపక్షం/కేశంపేట:** గ్రామ పంచాయతీలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులందరు కృషి చేయాలని కేశంపేట ఎంపిడిఓ రవిచంద్రకుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో సర్పంచ్ బీసా కవిత కరుణాకర్‌తో కలిసి నర్సరీలో నిర్వహిస్తున్న పనులను, ఉపాధి హామీ పథకం పనులు, చెత్త డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ రవిచంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ తడి చెత్త, పోడి చెత్తలతో అనేక ఉపయోగాలు ఉన్నాయని వివరించారు. తడి చెత్త ద్వారా ఎరువులను తయారు చేసుకునేందుకు గ్రామస్తులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిఓ కిష్టయ్య, పంచాయతీ కార్యదర్శి అవినాష్ గౌడ్, ఉప సర్పంచ్ రవినాయక్, వార్డు సభ్యులు పోగుల నర్సింలు, పోగుల నరేష్, లచ్చిరామ్ నాయక్, కావలి వసంత, చాపల కృష్ణయ్య, కందెన సంతోష, లాలమోని మల్లేష్, ఫీల్డ్ అసిస్టెంట్ యాదయ్య, గ్రామస్తులు కల్వకోలు నిరంజన్, కుమ్మరి శేఖర్, బుచ్చిరెడ్డి, జంగయ్య, అంజమ్మ, అరుణమ్మ, మాసమ్మలు పాల్గొన్నారు.

## బ్రహోత్సవాలకు విరాళం అందజేత



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్‌కెపురం డివిజన్ అల్కాపురికాలనీలోని శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయాల్లో జరగబోయే బ్రహోత్సవాలకు ఉపేందర్‌రెడ్డి తన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ. 25వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాతిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం ఉపేందర్‌రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మాధికారి కె.వి.శ్రీనివాస్, నాయకులు పెద్దవూర సైదులు, సంతోష్, నగేష్, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

## వనదేవతలను దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం : ఎమ్మెల్యే శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విశిష్టత, చరిత్ర కలిగిన వనదేవలు సమ్మక్క..సారక్కలను దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తోపాటు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున అమ్మవారి దర్శనార్థం తరలివెళ్ళారు. మేడారం ఆలయ అధికారులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అమ్మవార్లకు భక్తి శ్రద్దలతో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు నిలువేత్తు బంగారం సమర్పించడంతోపాటు మేడారంలో ఎమ్మెల్యే తులాభారం చేశారు. అమ్మవార్ల ఆశీస్సులు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగారెడ్డిగూడ ఉప సర్పంచ్ అశోక్, మాజీ ఉప సర్పంచ్ సీతారాములు, తుపాకుల శేఖర్, ఎమ్మెల్యే అల్లుడు నాని, కమ్మదనం నవీన్, అంజి, హాజిపల్లి దర్శన్, రాణా, మహేందర్ తదితరులు ఉన్నారు.

## ప్రొఫెసర్ మనోహర్‌పై సస్పెన్షన్ ఎత్తేయాలి

ఒయు జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఒయుటిఎ) అధ్యక్షులు ప్రొఫెసర్ బి.మనోహర్‌పై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తేయాలని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఒయు ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు. సిఎఎస్ ప్రమోషన్లు నిరాకరించబడిన 47 మంది అధ్యాపకులకు తక్షణమే పదోన్నతులివ్వాలని కోరారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఒయుటిఎ మీడియా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సిఎఎస్ పదోన్నతులివ్వాలని కోరుతూ మధ్యాహ్న భోజన విరామ సమయంలో చేపట్టిన శాంతియుత నిరసనకు నాయకత్వం వహించిన మనోహర్‌ను అన్యాయంగా సస్పెండ్ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. బిజెపి ఎంఎల్‌సి అంజిరెడ్డి మాట్లాడుతూ అధ్యాపకులను వేధించేలా వర్సిటీ యాజమాన్యం వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఇందిర శోభ మాట్లాడుతూ మనోహర్ ఘటనను సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని మనోహర్ న్యాయం జరిగేలా కృషిచేస్తానన్నారు. సమావేశంలో ఒయుటిఎ ప్రధానకార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'మేడారం' జాతరపై విశిష్ట పరిశోధనా గ్రంథం' ఆవిష్కరణ




**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** గిరిజన సంస్కృతి, విశ్వాసం, ఆర్థిక వ్యవస్థలను అవగాహన చేసుకొనేవిధంగా "మేడార జాతరపై విశిష్ట పరిశోధనా గ్రంథం" నిలువనున్నదని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టరెడ్డి, లోక్‌సత్తా అధినేత, రిటైర్డ్ ఐఎఎస్ జయప్రకాశ్ నారాయణ్, సమ్మక్క సారలమ్మ కేంద్ర గిరిజన వర్సిటీ విసి ప్రొఫెసర్ వై.ఎల్.శ్రీనివాస్, ఒయు డీన్ బి.సుధాకర్‌రెడ్డి తదితరులు కలిసి డా.మల్లికార్జున నాయక్ రచించిన 'మేడార జాతరపై విశిష్ట పరిశోధనా గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయప్రకాశ్ నారాయణ్,బాలకిష్టరెడ్డి మాట్లాడుతూ సమాజంలో శాంతి వర్ధిల్లడం, నేరాలు తగ్గాయంటే అందుకు చట్టబద్ధపాలన వల్ల కాదని, అది కేవలం మన సంస్కృతి, ధర్మం, దేవుడి మీద ఉన్న నమ్మకమని అభిప్రాయపడ్డారు.

## తడి వ్యర్థాల నిర్వహణపై జిహెచ్‌ఎంసి మేధోమథనం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో పెరుగుతున్న తడి వ్యర్థాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) కీలక అడుగు వేసింది. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అబిడ్స్‌లోని తాజ్ మహల్ హోటల్‌లో 'వికేంద్రీకృత కమ్యూనిటీ స్థాయి తడి వ్యర్థాల నిర్వహణ' అనే అంశంపై ప్రత్యేక మేధోమథన సదస్సును నిర్వహించింది. ఆస్కీ డైరక్టర్ డాక్టర్ బి. జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ వికేంద్రీకృత వ్యర్థాల నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లను వివరించారు. ఐఈసి నిపుణులు జెఎస్‌ఆర్ అన్నమయ్య ప్రజల ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి సమాచార, కమ్యూనికేషన్ వ్యూహాలు అవసరమని తెలిపారు. సిఐఐజిబిసి సంపత్ కుమార్ కబోతు మాట్లాడుతూ సింగపూర్, జపాన్ వంటి దేశాల్లోని అంతర్జాతీయ విధానాలను ప్రస్తావిస్తూ, విద్యార్థులను 'మార్పు దూతలు'గా తీర్చిదిద్దడం ద్వారా దీర్ఘకాలిక ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్టార్టప్‌లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పలు సాంకేతిక అంశాలపై ప్రశ్నలు లేవనెత్తారు. ఈ ప్రశ్నలకు పిఐయు ఎస్‌బిఎం టీమ్ లీడ్ యశశ్రీ కొమ్మారెడ్డి సమగ్ర వివరణ ఇవ్వగా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:** తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కమిటీ రూపొందించిన 2026 క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించడం జరిగింది. హిమాయత్‌నగర్‌లోని తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కమిటీ కార్యాలయంలో కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు బాతరాజు నరసింహ, బీ.కార్తిక్, వినయ్‌కుమార్, బీ.మహేందర్‌నాథ్, శ్రీనివాస్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లె దవాఖానాల్లో పటిష్ఠంగా ఆరోగ్య సేవలు

డిఎంహెచ్ఓ లలితాదేవి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పల్లె దవాఖానాలలో పటిష్ఠంగా ఆరోగ్య సేవలు అందించాలని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె లలితాదేవి అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో వైద్య సేవలు అందిస్తున్న 158 పల్లె దవాఖాన వైద్యులతో డిఎంహెచ్ఓ లతితాదేవి శివరాంపల్లిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లెల్లో మాతా శిశు సంక్షేమం కార్యక్రమాలో అసంక్రమిత వ్యాధులు, క్యాన్సర్ కేర్, వయోవృద్ధుల సేవలు, పన్నెండు వైద్య సేవల కార్యక్రమాలు పల్లె దవాఖానాల పరిధిలోని ప్రజలకు స్థానంలో నాణ్యమైన సేవలు అందించి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంచాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో సిపిసిహెచ్ ట్రేనింగ్‌లో ప్రతిభ సాధించిన వైద్యులకు ప్రశంసా పత్రాలు, నిరంతరం ఆన్‌లైన్‌లో వైద్యసేవలు గ్రామాలలో అందించుటకు గాను నిరంతరం ఇంటర్నెట్ డ్రాంగల్స్, సిమ్ కార్డ్స్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలితాదేవి అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ పాపారావు, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ పాపారావు, పల్లె దవాఖాన ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వినోద్, డెమో కె.శ్రీనివాసులు, డిపిఓ ఆక్రమ్‌తో పాటు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు. సిబ్బంది పాల్గొన్నారు

## మల్లయ్యగౌడ్ మరణం తీరని లోటు

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సీనియన్ నాయకుడు మల్లయ్య గౌడ్ మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య అన్నారు. మంచాల మండలం, జపాల్ గ్రామంలో కడవరకు కమ్యూనిస్టుగా నిలిచిన ఓరుగంటి మల్లయ్య గౌడ్ (80) మృతదేహానికి కమ్యూనిస్టు పార్టీ నాయకులు మంగళవారం ఎర్రజెండా కప్పి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య,సిపిఐ సీనియర్ నాయకులు అల్లిమాదీన్, కావాలి నర్సింహా, అనంత రెడ్డి,మండల కార్యదర్శి బాలయ్య, రాజు నాయక్, శ్రీశైలం,బోల్గం బాలయ్య, సిపిఎం మండల కార్యదర్శి జంగయ్య, నాయకులు పాపిరెడ్డి, పరమేష్, ఓరుగంటి భాస్కర్, యాట ముత్యాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓరుగంటి లింగమయ్యతో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య,అల్లిమాదీన్ మాట్లాడుతూ కామ్రేడ్ మల్లయ్య గౌడ్ గీత పనివారల సంఘంలో చురుకుగా పనిచేశారని, చివరి శ్వాస వరకు కమ్యూనిస్టుగా నిలబడటం ఆయన నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీ విలువలు, ఆదర్శాల కోసం జీవితాంతం పోరాడిన నాయకుడని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## చిన్నారిపై వీధి శునకం దాడి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఏకంగా సుప్రీంకోర్టు హెచ్చరికలు చేసినా వీధి శునకాల నియంత్రణలో బల్దియా వెటర్నరీ వింగ్ నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నది. వీధి శునకాలు చిన్నారులపై దాడి చేసి గాయపరుస్తుంటే.. బల్దియా వెటర్నరీ విభాగం నిద్దుర మత్తును వీడటం లేదు. తాజాగా ఖైరతాబాద్ పరిధిలోకి వచ్చే శ్రీనివాసనగర్‌లో వీధి శునకం నాలుగేళ్ల చిన్నారిని తీవ్రంగా గాయపరచడంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. మంగళవారం శ్రీనివాస్‌నగర్‌లో నివాసముండే మల్లికార్జున్, రేవతి దంపతుల నాలుగేండ్ల కుమార్తె ఇంటి ముందు ఆడుకుంటోంది. అంతలోనే ఓ వీధి శునకం అటుగా వచ్చి పాపపై దాడిచేసింది. దీంతో పాప ముఖంపై శునకం గాట్లు పడ్డాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో చికిత్స నిమిత్తం బంజారాహిల్స్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం లేకున్నా శస్త్ర చికిత్స నిర్వహించాలని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. ఇటీవల వారానికి ఒకటి ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా... వెటర్నరీ వింగ్ అధికారులు చర్యలు చేపట్టలేకపోతున్నారు. చిత్తశుద్ధితో నియంత్రణ చర్యలు చేపట్టలేకపోవడంతోనే వీధి శునకాలు పెరిగిపోతున్నాయని... తద్వారా అమాయక ప్రజలు శునకాల బారినపడి ప్రాణాలు కోల్పోవాల్సిన దుస్థితి నెలకొందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

## విద్యా ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యం



**ప్రజాపక్షం/అబ్దుల్లా పూర్ మెట్టు:** గ్రామంలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యమని బండరావిరాల గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతీ పాలకవర్గం గుండోజి రంగదాసు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలో ఉచిత ట్యూషన్ పాయింట్లను ప్రారంభించారు. 3వ వార్డు సభ్యులు కన్నె భరత్ యాదవ్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని తన సొంత వార్డులో ఒక ట్యూషన్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దూస శంకర్ ముదిరాజ్, గ్రామ వార్డు సభ్యులు కన్నె భరత్ యాదవ్, యేదవల్లి సుస్మిత రమేష్, ఏప్పుల హరికృష్ణ, కందికంటి అనూష ప్రవీణ్, గుండ్ల భవాని శివ ముదిరాజ్, గుండోజి రంగదాసు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధులు కోదాస్ శంకరయ్య, కందికంటి కృష్ణ, ఎండీ నూర్ మొహ్మద్, గుండ్ల సతీష్, పాల్గొన్నారు.

## వలసల నివారణకు లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్

పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ రఘువాచారి వెల్లడి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించాంటే లక్ష్మీ దేవిపల్లి ప్రాజెక్టును నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ రఘువాచారి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని చెగిరెడ్డి ఘణపూర్ ఉమ్మడి గ్రామ పంచాయతీ పరిధిలోని వేపకుచ్చతండా, చింతకుంట తండాల్లో పర్యటించి ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా కన్వీనర్ రాఘవాచారి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వర్షాధార పంటల సాగుపైనే ఆధారపడి ప్రజలు జీవిస్తున్నారని, సాగునీరు, తాగునీరు సక్రమంగా లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని వివరించారు. ఎత్తైన ప్రాంతమైన లక్ష్మీ దేవిపల్లి వద్ద రిజర్వాయర్‌ను నిర్మిస్తే మూడు జిల్లాల రైతులకు సాగునీరు, తాగునీరు అంధించిన వాళ్ళం అవుతామని వివరించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు నుండే లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ కోసం పోరాటాలు చేస్తున్నామని, ప్రభుత్వాలు ఎన్నికల హామీగానే లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్‌ను తీసుకుంటున్నాయే తప్పా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. వ్యవసాయ పోలాలు బీడు భూములుగా మారుతున్నాయని, ఉపాధి అవకాశాలు లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్ళాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకొక్క తండా నుండి సుమారుగా 50నుండి 60కుటుంబాలు జీవనోపాధి కోసం ముంబాయి, పుణే, బెంగళూరు వంటి ప్రధాన నగరాలకు వలసలు వెళ్ళి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారన్నారు. లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తామని ఈ ప్రాంత రైతులను, ప్రజలకు నాయకులు తీవ్రంగా మోసం చేశారని మండిపడ్డారు. రియల్ ఏస్టేట్ వ్యాపారం ఎక్కడ అగిపోతుందోననే భయంతోనే ఈ రిజర్వాయర్ నిర్మాణంపై దృష్టి కేంద్రీకరించడం లేదని వాపోయారు. లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మించకుంటే భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు టిజి శ్రీనివాస్, అర్జునప్ప, తిరుమలయ్య, రవీంధ్రనాథ్, నర్సింలు, రామచందర్, ఎఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఆకాష్‌లు పాల్గొన్నారు.

# విహాన్ శతక గర్జన..

## రెండొందల తేడాతో గెలిచిన టీమిండియా!



అండర్ 19 ప్రపంచకప్‌లో భారత జట్టు అజేయంగా దూసుకెళ్తోంది. హ్యాట్రిక్ విజయాలతో సూపర్ సిక్స్ చేరిన టీమిండియా ఆల్‌రౌండ్ షోతో జింబాబ్వేపై భారీ తేడాతో గెలుపొందింది. విహాన్ మల్హోత్రా (109), అభిగ్యాన్ కుందు(61)ల విధ్వంసంతో ప్రత్యర్థికి కొండంత లక్ష్యాన్ని నిర్దేశించిన భారత్‌కు బౌలర్లు పరుగుల విజయాన్ని కట్టబెట్టారు. ఆయుష్ మాత్రే(314), ఉద్ధవ్ మో హన్(3–25) తలా మూడేసీ వికెట్లతో జింబాబ్వే నడ్డి విరిచారు. దాంతో.. 204 రన్స్ తేడాతో గెలుపొందింది మాత్రే సేన.

పురుషుల అండర్ 19 ప్రపంచకప్‌లో భారత జట్టు జోరు కొనసాగుతోంది. లీగ్ దశలో పంజా విసిరిన టీమిండియా సూపర్ సిక్స్‌లోనూ అదిరే విజయంతో ప్రత్యర్థులకు హెచ్చరికలు పంపింది. బులవాయలోని స్పోర్ట్స్ క్లబ్‌లో జింబాబ్వేను చిత్తగా ఓడించింది భారత్. విహాన్ మల్హోత్రా(109), అభిగ్యాన్ కుందు(61), వైభవ్ సూర్యవంశీ()ల మెరుపులతో 353 రన్స్ కొట్టిన టీమిండియా.. ప్రత్యర్థిని 148కే ఆలౌట్ చేసింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే (3–14), ఉద్ధవ్ మోహన్ (3–25) వికెట్ల వేటతో జింబాబ్వేను పడగొట్టారు. వీరిద్దరి విజృంభణతో ప్రధాన బ్యాటర్లు చేతులెత్తేయగా.. లిరోయ్ చివౌలా(62) హాఫ్ సెంచరీతో రాణించాడు.

**విహాన్ సూపర్ సెంచరీ..**

జింబాబ్వే బౌలర్లకు మూడు చెరువుల నీళ్లు తాగిస్తూ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(52) హడలెత్తించగా.. విహాన్ మల్హోత్రా(109) సూపర్ సెంచరీతో చెలరేగాడు. నాలుగేసి సిక్సర్లు, ఫోర్లతో 30 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాదిన వైభవ్‌ను చిముగొరే బోల్తా కొట్టించాడు. వైభవ్ ఔటయ్యాక.. విహాన్, అభిగ్యాన్ కుందు(61)లు క్రీజులో పాతుకుపోయారు. వీరిద్దరూ ఆడుతూ పాడుతూ స్కోర్‌బోర్డును ఉరికించారు.

ఐదో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యంతో భారీ స్కోర్‌కు పునాది వేసిన అభిగ్యాన్‌ను మడ్జెన్‌గెరెరీ పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత టెయిలెండర్లు అంబ్రిష్(21), హెనిల్ పటేల్(30)లతో కలిసి జట్టు స్కోర్ 300 దాటించిన విహాన్.. 49వ ఓవర్లో బౌండరీలో సెంచరీ సాధించాడు. దాంతో.. ప్రత్యర్థికి 353 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది ఆయుష్ మాత్రే సేన.

## బంగ్లాదేశ్ జర్నలిస్టుల్లకు అక్రిడిటేషన్స్ తిరస్కరణ

పంతానికి పోయి టి–20 వరల్డ్‌కప్ అవకాశాన్ని చేజార్చుకున్న బంగ్లాదేశ్‌కు ఐసిసి మరో షాకిచ్చింది. ప్రపంచకప్ మ్యాచ్‌లో కవరేజీ కోసం దరఖాస్తు చేసుకున్న ఆ దేశానికి చెందిన క్రీడా జర్నలిస్టులకు అనుమతి నిరాకరించింది. దాదాపు వందకుపైగా అప్లికేషన్లను అంతర్జాతీయ క్రికెట్ మండలి తిరస్కరించింది దాంతో.. తమ బోర్డు చేసిన తప్పిదానికి మమల్ని శిక్షించవద్దని వారు వేడుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో మీడియా అక్రిడిటేషన్స్ జారీని మరోసారి పరిశీలిస్తామని ఐసిసి వెల్లడించింది. భారత్‌లో ప్రపంచకప్ కోసం తమ జట్టును పంపబోమని బెట్టుచేసిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. భద్రతా కారణాలను సాకుగా చూపి మేము ఆడమంటే ఆడమని పంతం పట్టినందుకు బంగ్లాదేశ్‌ను తప్పించిన స్కాంట్లాండ్‌కు అవకాశమిచ్చింది ఐసిసి. ఇప్పుడు ప్రపంచకప్‌కవరేజీ కోసం దరఖాస్తు చేసుకున్న క్రీడా జర్నలిస్టులకు అనుమితివ్వలేదు. ఈ విషయంపై బంగ్లా బోర్డు మీడియా అధ్యక్షుడు హంజద్ హూసేన్ తిరస్కరణకు కారణాలు తెలపాలని ఐసిసిని కోరాడు. 'మా దేశ క్రీడా జర్నలిస్టు దరఖాస్తులను తిరస్కరించారనే విషయం సోమవారం తెలిసింది. అందుకు కారణం తెలపాలని ఐసిసిని కోరాం. ఇది అంతర్గత వ్యవహారం. అయితే.. ఐసిసి ఎందుకు మావాళ్లకు అనుమతి ఇవ్వలేదో తెలుసుకోవాలనుకుంటున్నాం' అని ఆయన పేర్కొన్నాడు.

## వీడ్కోలు నిర్ణయాన్ని వాయిదా వేయను!



వ్యక్తిగత రికార్డులు, మైలురాళ్ల కంటే జట్టు కోసం ఏ త్యాగానికైనా సిద్ధపడేవారు చాలా అరుదు. అలాంటి అరుదైన క్రికెటరే కేఎల్ రాహుల్. ఫార్మాట్ ఏదైనా టీమిండియా ఆపద్బాంధవుడి పాత్రలో ఒదిగిపోతున్న రాహుల్ వీడ్కోలుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టీమిండియాలో కీలక ఆటగాడిగా ఎదిగిన రాహుల్ రిటైర్మెంట్ గురించి పెద్దగా ఆలోచించనని, క్రికెట్ ఒక్కటే జీవితం కాదని అన్నాడు. ఇంగ్లండ్ మాజీకెప్టెన్ కెవిన్ పీటర్సన్తో యూట్యూబ్ ఛానెల్లో మాట్లాడుతూ.. వీడ్కోలు పలకాలనే ఆలోచన తనకు వచ్చిందని.. అయితే.. అందుకు ఇంకాస్త సమయం ఉందని ఈ సొగసరి బ్యాటర్ వెల్లడించాడు. బ్యాటింగ్ ఆర్డర్ మారడం నా వల్ల కాదు.. కెప్టెన్సీ కాకుండా వైస్ కెప్టెన్సీ ఇస్తారా? వంటి ఫిర్యాదులకు ఆమడదూరంలో ఉండే రాహుల్ తన లో మరొకొన్ని రోజులు క్రికెట్ ఆడే సత్తా ఉందంటున్నాడు. యూట్యూబ్ ఛానెల్లో మాట్లాడిన అతడు.. 'ఒకానొక సమయంలో వీడ్కోలు గురించి ఆలోచించాను. నా దృష్టిలో రిటైరవ్వడం కష్టమైనదేమీ కాదు. మనపట్ల మనం నిజాయతీగా ఉన్నప్పుడు.. సరైన సమయం వచ్చినప్పుడు వీడ్కోలు నిర్ణయాన్ని రోజుల తరబడి వాయిదా వేయడంలో అర్థముండదు. ప్రస్తుతానికైతే నేను అల్విదా చెప్పడానికి ఇంకా కొంచెం సమయం ఉంది. రిటైర్మెంట్ ప్రకటించాక.. కుటుంబంతో నచ్చినట్టుగా జీవితాన్ని గడిపేందుకు ప్రాధాన్యమిస్తాను. ఒక క్రికెటర్ అలా ఉండడం కాస్త కష్టమే. కానీ, నేను అంత ముఖ్యమైన ఆటగాడిని కాదని నా ఉద్దేశం. ఎవరు వీడ్కోలు పలికినా సరే మనదేశంలో క్రికెట్ కొనసాగుతూనే ఉంటుంది. అందుకే చెబుతున్నా.. జీవితంలో చాలా ముఖ్యమైన విషయాలు చాలా ఉంటాయి. నేను ఈమధ్యే తండ్రినయ్యాను. పాప పుట్టాక నేను జీవితాన్ని చూసే దృక్కోణం ఎంతో మారింది' అని పేర్కొన్నాడు. అనుభవజ్ఞుడైన రాహుల్ కెప్టెన్గా జట్టును నడిపించాల్సింది. కానీ, గాయాల కారణంగా అతడు పలుమార్లు జట్టుకు దూరమయ్యాడు. ఇదేఅంశంపై స్పందించిన రాహుల్.. 'గతంలో నేను చాలా సార్లు గాయపడ్డాను. స్పోర్ట్స్ హెర్నియా కారణంగా ఆస్పత్రి పాలయ్యాను. గాయాలతో పోరాడి.. కోలుకొని తిరిగి జట్టులోకి వచ్చేందుకు ఎంతో కష్టపడ్డాను. ఆరోజులు నిజంగా ఎంతో కష్టంగా గడిచాయి. మానసికంగా కొన్నిసార్లు కుంగిపోయేవాడిని. అలాంటప్పుడు ఇక చాలు. క్రికెట్ లేకుండా కూడా నువ్వు బతకగలవు అని మన మనసు చెబుతుంది' అని వెల్లడించాడు.

## మహిళ

# బాధితులకు న్యాయం ఎక్కడ?



దేశంలో మహిళల భద్రత గతంలో ఎన్నడూ లేనంతగా పడిపోతున్నది. ధరించే దుస్తుల నుంచి ఎంచుకునే మార్గం వరకూ అన్నిటా నిర్బంధాలే. మణిపూర్‌లో అత్యాచార బాధితురాలి మృతి ఈ దారుణ సత్యాన్ని మరోసారి గుర్తు చేస్తున్నది. ఆ విషాదానికి తాజా, అత్యంత హృదయవిదారక ఉదాహరణ, మూడేళ్ల క్రితం గ్యాంగ్ రేప్‌నకు గురై, న్యాయం కోసం ఎదురు చూస్తూనే ప్రాణాలు విడిచిన ఒక యువ కుకీజో మహిళ. 2023 మే నెలలో మణిపూర్‌లో మొదలైన మైతేయి–కుకీ సంఘర్షణలు కేవలం జాతుల మధ్య ఘర్షణలు మాత్రమే కాదు. అవి రాజ్యవ్యవస్థల వైఫల్యాన్ని, చట్టపరమైన రక్షణ ఎంత సులభంగా కూలిపోతుందో, మహిళ శరీరం ఎలా యుద్ధభూమిగా మారుతుందో బట్టబయలు చేశాయి. ఆ కల్లోలంలో, అప్పుడే 18 ఏళ్లు నిండిన ఒక యువతి అపహరణకు గురైంది, దారుణంగా లైంగిక హింసకు లోనైంది, ఆ తర్వాత మూడేళ్ల పాటు శారీరక–మానసిక నరకాన్ని అనుభవించింది. చివరకు ఈనెల 10న గౌహతిలో చికిత్స పొందుతూ మరణించింది. ఆమెకు న్యాయం లభించలేదు. ఇంఫాల్‌లో ఒక ఎటిఎం దగ్గర డబ్బు తీసుకునేందుకు వెళ్లిన ఆ యువతిని నలుగురు ఆయుధాలతో ఉన్న వ్యక్తులు బొలెరో వాహనంలో ఎత్తుకెళ్లారు. నల్ల షర్టు ధరించిన వారు, ఆ కాలంలో చురుగ్గా ఉన్న మైతేయి మిలిటెంట్ గ్రూప్ అరంబై టెంగ్గోల్‌కు సంబంధించినవారిగా ఆరోపణలు ఉన్నాయి. బాధితురాలి ఎఫ్ఐఆర్ లోని ఆరోపణలు ఆందోళన కలిగించేవి కూడా. మైతేయి మహిళా విజిలాంటీ గ్రూప్‌గా పేరున్న మైరా పైబీ సభ్యులే తనను వారికి అప్పగించారని ఆమె పేర్కొన్నారు. ఇది కుకీ సంస్థలు పదేపదే లేవనెత్తిన ఆరోపణ. ఆమెను లాంగోల్, బిష్ణుపూర్ వంటి ప్రాంతాలకు తీసుకెళ్లి, రాత్రంతా చిత్రహింసలు పెట్టి, పలుమార్లు అత్యాచారం చేశారు. కళ్లకు గంతలు కట్టి, ఆహారం–నీరు లేకుండా ఉంచి, చివరకు కొండపై వదిలేశారు. 'వాళ్లు చేయగలిగిన ప్రతి అమానుషం నాపై చేశారు' అని ఆమె 2023 జులైలో ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పిన మాటలు ఈరోజు కూడా మన మనసును గుచ్చుతాయి. అత్యంత తీవ్ర గాయాలైనప్పటికీ ఆ యువతి కాలకృత్యాలకు వెళ్తున్నానని చెప్పి పారిపోయి కూరగాయల లోడుతో ఉన్న ఆటోలో దాక్కొని ప్రాణాలు దక్కించుకుంది. ఆమె బయటపడిన విధానం ధైర్యానికి ప్రతీకగా కనిపించినా, నిజానికి అది ఒక వ్యవస్థ చేతిలో నలిగిపోయిన యువతి చివరిప్రయత్నం. కాగా, ఆ రోజుల్లో మణిపూర్‌లో పోలీస్ వ్యవస్థ దాదాపు కూలిపోయింది. భయం, అల్లర్లు, రోడ్డు బ్లాకులు .. ఈ పరిస్థితుల్లో బాధితురాలు రెండు నెలల తర్వాతే, 2023 జులై 21న ఫిర్యాదు చేయగలిగింది. కాంగ్‌పోక్పి పోలీస్‌స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు అయి, ఆ తర్వాత సిబిఐకి బదిలీ అయింది. గౌహతిలో ప్రత్యేక సిబిఐ కోర్టులో కేసు నడుస్తున్నట్టు అధికారిక సమాచారం ఉంది. కానీ మూడేళ్లకు దగ్గరగా గడిచినా, ఒక్క అరెస్టు కూడా జరగలేదు. ఛార్జిషీటు లేదు. బాధితురాలి కుటుంబానికి సరైన సమాచారం లేదు. ఇది కేవలం ఆలస్యం మాత్రమే కాదు.. అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి పరాకాష్ట. ఇది, బాధితులకు న్యాయం దక్కడంలో ఏర్పడుతున్న ఒక పెద్ద శూన్యత. ఆమె శరీర గాయాలు మానలేదు. గర్భాశయ సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులు, తరచూ ఆసుపత్రి పాలవడం.. ఇవన్నీ ఆమె రోజువారీ జీవితంలో భాగమయ్యాయి. కానీ వాటి కన్నా తీవ్రంగా ఆమెను చంపింది మానసిక వేదన. 'ఇంతకు ముందు నా కూతురు ఎప్పుడూ నవ్వుతూ ఉండేది. ఆ సంఘటన తర్వాత ఆమె నవ్వు మాయమైంది. ఎక్కువగా మాట్లాడేది కాదు. ఇంట్లోనే ఉండేది. బైబిల్ చదివేది, టివి చూస్తూ కూర్చునేది' అంటూ ఆమె తల్లి చెప్పిన మాటలు మనల్ని కుదిపేస్తాయి. నిజానికి ఇది ఒక వ్యక్తిగత దుఃఖకథ కాదు. లైంగిక హింసకు గురైన వేలాది మహిళల ప్రతిబింబం. న్యాయం ఆలస్యం కావడం అనేది వారి మనసుపై పదేపదే అత్యాచారం చేసినట్టే.

న్యాయం ఆలస్యం కావడం వల్ల ఆ యువతి తన గౌరవాన్నే కాదు, చివరకు ప్రాణాన్నే కోల్పోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మణిపూర్ హింసలో 260మందికిపైగా మరణించారు, 60 వేలమందికి పైగా నిర్వాసితులయ్యారు. రాష్ట్రం రాష్ట్రపతి పాలనలోకి వెళ్లినా, బాధితులకు న్యాయం దూరంగానే ఉంది. యుద్ధ ప్రాంతాల్లో మహిళల భద్రతను మన దేశం ఎంత గంభీరంగా తీసుకుంటోంది? అనే ప్రశ్న ఈ యువతి మరణం మన ముందుకు తెస్తున్నది. ఆమె 'మణిపూర్ కుమార్తె మాత్రమే కాదు, భారతదేశ కుమార్తె' అన్న మాటలు నిజం. ముగింపు లేకుండా ముగిసిన ఆమె జీవితం.. మన న్యాయవ్యవస్థపై మాయని మచ్చ. బాధితురాలి మరణం సమాజానికి చేస్తున్న ఒక హెచ్చరిక. న్యాయం ఆలస్యం అయితే, అది న్యాయం కాకుండా మరో హింసగా మారుతుందని గుర్తుచేసే విషాద వాస్తవం. మనం మౌనంగా ఉంటే, తదుపరి బాధితురాలు ఎవరో?

## ఒక కప్పు కాఫీతో ప్రపంచం మారింది

అది 1908 సంవత్సరం. జర్మనీలోని డ్రెజ్డెన్ నగరం. మెలిట్టా బెంజ్ అనే ఓ సాధారణ గృహిణి మరోసారి రుచీలేని కాఫీ కప్పును చూస్తూ చిరాకుపడిపోయింది. నీళ్ల మాదిరి ఉండే అలాంటి కాఫీ అంతగా రుచించేది కాదు. కానీ అది అప్పటి కాఫీ. గరుకుగా, చేదుగా, మట్టితో నిండినట్టు ఉండేది. 'సిసలైన కాఫీ ఇదే' అనుకుంటూ ప్రపంచమంతా అదే తాగేది. కానీ మెలిట్టా అలా ఒప్పుకోలేదు. కాఫీని ఇంతకంటే బాగా చేయలేమా? అని ఆమె తనను తానే ప్రశ్నించుకుంది. ఏదో ఒకటి చేయాలి... కాఫీరంగును.. రుచిని మార్చాలి. కానీ, ఎలా? అదే ఒక పెద్ద ప్రశ్న. సమాధానం కోసం మెలిట్టా నిరంతరం ఆలోచిస్తునే ఉండేది. ఒకరోజు యాదాలాపంగా చూస్తున్న ఆమె కళ్లు తన కుమారుడి నోటుబుక్‌లోని బ్లోటింగ్ పేపర్‌పై పడ్డాయి. వెంటనే ఫ్లాష్ లాంటి ఆలోచన. ఆ బ్లాటింగ్ పేపర్‌ను తీసుకుంది. ఒక రంధ్రాలున్న పాత్రపై ఆ కాగితాన్ని ఉంచింది. దానిపై కాఫీ పొడి వేసి, పై నుంచి వేడి నీరు పోసింది. బ్లాటింగ్ పేపర్ నుంచి, మెల్లిగా కింద జార్‌లోకి కాఫీ పడింది. బహుశా అదే నిజంగా తాగగలిగిన తొలి నిజమైన కాఫీ కావచ్చు. ఆ కాఫీ ఎంతో మృదువు గా. శుభ్రంగా. చేదు లేకుండా ఉండడాన్ని గమనించిన మెలిట్టాకు తాను కేవలం కాఫీ కాదు... ఒక అలవాటునే మార్చానని అర్థమైంది. ఆమె ఆ ఆలోచనను దాచుకోలేదు. పేటెంట్ తీసుకుంది. ఇంటి నుంచే చిన్న కంపెనీ ప్రారంభించింది. తానే తయారు చేసి, తానే కాఫీ ఫిల్టర్ తయారు చేసి అమ్మింది. మొదట ప్రజలు నవ్వారు. ఆ తర్వాత అందరూ మారిపోయారు. ఒక మహిళ రుచిగా లేని కాఫీతో రాజీ పడకపోవడమే కాఫీ ప్రపంచాన్ని పూర్తిగా మార్చేసిన వైనాన్ని స్మరించుకోవాలి.



## కార్మికుల హక్కులు హరిస్తున్న కేంద్రం



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి యండి ఇమ్రాన్, సిఐటియు జాతీయ కౌన్సిల్ సభ్యులు కల్లూరి మల్లేశం, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచకొండ జనార్ధన్‌లు కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం భువనగిరిలో జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ యాదాద్రి భువనగిరి జిల్లా సమావేశం సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి అధ్యక్షతన దుంపల మల్లారెడ్డి ట్రస్ట్ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు ఎండి ఇమ్రాన్, కల్లూరి మల్లేశం, ఆర్.జనార్ధన్‌లు మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ 29 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చారని తెలిపారు. జిల్లాలో సమ్మె విజయవంతం కోసం ఫిబ్రవరి 3న కార్మిక సంఘాల జిల్లా సదస్సును నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సులో సిఐటియు, ఏఐటిసియు, ఐయన్‌టియూసీ, ఐఎఫ్టియు, బిఅర్‌టియు, హెచ్‌ఎంఎస్, ఇతర అన్ని కార్మిక సంఘాల మండల, జిల్లా నాయకత్వం పాల్గొని సదస్సు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దాసరి పాండు, మాయ కృష్ణ, ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి శోభన్ బాబు, ప్రజాసంఘాల నాయకులు దయ్యాల నరసింహ, వనం రాజు తదితరులు పాల్గొన్నారు.

## మాధవరెడ్డి జ్ఞాపకార్థం భారీ స్థూపం

### సిపిఐ సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రొండ్ల మాధవరెడ్డి జ్ఞాపకార్థం ఆయన స్వగ్రామం రేపాకలో భారీ స్థూపం నిర్మాణం చేయాలని పార్టీ నిర్ణయించిందని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అన్నారు. మంగళవారం ఇల్లంతకుంట మండలం రేపాకలో రొండ్ల మాధవరెడ్డి స్తూపం నిర్మాణం కోసం స్థలం పరిశీలించి, కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో 1947 మార్చి 14 న హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్ గుట్టల్లో అమరులైన 12 మందిలో 6 గురు మన ఇల్లంతకుంట మండల వాసులే కావడం అందులో రొండ్ల మాధవరెడ్డి ఉండడం గర్వకారణం అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 14 ఏండ్ల మైనర్ బాలుడు అశ్వమిత్ గౌతమ్ కు, 90 శాతం వికలాంగుడైన జి. యన్. సాయి బాబాలాంటి వికలాంగులకు, అమరవీరుల శవాలకు, స్తూపాలకు ఎందుకు భయపడుతోందో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ప్రశ్నించడమే నేరంగా పరిగణిస్తూ ప్రజలపై దారుణ మారణ కాండను కొనసాగిస్తున్న పాలకులు ఎంతో కాలం మనుగడ సాదించలేరని ఇలాంటి నియంతలు కాలగర్భంలో కలిసిపోకతప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఇల్లంతకుంట మండల కార్యదర్శి తీపిరెడ్డి తిరుపతి రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కదారి రాములు, మంద అనిల్, వండాపెల్లి లక్ష్మణ్, దళిత హక్కుల పోరాట సమితి నాయకురాలు పవిత్ర, రాజశేఖర్ రాజు, నరేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే

### కార్మిక సంఘాల డిమాండ్




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ఆల్ ట్రేడ్ యూనియన్లు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాకేంద్రంలో జిల్లాస్థాయి సదస్సు జరిగింది. సదస్సుకు ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ కార్మికులకు ఉరికోయలుగా మారిన లేబర్‌కోడ్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని ఫిబ్రవరి 12న జరిగే సమ్మె విజయవంతం చేయాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఏ.రాములు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కృష్ణ యాదవ్, జిల్లా కార్యదర్శి పి.సురేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, ఐఎన్టియుసి జిల్లా కార్యదర్శి ఎం.రామ్మోహన్ ,టీఎన్టియుసి జిల్లా నాయకులు ధన్వాడ రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడియాల మోహన్, టియుసిఐ జిల్లా అధ్యక్షులు దేవదానం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక ప్రజా వ్యతిరేక లేబర్ కోడ్‌లు, విద్యుత్ సవరణ చట్టం, విభిజి రాంజీ ఉపాధి హామీ చట్టాన్ని విత్తన సవరణ బిల్లును తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమ్మె చేసే హక్కును లేబర్ కోడ్‌లు హరిస్తున్నాయని దీనికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 12 జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను సకల కార్మికులు రైతు వ్యవసాయ కూలీలు ప్రజలు ప్రజాతంత్ర వాదులు అభ్యుదయవాదులు విజయవంతం చేయాలని చేయడానికి కంకణబద్దులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి కార్యదర్శి సురేష్, అధ్యక్షులు కృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు దిప్లా నాయక్, బికే యం యు జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి , టియుసిఐ జిల్లా అధ్యక్షులు జిల్లా కార్యదర్శి సాంబశివుడు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.లక్ష్మయ్య, బాలు వెంకటన్న, చంద్రకాంత్, రాజ్ కుమార్, వి.కురుమూర్తి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ వినతి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** మిషన్ భగీరథ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనం 26,000 రూపాయలు చెల్లించాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలతో పాటు ఒక నెల జీతం బోనస్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పది లక్షల రూపాయల ఇన్సూరెన్స్ కల్పించాలని, ఇతర సమస్యలను పరిష్కరించకుంటే ఫిబ్రవరి 10వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు చిరంజీవి, యూనియన్ జిల్లా అధ్యక్షులు బాలేష్, ప్రధాన కార్యదర్శి షకీర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంషద్, ఉపాధ్యక్షుడు పర్వేజ్, కోశాధికారి అంజి తదితరులు పాల్గొన్నారు.



# రిజర్వాయర్ల నీటిని రైతులకోసం విడుదల చేయాలి

### సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్


**ప్రజాపక్షం/గజ్వేల్ :** సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా భూగర్భజలాలు అడుగంటి పోవడంతో బావులలో నీళ్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతారని, వీటిని దృష్టిలో పెట్టుకొని మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ నుండి నీటిని పంట పొలాలకు అందించాలని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్ పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని, జిల్లాలో బలమున్న చోట సిపిఐ పార్టీ అభ్యర్థులను బరిలో దిగుతున్నట్లు సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు జిల్లాలో వంద ఏండ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అభ్యర్థులను మున్సిపల్ ఎన్నికల్లో బరిలో ఉంటారని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే, ప్రశ్నించే గొంతుకలైన సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజలలో నిరంతరం తిరుగుతూ, ప్రజల సమస్యలను తీర్చడమే లక్ష్యంగా సిపిఐ పనిచేస్తుందని స్పష్టం చేశారు. అదేవిధంగా రోజుకు రోజుకు పట్టణ ప్రాంతాల్లో బిజెపి బలపడడానికి విశ్వప్రయత్నాలు చేస్తుండగా, మతతత్వ శక్తులను ఓడగొట్టాలంటే కాంగ్రెస్, సిపిఐ పార్టీలు ఎన్నికల్లో కలిసి పనిచేస్తామని చెప్పారు. జిల్లాలోని మున్సిపాలిటీల అభివృద్ధికి సిపిఐగా నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు బట్టు దయానంద రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం పోరాడే కమ్యూనిస్టులను ఆదరించాలని, రాబోయే మునిసిపల్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు బట్టు దయానంద రెడ్డి, సిపిఐ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి శివలింగ కృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్గం రాజేశం, మండల సహాయ కార్యదర్శి కొండకింది పోచయ్య, నాయకులు కొండి రాజం, చింత శీను, రామచంద్రం, స్వర్గం రాములు, కొండి రాజ్యం, పోతుల శంకరయ్య, రుద్రారం బిక్షపతి, శివలింగ నారాయణ, రుద్రారం కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



# సిపిఐలో భారీ చేరికలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పొరేషన్‌పై సిపిఐ పట్టు సాధిస్తోంది. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చొరవతో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ శ్రేణులు అందిస్తున్న సేవలు పార్టీ మరింత బాలోపేతం కావవడానికి దోహదపడుతోంది. మంగళవారం జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కార్పొరేషన్ పరిధిలోని 50,43 డివిజన్లకు చెందిన 110 కుటుంబాలు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా సమక్ష్యంలో పార్టీలో చేరాయి. కొత్తగూడెం పట్టణ పరిధిలోని రామాటాకీస్ ఏరియాలో 50వ డివిజన్‌కు చెందిన యెర్ర రాజు, తండూరి అరుణ్, కోసరబోయిన రమేష్, అజయ్, సలీం, శ్రీను, చంటి నేతృత్వంలో 60 కుటుంబాలు, 43వ డివిజన్‌కు చెందిన వెంకటేష్, అవినాష్, ప్రశాంత్, మురళీకృష్ణ, నాగమణి, వెంకటేశ్వర్లు నేతృత్వంలో 50 కుటుంబాలు సిపిఐలో చేరాయి. వీరికి సాబీర్ పాషా కండువాలు కప్పి పార్టీలోకి అహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో 60 డివిజన్ల నుండి ప్రజాదరణ ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసి పోటీకి సిద్ధం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గరాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్‌కే ఫహీమ్, పిడుగు శ్రీనివాస్, యాంద్ర మహేష్, బోయిన విజయ్ కుమార్, దాసరి శ్రీనివాస్, నరేందర్, రాకేష్ పాల్గొన్నారు.





## వెల్‌నెస్ సెంటర్ సేవలకు గుర్తింపు

ప్రజాపక్షం / జడ్చర్ల : మహబూబ్ నగర్ జిల్లాలోని ఇఇహెచ్ఎస్ వెల్ నెస్ సెంటర్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నిరంతర వైద్య సేవలు అందుతున్న నేపథ్యంలో, ఈ కేంద్రంలో ఇఇహెచ్ఎస్ ఆఫీస్ అసిస్టెంట్‌గా గత తొమ్మిది సంవత్సరాలుగా అంకితభావంతో సేవలు అందిస్తున్న శబానా బేగంను ఆమె విశిష్ట సేవలకు గాను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా సన్మానించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీర చేతుల మీదుగా ఆమెకు ఉత్తమ సేవా అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు సామాజిక సంస్థల ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమె సేవలను ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు. జడ్చర్ల శాసన సభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి శబానా బేగంను శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ మిన్హాజుద్దీన్, బాదేపల్లి సింగిల్ విండో చైర్మన్ సుదర్శన్ గౌడ్, సయ్యద్ ఇక్బాల్, సర్వరాజ్ అహ్మద్ అద్న కేల్, ఖ్వాజా పాషా, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజేందర్ రెడ్డి



ప్రజాపక్షం/మహబూబ్ నగర్ : మహబూబ్ నగర్ జిల్లా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై నియమితులైన ఇన్స్పెక్టర్ కె. రాజేందర్ రెడ్డి మంగళవారం మహబూబ్ నగర్ జిల్లాకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు స్వీకరించే క్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి. జానకి,ఐపిఎస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. 2009 బ్యాచ్ కు చెందిన ఇన్స్పెక్టర్ కె. రాజేందర్ రెడ్డి నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట్ మండలం స్వస్థలవాసి ఇంతకుముందు వికారాబాద్ జిల్లా తాండూరు ఇన్స్పెక్టర్‌గా, నారాయణపేట జిల్లా మరికల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా, గద్వాల్ జిల్లా తదితర పోలీస్ స్టేషన్లలో సమర్థవంతంగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ట్రాఫిక్ నిర్వహణ మరింత సమర్థవంతంగా చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ పోలీస్ శాఖ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇంతకుముందు మహబూబ్ నగర్ జిల్లా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహించిన భగవంత్ రెడ్డి నారాయణపేట జిల్లా మరికల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బదిలీ కావడంతో, వారి స్థానంలో కె. రాజేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించడం జరిగింది.



## హెల్త్ కార్డులు పంపిణీ చేసిన యెన్నం

ప్రజాపక్షం/మహబూబ్ నగర్ : ఐఎంఎ సౌజన్యంతో ఎమ్మెల్యే యెన్నం హెల్త్ కార్డులను మహబూబ్ నగర్ పట్టణంలోని అల్మాస్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా ఐఎంఎ ప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ అధ్యక్షుడు డాక్టర్ జి.రాంమోహన్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/ మక్తల్ : మక్తల్ వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో అంధ్యాల ప్రమోద్ కుమార్ గుప్తా జ్ఞాపకార్థం ఆయన తండ్రి అంధ్యాల జనార్ధన్ గుప్త సహకారంతో 9వ వార్డు బసవేశ్వర కాలనీ నందు నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ప్రజల దాహం తీర్చ డానికి వాసవి క్లబ్ సభ్యులు ముందుకు వచ్చి దాతల సహకారంతో కాలనీలో నూతన వాటర్ ట్యాంక్ నిర్మించడానికి ఒప్పుకున్నందున కాలనీవాసులు వాసవి క్లబ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కట్టా సురేష్, అంధ్యాల జనార్దన్, వాసవి క్లబ్ అధ్యక్షులు మేడిశెట్టి హరికృష్ణ, కోశాధికారి తాలంపల్లి పవన్, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు కల్లల ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

ప్రజాపక్షం/ అడ్డాకుల : మండలం కన్మనూర్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో రమేష్ సాగర్ ఆధ్వర్యంలో తెలంగాణ సగర యువజన సంఘం అధ్యక్షులు మర్మ సురేష్ సాగర్ నవీన దంపతులు 98 బ్యాగులు, 15 ప్యాడ్లను పాఠశాలకు వితరణ చేశారు. ఎంఈఓ ప్రకాష్, రమేష్ సగర చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శివ సగర, ఉపాధ్యాయ బృందం సూర్య ప్రకాష్, నాగ మద్దిలేటి, మంగమ్మ, శోభా రాణి, అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.



## స్మశాన వాటికలో ముళ్ల పొదలు తొలగింపు

ప్రజాపక్షం/ ఉట్కూర్ : ఉట్కూర్ మండలం కొత్తపల్లి గ్రామంలోని స్మశాన వాటికలో మంగళవారం సర్పంచ్ ఆర్.నర్సిములు ఆధ్వర్యంలో ముళ్ల పొదలను జెసిబి సహాయంతో తొలగించారు. కార్యక్రమంలో వి. రామాంజనేయులు, నర్సిములు, యం.రాజు, బలరాం, ఆర్.రాజు పాల్గొన్నారు.

# వ్యవసాయ భూములను కార్పొరేట్‌లకు అమ్ముకోవడం క్షమించరాని నేరం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా**



ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : రైతులు వ్యవసాయం చేసుకునే భూములను అక్రమంగా లాక్కొని కార్పొరేట్ బడాబాబులకు అమ్ముకోవడం క్షమించరాని నేరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా, నాగర్కర్నూల్ జిల్లా సిపిఐకార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అన్నారు. కొల్లాపూర్ పట్టణంలో జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అధ్యక్షతన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామ శివారులో 359, 363, 364, 365గల సర్వేనెంబర్లలో ఏల్లూరు గ్రామానికి చెందిన దళితభూములను అక్రమంగా లాక్కొని కార్పొరేట్ శక్తులకు వ్యాపారస్తులకు కోట్ల రూపాయలకు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పేద దళితరైతుల నోట్లో మట్టికొట్టివాళ్ల భూములను వారికి తెలియకుండా పేర్లను మార్చుకొని డబ్బు ఉన్న బడాబాబులకు అమ్ముకుంటున్నారని సిపిఐ గతంలో భూములను పరిశీలించి పేద, దళితులకు ఆభూములను కేటాయించాలని కొల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం సమస్యపై స్పందించి దళిత పేద రైతులకు న్యాయంచేయాలని, సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కుర్మయ్య, కొల్లాపూర్ పట్టణ కార్యదర్శి ఎండి యూసుఫ్, సిపిఐ మండల నాయకులు శివకృష్ణ, వెంకటస్వామి, కృష్ణుడు పాల్గొన్నారు.

# ఎఐటియుసి క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : ఎఐటియుసి డైరీ, క్యాలెండర్లను ఎంపి డాక్టర్ మల్లురవి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిల చేతులమీద ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎంపి డాక్టర్ మల్లురవి మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటిసంఘం ఎఐటియూసి ఏర్పడిందన్నారు. ఎఐటియూసి కార్మికసంఘం ఎన్నో సవాళ్లను ఎదుర్కొని నిరంతరం కార్మికుల కర్షకులకోసం సమానపనికి సమానవేతనం కోసం హక్కులు సాధించి పెట్టిందని , నిరంతరం పోరాటాలద్వారా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను ఎండగడుతూ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్, ఎఐటియూసి జిల్లా సహాయ కార్యదర్శి వెంకటస్వామి, ఎఐటియూసి జిల్లా నాయకులు శివకృష్ణ, హమాలి యూనియన్ జిల్లా నాయకులు గొర్లసత్యం పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ : గ్రామపంచాయితీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించినట్లే మున్సిపల్ ఎన్నికలను కూడా విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డి.జి.పి.శివధర్ రెడ్డి, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాదు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులతో సమీక్షించారు. మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎస్పీ డి.జానకి తో కలిసి వి.సి. లో పాల్గొన్నారు. అనంతరం జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ లతో ఏర్పాట్లపై సూచించారు. జిల్లాలోని మహబూబ్ నగర్ కార్పొరేషన్, భూత్పూర్, దేవరకద్ర మున్సిపాలిటీల్లో నామినేషన్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలు, రూట్ లు క్షేత్రస్థాయిలో సందర్శించి ఏర్పాట్లు పక్కాగా చేసుకోవాలని అన్నారు. బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికీ మాస్టర్ శిక్షకులు అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మున్సిపల్ ఎన్నికలను విజయవంతం చేసేందుకు అవసరమైన పోలీస్ బందోబస్తు నియమించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జెడ్పి సీఈవో వెంకటరెడ్డి, మహబూబ్ నగర్ కార్పొరేషన్ కమిషనర్ రామానుజ రెడ్డి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు

ప్రజాపక్షం/నారాయణపేట : జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల నారాయణపేట, మక్తల్, కోస్గి, మద్దూరులో వార్డు ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి సీ.ఎస్. కే.రామకృష్ణా రావు, డీజీపీ శివధర్ రెడ్డి తో కలిసి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కాగా నారాయణపేట కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి జిల్లా ఎస్పీ డా.వినీత్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ వీసీలో పాల్గొన్నారు. ఈ నెల 28 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందని, నామినేషన్ల ప్రక్రియ మొదలుకుని, నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, తుది జాబితా, గుర్తుల కేటాయింపు, పోలింగు కేంద్రాలలో పోలింగు నిర్వహణకు ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్ ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణకు, కౌంటింగ్ ప్రక్రియవరకు ఎక్కడా ఎలాంటి చిన్న పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయా మున్సిపల్ కమిషనర్‌లను కలెక్టర్ ఆదేశించారు. ఎస్‌డీసీ రాజేందర్ గౌడ్, డీఎస్పీ నల్లపు లింగయ్య, ఆర్డీవో రామచందర్ నాయక్, నోడల్ అధికారులు సాయిబాబా, జాన్ సుధాకర్, అబ్దుల్ ఖలీల్, రహమాన్, మున్సిపల్ కమిషనర్లు గోల్కొండ నర్సయ్య, శ్రీరాములు, నాగరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : వచ్చేనెల 11వ తేదిన జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 131మంది పోలింగ్ కేంద్రాలకి సంబంధించి ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్‌సంతోష్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్ మున్సిపాలిటిల పరిధిలో ఉన్న 65వార్డుల స్థానాలకు ఎన్నికల నిర్వహణకోసం మొత్తం 159మంది సిబ్బందితోపాటు అదనంగా 20శాతం రిజర్వు స్బిబందిని , 629మంది సహాయ ప్రిసైడింగ్ ఎన్నికల అధికారులు, పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపివోలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించినట్లు ఆయన వెల్లడించారు. స్థానికత, ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న అంశాలను పరిగణనలోకి తీసుకొని సిబ్బందిని పోలింగ్ విధులకోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటిల పరిధిలోని 65వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణకోసం 20శాతం రిజర్వుస్టాఫ్‌ను కలుపుకొని ప్రిసైడింగ్ అధికారులు, ఓపివోలకోసం ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, డిఇఓ రమేష్‌కుమార్, డిప్యూటి సిఇఓ గోపాల్‌నాయక్, వెంకటేశ్వర్లుశెట్టి, ఇడిఎం నరేష్ పాల్గొన్నారు.



## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాపక్షం/వెల్దండ : పెద్దాపూర్ గ్రామపంచాయతీకి చెందిన పోలె యాదయ్యకు ముఖ్యమంత్రి సహాయనిధినుండి మంజూరైన రూ.23వేల చెక్కును కల్వకుర్తి వ్యవసాయమార్కెట్‌కమిటి డైరెక్టర్ కేశమల్లకృష్ణ, గ్రామ ఉపసర్పంచ్ చెన్నోజుప్రసాద్‌చారి బాధిత కుటుంబానికి చెక్కును మంగళవారం అందజేశారు.

**వీపనగండ్ల..**



అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితురాలి కుటుంబానికి నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ సిఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. మండలంలోని కల్వరాల గ్రామానికి చెందిన గురుక శాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స పొందింది. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా 23,500 రూపాయలు మంజూరు కాగా అట్టి చెక్కును నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబానికి అందజేశారు.

## బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

ప్రజాపక్షం/నారాయణపేట్ : బుధవారం నుండి ప్రారంభమయ్యే మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని నారాయణపేట్ సిఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు మున్సిపల్ కమిషనర్ నరసయ్య లు కలిసి పరిశీలించారు. నారాయణపేటలో మొత్తం 24 వార్డులకు ఎన్నికలు జరగనున్నగా నామినేషన్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు సమగ్రంగా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మెయిన్ చౌక్ నుండి మున్సిపల్ ఆఫీస్ వరకు 03 రోజులపాటు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని, నామినేషన్ వేసే వ్యక్తి వెంట ఇద్దరు వ్యక్తులకు మాత్రమే పర్మిషన్ ఉంటుందని సిఐ తెలిపారు. నామినేషన్ కేంద్రం వద్ద ఉన్న పోలీసులు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా 100 మీటర్ల పరిధి నియామాలను పాటించాలని, అనుమతి లేకుండా ఎవరిని అనుమతించరాదని సీఐ సూచనలు చేశారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా పాటించాలని స్పష్టంగా తెలిపారు.

**మద్దూర్‌లో..**

ప్రజాపక్షం/ మద్దూర్ : మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని నామిషనేషన్ కేంద్రంలో శాంతి భద్రతలు పటిష్టంగా ఏర్పాటు చేసినట్లు సోమవారం రోజు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మహేష్ గౌడ్ ,మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ తో కలిసి నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశిలించారు. మొత్తం 16 వార్డులకు సంబందించి నామినేషన్లు బుధవారం నుండి ఉన్నందున ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలిస్‌శాఖ ఆద్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

**మక్తల్‌లో..**

ప్రజాపక్షం/మక్తల్ : మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా మక్తల్ పట్టణ కేంద్రంలోని మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్ఐ భాగ్య లక్ష్మి రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఇరిగేషన్ ఏఈ నాగ శివ లు కలిసి పరిశీలించారు. మక్తల్ లో మొత్తం 16 వార్డులకు ఎన్నికలు జరగనున్నగా నామినేషన్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు సమగ్రంగా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.




## వేతనాలు చెల్లించాలని ధర్నా

ప్రజాపక్షం/కొత్తకోటః కొత్తకోట మున్సిపల్ కార్మికులకు పెండింగులో ఉన్న రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ మంగళవారం నాడు మున్సిపల్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్ మాట్లాడుతూ కార్మికులకు పెండింగులో ఉన్న వేతనాలు ఇవ్వాలని అధికారులకు విజ్ఞప్తి చేసిన పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. సంక్రాంతి పండుగ కూడా వేతనాలు ఇవ్వకపోవడంతో పస్తులు ఉండే పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన ఆరోపించారు. సంవత్సరం పాటుగా మున్సిపల్ కార్మికులకు పిఎఫ్ డబ్బులను అకౌంట్లో జమ చేయడం లేదని ఆయన పేర్కొన్నారు. పెరుగుతున్న పట్టణావిస్తరణ అనుగుణంగా కొత్త సిబ్బందిని నియమించాలని డిమాండు చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తేస్తూ 2025 నవంబర్ 21న ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 12న ఒక్కరోజు సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## పారదర్శక ఎన్నికలకు ఏర్పాట్లు

ప్రజాపక్షం/వనపర్తి : వనపర్తి జిల్లాల్లో మున్సిపల్ ఎన్నికలు పకడ్బందీగా, పారదర్శకంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించే విధంగా కృషి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు. మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎన్నికల నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 80 వార్డులకు గాను 6 ఎస్.ఎస్.టి.ఎఫ్.ఎస్.టి బృందాలను ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలీస్ శాఖ సహకారంతో అత్యంత పకడ్బందీగా ఎనికల నియమ నిబంధన మేరకు పాదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాపక్షం/వంగూర్ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం కల్వకుర్తి మండలం ఎల్లికల్ గ్రామానికి చెందిన తాటికొండ చిన్న భీమయ్య(37) తన ద్విచక్రవాహనంపై ఈనెల 16న సంక్రాంతిపండుగ సందర్భంగా ఉప్పునుంతల మండలం పెద్దాపూర్ అత్తగారి ఇంటికి వెళుతుండగా ప్రమాదవశాత్తూ కోనాపూర్ గ్రామంవద్ద ద్విచక్రవాహనంపై నుండి పడిపోవడంతో తలకు తీవ్రమైన గాయాలు తగలడంతో స్థానికులు 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఎన్నమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మంగళవారం ఉదయం మృతిచెందినట్లు తెలిపారు. మృతునికి భార్య అరుణ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ట్రోఫీ అందుకుంటున్న లెజెండ్స్ టీం

ప్రజాపక్షం/రేవల్లి : రేవల్లి మండలంలోని తలుపునూరు గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ లో విజేతగా లెజెండ్స్ టీం నిలిచింది. ఫైనల్లో భీమ్ ఆర్మీ టీం తో తలపడిన లెజెండ్స్ టీం విజయం సాధించింది. ఈ సందర్భంగా చైతన్య యువజన సంఘం అధ్యక్షులు భాస్కర్, అంబేద్కర్ యువజన సంఘా నాయకులు చిన్న రాముడు గౌండ్ల భీముడు ఈ టోర్నమెంట్ విజేతలకు అలాగే రన్నర్స్ కు ట్రోఫీతో పాటు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెండు సంఘల నాయకులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో కృషి

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

ప్రజాపక్షం/ నారాయణపేట్ : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి నారాయణ పేటను రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా మార్చాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జరిగిన రోడ్ సేఫ్టీ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఇంతవరకు జరిగిన రోడ్ సేఫ్టీ మీటింగ్ లో చర్చించిన అంశాలు, చేపట్టిన పనుల గురించి శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అధికారులు చిత్త శుద్ధితో కృషి చేయాలన్నారు. శాఖల వారీగా యాక్షన్ ప్లాన్ తో సమావేశానికి రావాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అందరూ కేవలం సమస్యలనే ప్రస్తావిస్తే సరిపోదని, వాటి పరిష్కారానికి ఏం చేయాల్లో ప్రణాళికను రూపొందించుకోవాలని ఆమె తెలిపారు. వారం రోజులలోపు పోలీసు శాఖ, విద్యాశాఖ, ఆర్ అండ్ బీ, పంచాయితీ రాజ్, ఎన్‌హెచ్, మున్సిపల్ శాఖల క్షేత్రస్థాయిలో ఆయా శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదిక తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు

## నేరాల నియంత్రణలో సిసి కెమెరాల పాత్ర కీలకం

ప్రజాపక్షం/వనపర్తి : పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో గ్రామస్తుల సహకారంతో ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన 10 అధునాతన సీసీ కెమెరాలను గ్రామపంచాయితీ కార్యాలయం భవనంలో ఏర్పాటు చేసిన 10 సీసీ కెమెరాలను వనపర్తి ఎస్పీ, సునీత రెడ్డి ప్రారంభించారు. జిల్లాలో నేరాల అదుపు చేయడానికి పోలీసులతో పాటు ప్రజలను, గ్రామస్తులను భాగస్వామ్యం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

# బుజ్జగించేందుకు నేతల పాట్లు

### నేటి నుండి నామినేషన్లు

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ లోని కార్పోరేషన్, మున్సిపాలిటీలకు ఎన్నికల నగరా మోగింది. దీంతో ఆశావాహులను బుజ్జగించేందుకు నేతలకు పాట్లు తప్పడం లేదు. మహబూబ్‌నగర్ కార్పోరేషన్‌లో ని 60 కార్పోరేటర్లకు అన్ని పార్టీల నుండి వందల సంఖ్యలో ఆశావాహులు దరఖాస్తు చేసుకున్నారు. అధికార పార్టీ ఈ సారి మేయర్ పీఠం మాకే దక్కుతుందని ఆశావాద దృక్పథంతో అడుగులు వేస్తున్నారు. దీనికి ధీటుగా బిఆర్‌ఎస్, బిజెపి లు కూడా మేయర్ స్థానాన్ని దక్కించుకోవాలని పట్టుదలతో కృషి చేస్తున్నారు. మహబూబ్‌నగర్ మేయర్ స్థానాన్ని బిసి మహిళాకు కేటాయించడంతో కాంగ్రెస్ పార్టీ ఎలాగైన మేయర్ స్థానాన్ని దక్కించుకోవాలనే దిశగా పావులు కదుపుతుంది. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ చైర్మన్‌గా బిసి అభ్యర్థిగా గెలిపించినప్పటికి తర్వాత పరిణామాల మూలంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మరో బిసి నేత ఆనంద్ కుమార్ గౌడ్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. చైర్మన్‌గా ఎన్నికయిన కొద్ది కాలంలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పట్టణంలో మంచి పేరు సంపాదించుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోనే భూత్పూర్, దేవరకద్ర , మున్సిపాలిటీలకు సైతం ఆశావాహులు సంఖ్య భారీగానే ఉంది. భూత్పూర్ మున్సిపాలిటీలోని పది కౌన్సిలర్లకుగాను అన్ని పార్టీల నుండి భారీగానే దరఖాస్తులు వచ్చాయి.

మున్సిపల్ చైర్మన్ పదవిని ఈ దఫా ఎస్టీ, జనరల్‌కు కేటాయించడంతో గతంలో భూత్పూర్ సర్పంచిగా పనిచేసిన రాము నాయక్ గతంలో కాంగ్రెస్ పార్టీ యంపిటిసిగా పనిచేసిన లాలు నాయక్ కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నుంచి పోటీలో ఉన్నానున్నట్లు తెలుస్తుంది. అలాగే దేవరకద్ర మున్సిపల్ చైర్మన్ పదవిని జనరల్ కు కేటాయించడంతో ఆశావాహుల సంఖ్య ఎక్కువగానే ఉంది. అన్ని పార్టీలకు ఆశావాహులను బుజ్జగించేందుకు నేతలు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ ఎన్నికలకు నేటి నుంచి నామినేషన్లు దాఖలు చేసుకోవడానికి అవకాశం కల్పించడంతో సందడి మొదలైంది. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మహబూబ్‌నగర్ కార్పోరేషన్ ను దక్కించుకోవడానికి ఈ పాటికే కార్యకర్తలందరితో చర్చించినట్లు తెలుస్తుంది. భూత్పూర్, దేవరకద్ర, మున్సిపాలిటీలను తమ పార్టీ అభ్యర్థులనే గెలిపించుకోవాలనే దిశతో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పావులు కదుపుతున్నారు.



## దివ్యాంగులకు ప్రభుత్వం పెద్దపీట

### ఎమ్మెల్సీ సత్యంతో కలసి ట్రై సైకిళ్లు అందజేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/మునుగోడు:** దివ్యాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ నుండి వికలాంగులకు మునుగోడు నియోజక వర్గానికి మంజూరైన 6 టీవీఎస్ జుపిటర్ స్కూటీలు,నాలుగు బైసైకిళ్లను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులు ఎవరి మీద ఆధారపడకుండా తమ స్వశక్తితో ఆత్మస్థైర్యంతో బతకాలని అన్నారు.దివ్యాంగుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో సహాయక సహకారాలు అందిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు,నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దివ్యాంగుల సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లు అన్నారు. మంగళవారం తెలంగాణ దివ్యాంగుల సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణి కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దివ్యాంగులకు బ్యాటరీ వీల్ చైర్స్, ఎలక్ట్రికల్ మోటార్ త్రీ వీలర్స్ బైక్స్‌ను, హెల్మెట్లను వారు పంపిణి చేసి మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల, వయోవృద్ధుల సాధికారక శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు చేయూతనందించేందుకు ఈ వినూత్న కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీడీపీవో రేఖల మమత తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లి సమాజంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపుసాధించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేములవీరేశంఆకాంక్షించారు. మంగళవారం నకిరేకల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దివ్యాంగులకు ప్రభుత్వ పథకాల ద్వారా మంజూరైన స్కూటీలు, ల్యాప్‌టాప్‌లను అర్హులైన దివ్యాంగ లబ్ధిదారులకు ఆయన పంపిణీచేశారు.ఈసందర్భంగాఆయనమాట్లాడుత్తూదివ్యాంగుల విద్యా ప్రోత్సాహం,ఉపాధి అవకాశాల విస్తరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,డిపిఎం మోహన్ రెడ్డి,ఎంపీడీవోవెంకటేశ్వర రావు ,ఐసిడిఎస్‌సిడి పిఓ అస్రా అంజుమ్,ఎంఈఓ మేక నాగయ్య, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంబయ్య పాల్గొన్నారు.

## 30 నాటికి పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలకు నమోదు : కలెక్టర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఈనెల 30 నాటికి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులందరూ పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలకు నమోదయ్యేలా ఎంఈఓలు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంఈఓ లతో పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాలు, ఇంజనీరింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు.జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణం,మరుగుదొడ్ల నిర్మాణానికి పనులను ఆయా ఏజెన్సీలకు ఇవ్వడం జరిగిందని,త్వరితగతిన పనులు పూర్తి చేసే బాధ్యత ఎంఈఓ లపై ఉందన్నారు. ఈ ఏడాది మార్చి8 వరకు ప్రహరీ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు.ఇప్పటికే ప్రారంభమైన పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా నిర్దిష్ట గడువులోపు పూర్తిచేయాలని, నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి,పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్,ఆర్అండ్‌బి ఈఈ.శ్రీధర్ రెడ్డి,ఈడబ్ల్యుడిసి ఈఈ బాల ప్రసాద్ హాజరయ్యారు.

## డయేరియా కేసులు పూర్తయ్యే వరకూ శిబిరం: కలెక్టర్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మోతె మండలం సిరికొండ గ్రామంలో డయేరియా కేసులు పూర్తిగా నివారించే వరకు ఆరోగ్య శిభిరం నిర్వహించాలని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. జడ్పి సిఈఓ శిరీష, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి పెండెం వెంకటరమణ, తహశీల్దార్ వెంకన్న, ఎంపిడిఓ ఆంజనేయులు, మెడికల్ అధికారి భవాని, ఆర్‌డబ్లుఎస్ అధికారులు, పంచాయితీ కార్యదర్శి భూలక్ష్మి లతో కలెక్టర్ ఛాంబర్ నుండి మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయితీ రాజ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మోతె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది 24/7 విధుల్లో ఉండాలని ఆదేశించారు. వ్యాధుల వ్యాప్తిని అడ్డుకునేందుకు స్వచ్ఛమైన త్రాగునీటి వినియోగం, పారిశుధ్ధ్య నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత అలాగే ముందస్తు నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గత గురువారం రోజున సిరికొండ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి విరోచనాలతో బాధపడుటను ఆశా కార్యకర్త గుర్తించి మెరుగైన చికిత్స నిమిత్తం పిహెచ్‌సి మోతెకు పంపించి చికిత్స అందించారు. గత 3 రోజులలో 50 మందికి చికిత్సను అందించడం జరిగిందని, వీరంతా మిరపతోటలో పనికి వెళ్ళి అక్కడ కలుషితమైన నీటిని త్రాగడం వలన అస్వస్థతకు గురవటం గుర్తించామని, నీటి నమూనాలను పరీక్షల కొరకు పంపించడం జరిగిందని అధికారులు కలెక్టర్‌కి వివరించారు. అధికారులు, గ్రామస్తులు సమన్వయం చేసుకుంటూ అస్వస్థతకు గురైన ప్రజలు త్వరగా కోలుకునేలా చూడాలని కోరారు.

## రానున్న రెండేళ్లలో 30 లక్షల మంది నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రాష్ట్రంలో రానున్న రెండు సంవత్సరాలలో 30 లక్షల మంది నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలో రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించిన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ మొదటి అంతస్తును ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం న్యాక్ ద్వారా నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున స్వయం ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రంలో చేపట్టిన న్యాక్ భవనాలలో నల్లగొండ న్యాక్ మొదటిదని తెలిపారు. న్యాక్ కేంద్రం ద్వారా వివిధ రకాల కోర్సులలో ముఖ్యంగా ఎలక్ట్రిషన్, ప్లంబర్ , మెకానిక్, వెల్డర్, డెకరేషన్, కార్పెంటర్, సి సి టీవీ, కంప్యూటర్ తదితర విభాగాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని,రాబోయే కాలంలో మరిన్ని కోర్సులలో శిక్షణను ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కార్మిక శాఖ కారంతో న్యాక్ ఆధ్వర్యంలో 60 మంది మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలో 84 కోట్ల రూపాయలతో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ ను ఇదివరకే ప్రారంభించుకోవడం జరిగిందని,రూ.5కోట్ల లతో వివిధ రకాల కోర్సులలో శిక్షణ ఇచ్చేందుకు సెట్విన్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా మంత్రి రాష్ట్రపతి ద్వారా అవార్డు పొందిన ఇన్స్ట్రక్టర్ స్నేహలతను శాలువాతో సన్మానించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ద్వారా నిర్మాణ రంగంలో జిల్లా యువతకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. న్యాక్ డిజిఎం నాయక్, జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర పవార్,ఎమ్మెల్సీ శంకర్ నాయక్,జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు హఫీజ్ ఖాన్, న్యాక్ ఇంజనీరింగ్ అధికారులు,ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.




## ఐదు రోజుల పని దినాల విధానాన్ని అమలు చేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** బ్యాంకింగ్ రంగంలో వారంలో ఐదు రోజుల పని దినాల విధానాన్ని అమలు చేయాలని నల్లగొండ కోఆర్డినేషన్ కమిటీ జిల్లా కార్యదర్శి కత్తుల ఈశ్వర్ కుమార్ డిమాండ్ చేశారు.యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్‌ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అనంతరం ఎస్‌బిఐ బ్యాంక్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఈశ్వర్ కుమార్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో వారంలో ఐదు రోజుల పని దినాల విధానంను అమలు చేయాలనే న్యాయమైన డిమాండ్ సాధనకై చేపట్టిన దేశవ్యాప్త స్ట్రైక్‌కు బ్యాంకు ఉద్యోగులు నిరసన పాల్గొని సంపూర్ణ మద్దతు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు సుమన్, శ్రమీక్, రాజశేఖర్, అలీముద్దీన్, యాదయ్య,,జీవన్, నర్సింహా, దిలీప్, ప్రవీణ్, రాజు, శివ,ప్రియాంక, సంధ్య, సతీష్ రెడ్డి, యుగేందర్,రామ్మోహన్, శ్రవణ్ పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించాలి

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ మునిసిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం మంగళవారం జిల్లా ఇంచార్జీ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్‌నేత , దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ ఆధ్వర్యంలో ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈసందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ అతి త్వరలో జరగబోయే దేవరకొండ మునిసిపల్ ఎన్నికల్లో 20కి 20 స్థానాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే గెలవాలనే లక్ష్యంతో ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన త్వరాత సిఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా పాలన కొనసాగుతుందని, ఆర్ధికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు. అనంతరం ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ దేవరకొండ మునిసిపాలిటి పరిధిలో ప్రజల అవసరాలు, సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలు చూపడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం అని, ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని, ప్రజల ఆశీర్వాదంతో రానున్న మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో మంజూరైన స్కూటీలు, వీల్ చైర్లు, స్మార్ట్ ఫోన్లను దివ్యాంగులకు, వికలాంగులకు మంత్రి చేతుల మీదుగా పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అన్ని సీట్లు కాంగ్రెస్ కైవసం



భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపాలిటీ సాధారణ ఎన్నికలలో నియోజకవర్గంలోని అన్ని మున్సిపాలిటీల వార్డు కౌన్సిలర్లు, చైర్మన్లు కాంగ్రెస్ పార్టీనే కైవసం చేసుకుంటుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం పోచంపల్లి పట్టణ కేంద్రంలోని 11వ వార్డులో యాదవ కమ్యూనిటీ, 5వ వార్డులో బీసీ కమ్యూనిటీ భవనాలకు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మున్సిపాలిటీల మౌలిక వసతులు అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ దాదాపు రూ.50 కోట్ల నిధులను కేటాయించిందని గుర్తు చేశారు. ప్రతి ఇంటికి వంద లీటర్ల మంచినీటిని పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రతి వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్లు, వాటర్ ట్యాంకులు, కమ్యూనిటీ భవనాలు, ప్రజా అవసరాల ప్రతి ఒక్కటి తీర్చేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో నిలిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. అనంతమైన మార్కండేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సహస్ర శతఘటాభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తడక వెంకటేశ్వర్లు, డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, జిల్లా సీనియర్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి ఉన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ భూస్థాపితం ఖాయం

### ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి :** పదేళ్ల విధ్వంసకర పాలనతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్‌ఎస్ పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల ఫలితాలే మున్సిపల్ ఎన్నికల్లోనూ పునరావృతమవుతాయని, బీఆర్‌ఎస్ పార్టీ రాజకీయంగా భూస్థాపితం కావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయడానికి బీఆర్‌ఎస్, బీజేపీలు అంతర్గత ఒప్పందం చేసుకున్నాయని చామల ఆరోపించారు. 'బీఆర్‌ఎస్ తన ఉనికిని పణంగా పెట్టి బీజేపీకి అవయవదానం చేసింది. ఎనిమిది స్థానాల్లో బీజేపీ గెలుపునకు సహకరించి, స్వయంగా గుండు సున్నా చుట్టుకుంది,' అని విమర్శించారు. కేసీఆర్ అహంకారంతో ఎన్నికలకు వెళ్లారని, కానీ ప్రజలు రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలనకు జై కొట్టారని పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల మధ్య అంతర్గత విభేదాలు భగ్గుమంటున్నాయని ఎంపీ సంచలన వ్యాఖ్యలు చేశారు. కవిత జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావుల అసలు స్వరూపాన్ని బయటపెడుతున్నారని ఎద్దేవా చేశారు. 'కేసీఆర్ సగం ఇడ్లీ తిన్నా బయటకు తెలుస్తుందని కవిత చెప్పడం చూస్తుంటే, వారి కుటుంబంలో ఒకరిని ఒకరు ఓర్చుకోలేని పరిస్థితి ఉందని అర్థమవుతోంది. గెలుపుపై ధీమాతో 'ఓవర్ కాన్ఫిడెన్స్' ప్రదర్శించవద్దు. ప్రజలతో మమేకమై పనిచేయాలి. చివరగా, పదేళ్ల కాలంలో ప్రగతి భవన్ దాటని కేసీఆర్ పాలనకు, ప్రజల మధ్య తిరుగుతున్న రేవంత్ రెడ్డి పాలనకు ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడతారని' చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించండి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** సిపిఐ మున్సిపల్ ముఖ్య కార్యకర్తల సమావేశం పగిళ్ల మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ నెల 11న జరిగే మున్సిపాలిటీ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గాలయ్య కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల మౌలిక వసతులు, త్రాగునీరు అండర్ గ్రౌండ్, డ్రైనేజ్, పారిశుధ్యం, సిసి రోడ్ల నిర్మాణం కోసం పార్టీ ఆధ్వర్యంలో అనేక ఉద్యమం నిర్వహించి అనునిత్యం ప్రజల కోసం పని చేసే ఏకైక పార్టీ సిపిఐ అని అన్నారు. ప్రజా సమస్యల కోసం రాజీ లేకుండా, ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగ గకుండా ప్రజల సంక్షేమం కోసం పనిచేసే వారిని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, కొండూరు విప్లవ్, టంగుటూరి రాములు, బద్దుల సుధాకర్, దాసరి మనోహర్, బోయ మంకులు, గుండె బోయిన భాస్కర్, నీల బిక్షపతి, దాసరి కృష్ణ, బెదరికోట యాదయ్య తదితరులు పాల్గొన్నారు.




## మాయమైపోతున్న మానవత్వం... డబ్బుల కోసం క్రూరత్వం!

### రూ.1300 కోసం మహిళ హత్య...
### అనంతరం మహిళ మెడలో బంగారం అపహరణ...
### ఇంటి వెనకాలే మహిళల పూడ్చివేత..

**ప్రజాపక్షం/హాలియా:** డబ్బుల కోసం మనిషి మానవత్వమే మరిచి మృగంలా మారుతున్నాడనే దానికి హాలియాలో రెండు రోజుల క్రితం జరిగిన వృద్ధ మహిళ హత్యనే అందుకు నిదర్శనం.నా అనేవారు ఎవరూ లేరు...కట్టుకున్న భర్త, కడుపున పుట్టిన పిల్లలు లేరు...కాటికి కాలు చాచిన వయసులోనూ శరీరం సహకరించుకున్నా...రెక్కాడితే కానీ డొక్కాడదని తెలిసిన ఆవృద్ధ మహిళ రోజు కూలి పనులకు పోయేది.వచ్చిన కొద్దో గొప్పో డబ్బులను దాచుకొని ఏదైనా చేతకాని సమయంలో ఆసరా అవుతాయని ఆశించింది...అలా ఆశించడమే ఆమె పాలిట యమపాశమైంది. ఇక విషయంలోకి వస్తే అత్యంత విషాదాంతమైన వృద్ధమహిళ హత్య హాలియాలో సంచలనగా మారింది. హాలియాకు చెందిన సుంకిరెడ్డి అనసూయమ్మ గత శనివారం అదృశ్యమైన సంగతి విధితమే.ఈఅదృశ్య మహిళ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన హాలియా పోలీసులు సీఐ సతీష్ రెడ్డి, ఎస్ఐ సాయి ప్రశాంత్‌లు తప్పిపోయిన అనసూయమ్మను కనిపెట్టేందుకు హాలియాలో గల సిసి ఫుటేజీలను పరిశీలించారు.ఇందులో శనివారం అనసూయమ్మ దేవరకొండ రోడ్డులో గల ధనలక్ష్మి ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌కు వెళ్లినట్లు కనిపించింది.అందులోకి వెళ్ళిన అనసూయమ్మ తిరిగి రాకపోవడంతో దీనిపై దృష్టి సారించిన పోలీసులు షాపు నిర్వహిస్తున్న చినపాక రాములు,ధనలక్ష్మి,గౌరీలను విచారించారు.ఈవిచారణలో అనసూయమ్మకు రూ.1300 ఇవ్వాలని తాము చేసిన అప్పులు తీరాలంటే అనసూయమ్మ మెడలో ఉన్న బంగారమే తమ సమస్యలకు పరిష్కారమని నిర్ణయించుకొని ఆమెను అంతమొందించినట్లు విచారణలో వారు వెల్లడించినట్టు తెలిసింది.ఒక వృద్ధ మహిళను మరొక మహిళ ధనలక్ష్మి హత్యలో భాగమై కత్తిపీటతో గొంతు కోసి అంతమొందించిన తీరు మనిషిలో మానవత్వం మాయమైపోతుందని రుజువు చేసింది.హాలియాలో సంచలనం రేపిన ఈ సంఘటన పలువురిని కంటతడి పెట్టించింది.అనసూయమ్మను అంతమొందించిన ఆముగ్గురు తండ్రి,తల్లి,కొడుకులను మంగళవారం కోర్టుకు హాజరు పరచగా వారిని 14 రోజులు రిమాండ్‌కు పంపినట్లు సీఐ సతీష్ రెడ్డి తెలిపారు.




## ప్రతి గురువారం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్ రద్దు

### జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినందున కోడ్ అమలులోకి వచ్చినందున ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు ప్రతి గురువారం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్, ఉద్యోగ వాణి కార్యక్రమం ఉండదని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి విషయాన్ని జిల్లాలోని ప్రజలు గమనించి వివిధ సమస్యల పై ఆర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని తెలిపారు.

## ఆశావహులకు టిక్కెట్ భయం



### కడుపుకు తిండి లేదు... కంటికి కునుకులేదు...

**మున్సిపల్ ఎన్నికల్లో ఆయా పార్టీల నుండి పోటీ చేయాలనుకున్న ఆశావహులకు టిక్కెట్ భయం పట్టుకుంది. ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి అడుగు వేయడంతోపాటు సర్వేల ఆధారంగానే టిక్కెట్లు కేటాయిస్తామని ప్రకటించడంతో తమకు టిక్కెట్ వస్తుందో రాదో అనే భయంతో కడుపు నిండా తిండి తినడం మానేయడంతో పాటు కంటి నిండి నిద్రపోకుండా దీని గురించే ఆలోచిస్తున్న పరిస్థితి.**

**ప్రజాపక్షం/సూర్యాపేట :** మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ రానే వచ్చింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను మంగళవారం సాయంత్రం ప్రకటించింది. సూర్యాపేట జిల్లాలో మొత్తం 5 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీలు ఉండగా ఏ రాజకీయ పార్టీ కూడా నేటికి తమ పార్టీ నుండి ఎన్నికల బరిలో నిలబడే వార్డు అభ్యర్థులను నేటికి అధికారికంగా ప్రక టించలేదు. అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష బిఆర్‌ఎస్ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. మున్సిపల్ పోరులో తమ పట్టును నిలుపు కునేందుకు అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ సర్వే ఆధారంగా టిక్కెట్లను కేటాయిస్తామని ముందే ప్రకటించి ఆశావ హుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తుంది. బిఆర్‌ఎస్ ప్రజాబలం, ఆర్థిక బలం ఉన్న వారిని పోటీలో నిలుపాలని చూస్తుంది. అధికార పార్టీలో ఒక్క వార్డుకు నలుగురి నుండి ఐదుగురు నాయకులు టిక్కెట్ కోసం పోటీపడుతుండగా ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్‌ఎస్‌లో కూడా అదే పరిస్థితి ఉంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనా అభ్యర్థుల ఎంపిక ఖరారు కాకపోవడంతో టిక్కెట్‌ను ఆశిస్తున్న ఆశావహులు తమకు టిక్కెట్ వస్తుందో రాదో అనే భయం పట్టుకుంది. తమ పార్టీ అగ్రనేతల చుట్టూ కాళ్ళరిగేలా తిరుగుతూ వేడుకుంటూనే ప్రచారంలో వెనుకపడితే నష్టంవస్తుందని మరోవైపు తాము పోటీ చేయాలనుకున్న వార్డులో ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. కడుపు నిండా తిండి తనకుండా రాత్రిపూట కంటి నిండా నిద్రపోకుండా టిక్కెట్ ధ్యాసలోనే గడుపుతున్న పరిస్థితి.

**టిక్కెట్ల కేటాయింపు నేటి నుండి కొలిక్కి వచ్చేనా?**

రాష్ట్ర ఎన్నికల కమీషన్ మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో టిక్కెట్ల కేటాయింపు నేటి నుండి ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందనే ప్రచారం రాజకీయ వర్గాల్లో సాగుతుంది. నామినేషన్ల దాఖలుకు ఎన్నికల కమీషన్ కేవలం నేటి నుండి మూడు రోజులు మాత్రమే గడువు పెట్టింది. దీంతో ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల బరిలో నిలిపే తమ అభ్యర్థుల పేర్లు వెంటనే ప్రకటించి బిఫామ్‌లు ఇవ్వకుంటే సమయాభావం వల్లే ఇబ్బంది పడే అవకాశం కూడా ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకొని అభ్యర్థుల ఎంపికలో రాజకీయ పార్టీ లు కాలయాపన చేసే అవకాశం లేకుండాపోయింది.

వీ ఆర్ జీ ఆర్ మూవీస్ బ్యానర్‌పై గంగాధర్ సమర్పణలో, రజని గొంగటి నిర్మాతగా నూతన దర్శకుడు జీవి నాయుడు దర్శకత్వం వహించిన చిత్రం క్యాట్ ఫస్ట్ కాపీ రెడీ చేసుకుని త్వరలో రిలీజ్ కాబోతున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ని ప్రముఖ దర్శకులు బుచ్చి బాబు హైదరాబాద్‌లో విడుదల చేశారు.

రీల్

# మోహన్‌బాబుకు ఎక్సలెన్స్ అవార్డు



కోల్‌కత్తాలోని లోక్ భవన్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నుండి ప్రతిష్టాత్మక గవర్నర్ అవార్డు ఆఫ్ ఎక్సలెన్స్‌ను నటుడు డా. మంచు మోహన్ బా బు అందుకున్నారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఈ అవార్డును విశిష్ట అతిథుల మధ్య ప్రదానం చేశారు. తరువాత సాంప్రదాయ ఎట్ హోమ్ రిసెప్షన్ జరిగింది. ఈ కార్యక్రమంలో మోహన్ బాబు కుమారుడు, మా అధ్యక్షుడు విష్ణు మంచు, మా కోశాధికారి శివ బాలాజీ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన్ బాబు తన స్పందన తెలియజేస్తూ ప్రస్తుత భారతదేశం అంతటా తెలుగు సినిమా ప్రభావం కనిపిస్తోంది. ఈ క్రమంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఒక తె లుగు నటుడికి ఇటువంటి గౌరవాన్ని ప్రదానం చేయడం ఓ ప్రత్యేక చరిత్రను సృష్టించినట్లుగా నిలిచింది. మోహన్ బాబు 50 సంవత్సరాల సినీ జీవితంలో కళామతల్లికి చేసిన సేవ, అట్టడుగు స్థాయి నుండి భారతదేశం గర్వించదగ్గ నటుడిగా ఎదగడం, విద్య, దాతృత్వంలో సమాజం పై చెరగని ముద్ర వేయడం గురించి అందరికీ తెలిసిందే. ఆయన సినీ, వ్యక్తిగ త జీవితం, పాటించే క్రమశిక్షణ మందికి స్ఫూర్తినిస్తుంది అని అన్నారు.

# 'ఉస్తాద్ భగత్ సింగ్' డబ్బింగ్ పనులు షురూ



పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా డబ్బింగ్ పనులు ప్రారంభమయ్యాయి. హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ఇటీవలే పూర్తయింది. సాధ్యమైనంత త్వరగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసి విడుదల కు సిద్ధం చెయ్యాలనే ఉద్దేశ్యంతో ఈ సిని మా డబ్బింగ్ పనులను మొదలు పెట్టారు. పవన్ కళ్యాణ్ త్వరలో డబ్బింగ్ కార్యక్రమాలలో పాల్గొననున్నారు. 'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో రూపొందుతోన్న చిత్రం కావడంతో 'ఉస్తాద్ భగత్ సింగ్'పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నిర్మాతలు నవీన్ యెర్నేని, రవి శంకర్ యలమంచిలి ఎక్కడా రాజీ పడకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన 'దేఖ్ లేంగే సాలా' గీతం శ్రోతలను ఉర్రూతలూగించింది.'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నిర్మాణానంతర కార్యక్రమాలు ప్రస్తుతం శరవేగంగా జరుగు తున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన కీలక అప్డేట్లను త్వరలోనే నిర్మాతలు వెల్లడించనున్నారు. ఇందులో పవన్ కళ్యాణ్, శ్రీలీల, రాశిఖన్నా హీరోయిన్లు గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి కథనం: కె. దాశరథ్, రమేష్ రెడ్డి, రచనా సహ కారం: ప్రవీణ్ వర్మ, చంద్ర మోహన్, కూర్పు: కార్తిక శ్రీనివాస్, కళ: ఆనంద్ సాయి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్లు: ఆర్. చంద్రశేఖర్, దినేష్ నరసింహన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: హరీష్ పై, ఫైట్స్: రామ్‌లక్ష్మ ణ్, నబకాంత్, పృధ్వి.


# 'రణబాలి' గ్లింప్స్ రిలీజ్



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో టీ సిరీస్ సమర్పణలో బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న మూవీకి 'రణబాలి' అనే టైటిల్ ను ఖరారు చేశారు. టైటిల్ గ్లింప్స్ విడుదలతో పాటు సినిమా రిలీజ్ డేట్ ను కూడా అనౌన్స్ చేశారు. ఈ సినిమా సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్‌కు రాబోతోంది. 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈ సినిమా గ్లింప్స్ లో రణబాలి అనే యోధుడి పాత్రలో విజయ్ దేవరకొండ కనిపించిన తీరు ఆకట్టు కుంటోంది. తన మాతృభూమి కోసం ప్రాణాలు ఒడ్డి పోరాడే రణబాలి పాత్రలో విజయ్ ఒదిగిపోయారు. హీరోయిన్ రశ్మిక మందన్న జయమ్మగా కనిపించింది. ప్రతినాయకుడు సర్ థియోడర్ హెక్టర్ పాత్రలో 'మమ్మీ' సినిమా ఫేమ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ నటించారు. పచ్చటి పైరులతో అలరారే మన గ్రామసీమలను బ్రిటీష్ క్రూర పాలకులు కరువు ప్రాంతాలుగా ఎలా మార్చారో ఈ గ్లింప్స్ లో బాధాకరంగా చూపించారు. ఆర్థికంగా పీల్చిపిప్పి చేస్తూ మన సమాజంలో హిట్లర్ ఊచకోతను మించిన మారణహోమాన్ని బ్రిటీషర్స్ ఎలా సృష్టించారో గ్లింప్స్ రిఫ్లెక్ట్ చేసింది. బ్రిటీష్ అధికారిని గుర్రానికి కట్టి రైల్వే ట్రాక్ పై రణబాలి ఈడ్చుకుంటూ వెళ్లే సీన్ గ్లింప్స్ కు హైలైట్ గా నిలుస్తోంది.19వ సెంచరీ నేపథ్యంలో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా 'రణబాలి' సినిమా రూపొందుతోంది. 'డియర్ కామ్రేడ్', 'ఖుషి' వంటి సక్సెస్ ఫుల్ సినిమాల తర్వాత మైత్రీ మూవీ మేకర్స్, విజయ్ కలిసి చేస్తున్న మూడో చిత్రమిది. 'టాక్సీవాలా' లాంటి సూపర్ హిట్ తర్వాత విజయ్ దేవరకొండ, రాహుల్ సంకృత్యన్ ఈ సినిమాతో మరోసారి కలిసి పనిచేస్తున్నారు. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత 'రణబాలి'లో మూడోసారి రశ్మిక, విజయ్ జంటగా నటించారు.

# వీరారెడ్డి పాత్ర వెరీ పవర్‌ఫుల్


సంగీత దర్శకుడు, నటుడు రఘు కుంచె



పుష్యమి ఫిలిం మేకర్స్ బ్యానర్ పై బెల్లం సుధా రెడ్డి సమర్పణలో బెల్లం రామకృష్ణా రెడ్డి రచనా దర్శకత్వంలో స్వీయ నిర్మాతగా రూపొందిన చిత్రం 'దేవగుడి'. ఈ సినిమాలో ఈ అభినవ శౌర్య, నరసింహ, అనుశ్రీ, రఘు కుంచె ప్రధాన పాత్రల్లో నటించారు. 'దేవగుడి' సినిమా ఈ నెల 30న రిలీజ్ కు రాబోతోంది. ఈ సందర్భంగా దర్శక నిర్మాత బెల్లం రామకృష్ణా రెడ్డి, నటుడు రఘు కుంచె మీడియాతో చిట్ చాట్ చేశారు. నటుడు రఘుకుంచె మాట్లాడుతూ ఈ నేను దేవగుడి వీరారెడ్డి అనే పాత్రలో నటించాను. ఆయన ఆ చుట్టు పక్కల ఏరియాలో పవర్ ఫుల్ వ్యక్తి. నాకు పలాస సినిమా తర్వాత అలాంటి రోల్స్ వస్తున్నాయి. ఈ సినిమాలో వీరారెడ్డి పాత్ర కోసం దర్శకుడు రామకృష్ణా రెడ్డి ఎలా చెబితే అలా చేశాను. రాయలసీమ యాసలో డైలాగ్స్ చెప్పాను. ఈ సినిమా షూటింగ్ అంతా రియల్ లొకేషన్స్ లో చేశాం. ఎక్కడైతే కొన్ని ఇన్సిడెంట్స్ జరిగాయని దర్శకుడు స్క్రిప్ట్ రాశారో అక్కడే షూటింగ్ చేశాం.

# ఒక్కసారైనా ఇలాంటి పాత్ర చేయాలి అనుకున్నా

ఈషా రెబ్బా



తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బ జంటగా వస్తున్న తాజా చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఈ సినిమా జనవరి 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈషా రెబ్బా మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నాకు కొంచెం గ్యాప్ వచ్చిన మాట నిజమే. నా లాస్ట్ మూవీ సినిమా సరిగ్గా వర్కౌట్ కాలేదు. క థ, పాత్ర సినిమాలో ఫైనల్ గా ఉంటుందని నమ్మకం కుదిరిన తర్వాతే చేద్దామని అనుకున్నాను. అలా నమ్మక ంగా కుదిరిన కథ ఇది. 'ఓం శాంతి శాంతి శాంతిః' సి నిమా ఒరిజినల్ నాకు చాలా ఇష్టం. అందులో హీరోయిన్ క్యారెక్టర్ నాకు చాలా నచ్చుతుంది. ఇది అందరూ యూనివర్సల్ గా కనెక్ట్ అయ్యే సోరీ.మన తెలుగు నేటివిటికి తగ్గట్టు కథలో పాత్రల్లో చాలా మార్పులు చేశారు. ఇందులో ఉండే ఎమోషన్స్ అందరు కూడా కనెక్ట్ అయ్యేలాగా ఉంటా యి. సినిమా చూస్తున్నప్పుడు రీమేక్ అనే ఫీలింగ్ రాదు. ఇందులో అన్ని క్యారెక్టర్స్ కి ఆడియన్స్ రిలేట్ అవుతారు.నాకు శాంతి క్యారెక్టర్ చేయడం చాలా ఎక్సైటింగ్ గా అనిపించింది. ఇలాంటి క్యారెక్టర్ చేయాలని ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నాను. కెరీర్‌లో ఒక్కసారైనా ఇలాంటి పాత్ర వస్తే చేయాలని అనుకునేదాన్ని. ఈ సినిమాతో ఆ కోరిక తీరింది. ఈ సినిమాకి హండ్రెడ్ పెర్సెంట్ ఎఫర్ట్ పెట్టాను. ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఇందులో మెయిన్ కాన్సెప్ట్ చాలా ఫన్నీగా అలాగే ఎంటర్టైనింగ్ గా చెప్పడం జరిగింది. ఎక్కడ కూడా మెసేజ్ ఇచ్చినట్లుగా ఉండదు. కొంచెం యాక్షన్ ఉన్న సినిమాలని ఇష్టపడతాను. ఇందులో చెంప దెబ్బలు ఉన్నాయి. ఒక దెబ్బ చెంపకి తగిలేలా ఉండాలి. చట్నీ చెంపకి అంటుకునేలా ఒక సీన్ ఉంది. అది రావాలంటే ఖచ్చితంగా కొట్టాల్సిందే. ఆ రకంగా నిజంగానే గట్టిగా ఒక చెంప దెబ్బ తగిలింది. ఆ సీన్‌లో నా కళ్ళల్లో వచ్చిన నీళ్లు రియల్. ఇందులో ఒక యాక్షన్ సీక్వెన్స్ ఉంది. ఆ సీన్‌లో తరుణ్ కి నాకు ఇద్దరికీ దెబ్బలు తగిలాయి. కోవిడ్ సమయంలో మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నాను.గోదావరి యాస విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదు. ఎందుకంటే మా అమ్మగారిది రాజమండ్రి. నేను సమ్మర్ హాలిడేస్‌కి ప్రతిసారి అక్కడికి వెళ్ళేదాన్ని. అయితే తరుణ్ కి యాస ఒక ఛాలెంజ్. ఆయన యాస కోసం చాలా శ్రమించారు. ఎందుకంటే ఇప్పటివరకు అయినా తెలంగాణ తప్పితే మరో యాస పాత్రలు చేయలేదు. ఈ సినిమాకు మాత్రం చాలా కష్టపడ్డారు. అవుట్ ఫుట్ చాలా అద్భుతంగా వచ్చింది. తెరపై మీకు ఓంకార్ నాయుడు పాత్ర మాత్రమే కనిపిస్తుంది. మంచి సమ్మర్లో ఈ సినిమా షూటింగ్ చేసాము. చాలా వేడి వాతావరణం ఉండేది. ఆ వేడి పెద్ద చాలెంజ్ అనిపించలేదు. ఎందుకంటే నాకు చిన్నప్పటినుంచి ఆ ప్రాంతం అలవాటే. కాకపోతే ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద ఒక సీన్ చేసాము. నాకు నీళ్లంటే భయం. ఆ సీన్ చేస్తున్నప్పుడు నిజంగా భయపడ్డాను.

# 'డేవిడ్ రెడ్డి' ఫస్ట్ లుక్ పోస్టర్ లాంచ్




రాకింగ్ స్టార్ మంచు మనోజ్ నటిస్తున్న కొత్త సినిమా డేవిడ్ రెడ్డి. ఈ సినిమాను వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్, ట్రూ రాడిక్స్ బ్యానర్స్ పై నల్లగంగుల వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి నిర్మిస్తున్నారు. డైరెక్టర్ హనుమ రెడ్డి యక్కంటి రూపొందిస్తున్నారు. బ్రిటీష్ కాలం నాటి బ్యాక్ డ్రాప్ తో ఇంటెన్స్ యాక్షన్ డ్రామా కథతో భారీ పాన్ ఇండియా చిత్రంగా డేవిడ్ రెడ్డి సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో మారియా ర్యబోషప్క హీరోయిన్ గా నటిస్తోంది. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడలో ఈ సినిమా రూపొందుతోంది. 'డేవిడ్ రెడ్డి' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్స్ లాంచ్ చేశారు. డేవిడ్ రెడ్డి ఫస్ట్ లుక్ పోస్టర్స్ లో రూత్ లెస్, బ్రూటల్ అనే రెండు లుక్స్ లో మంచు మనోజ్ ఇంటెన్స్ గా కనిపించి ఆకట్టుకుంటున్నారు. ఈ రెండు లుక్స్ చూస్తే మూవీలో టెర్రిఫిక్ యాక్షన్ ఉంటుందని తెలుస్తోంది. మంచు మనోజ్ తన మేకోవర్, బాడీ లాంగ్వేజ్, లుక్స్, పర్ఫార్మెన్స్ తో డేవిడ్ రెడ్డి పాత్రకు లైఫ్ ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఫస్ట్ లుక్ పోస్టర్ తో డేవిడ్ రెడ్డి సినిమా బజ్ క్రియేట్ చేస్తోంది.1897 నుంచి 1920 మధ్య బ్రిటీష్ పాలనా కాలాన్ని నేపథ్యంగా తీసుకుని 'డేవిడ్ రెడ్డి' సినిమాను ప్రతిష్టాత్మకంగా మేకర్స్ రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో బ్రిటీష్ క్రూర పాలనకు ఎదురునిలిచి పోరాడిన యోధుడి పాత్రలో మనోజ్ నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ రవి జక్కుల, యాక్షన్ సుప్రీమ్ సుందర్. ఎడిటింగ్ ఉజ్వల్ కులకర్ణి,డీవోపీ ఆచార్య వేణు, మ్యూజిక్ రవి బస్రూర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కొట్టు రవికుమార్.

# విషప్రచారం చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రంగా ఖండించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకే కొందరు ఉద్దేశ్యపూర్వకంగా ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రజాస్వామ్యంలో క్యాబినెట్ అనేది ఒక యూనిట్. పరిపాలనా పరమైన అంశాల్లో ఎక్కడా జాప్యం ఏర్పడకుండా ఉండటానికి సీనియర్ మంత్రులుగా మేము చర్చించుకుంటే అందులో తప్పేముంది? అది ప్రభుత్వ సమష్టి బాధ్యత. డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అధికారిక నివాసంలో మేము భేటీ అయి పరిపాలనా పరమైన అంశాలను చర్చించాం' అని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. మేరకు మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'లోక్‌భవన్‌లో ఎట్ హోమ్ కార్యక్రమం ముగిసిన తర్వాత అందరి ముందే మంత్రులమంతా ఒకే కారులో వెళ్లాం. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ తరపున అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించాం. ప్రజాస్వామ్యంలో ఎన్నికల సన్నద్ధత అనేది రాజకీయ పార్టీల ప్రాథమిక బాధ్యత. దీనికి కూడా లేనిపోని రంగులు పూయడం సమంజసం కాదు' అని మంత్రి పేర్కొన్నారు. 'నిర్మాణాత్మకమైన విమర్శలను మేము ఎప్పుడూ స్వాగతిస్తాం. కానీ వ్యక్తిత్వ హననానికి, ఊహాజనిత కథనాలకు పాల్పడితే అది ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం. రాష్ట్రాభివృద్ధి కోసం, భావితరాల భవిష్యత్తు కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్న మా ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేయడం ఇకనైనా మానుకుని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి' అని మంత్రి శ్రీధర్‌బాబు కోరారు.

# ప్రైవేట్ కంపెనీల చేతుల్లోకి విత్తనం

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: రైతుల చేతులో ఉండాల్సిన విత్తనం ప్రైవేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లిందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. ఎరువుల వాడకం పెరిగడంతో భూమి, నీరు, వాతావరణం కాలుష్యమవుతోందని, ఈ పంటల కారణంగా రోగాల భారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెరగాలని, కూరగాయల సాగు చేసే రైతులకు మార్కెట్లు అందుబాటులో ఉండాలన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్, సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్, డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ' సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో 'తెలంగాణ వ్యవసాయ రంగం భవిష్యత్ ప్రణాళికల' మంగళవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిషన్ చైర్మన్ ఎం.కోందండరెడ్డి అధ్యక్షత వహించగా, టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, కమిషన్ సభ్యులు రాములునాయక్, గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, భూమి సునీల్, కమిషన్ సలహాదారులు దొంతి నర్సింహారెడ్డి, మెంబర్ సెక్రెటరీ గోపాల్, హార్టికల్చర్ యూనివర్సిటీ విసి రాజిరెడ్డి, నాబార్డు సిజిఎం ఉదయ్ భాస్కర్, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మి భాయి, అగ్రికల్చర్ అడిషనల్ డైరెక్టర్ నర్సింహారావు, సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికలర్చర్ ఫౌండర్ రామాంజనేయులు, దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ దివ్య, రైతు సంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, నల్లమల వెంకటేశ్వర్లు, సీనియర్ జర్నలిస్ట్ దిలీప్ రెడ్డితో పాటు రైతు సంఘం నాయకులు, వ్యవసాయ రంగ నిపుణులు తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలపై పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అనంతరం కోదండరెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురైందని, ఎరువులు, విత్తనాలు కల్తీ కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కమిషన్ వివిధ రాష్ట్రాల్లో పర్యటించిందని వివరించారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ వ్యవసాయ రంగంపైన ఆధారపడిన 60శాతం ప్రజలను ఆర్థికంగా నిలబెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉందన్నారు. చిన్న, సన్నకారు, మహిళా రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని వారిని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయరంగంలో భవిష్యత్ ప్రణాళికలు ఉండాలని సూచించారు. అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనం అందాలన్నారు. ప్రైవేట్ విత్తన కంపెనీలు వద్ద ఉత్పత్తి అయ్యే విత్తనాలను వ్యవసాయ యూనివర్సిటీలో తయారుచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు ఆగ్రోస్, విత్తనాభివృద్ధి సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాములు నాయక్ మాట్లాడుతూ వరి తరహాలో చిరుధాన్యాలకు కూడా బోనస్ ఇవ్వాలని సిఎంను కోరితే, అందుకు అంగీకరించినట్టు తెలిపారు. గోపాల్ రెడ్డి ప్రతి రైతు ఆర్గానిక్ వ్యవసాయం చేసేలా చూడాలన్నారు. భవానీ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర చాలా కీలకమని, మరింత ఎక్కవ మంది మహిళలు వ్యవసాయం చేసేందుకు ముందుకురావాలని కోరారు. రామాంజనేయులు మాట్లాడుతూ రైతులు ఎరువులను తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లాలనన్నారు. అందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. సారం పల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ భూసార పరీక్షలు నిర్వహించి, అందుకు అనుగుణంగా పంటలు సాగు చేయాలన్నారు. కాగా వర్క్‌షాపులో వ్యక్తమైన అభిప్రాయాలను ఒక నివేదికగా రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ తెలిపింది.

# విచారణలో సంతోష్

(మొదటి పేజీ తరువాయి)

సంతోష్ రావు పంపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రభాకర్ రావు విచారణలో వెల్లడించిన వాంగ్మూలంను సంతోష్ ముందు పెట్టి సిట్ అధికారులు విచారించారని తెలిసింది.కవిత కదలికలపై ఎందుకు ట్రాక్ చేయించారని సిట్ ఆయన్ని ప్రశ్నించిట్లు తెలిసింది.కవిత భర్త అనిల్ ఫోన్ నెంబర్‌ను కూడా టాప్ చేయించినట్టు సిట్ అనుమానిస్తుంది. ఇందులో సంతోష్‌రావు కీలక పాత్ర వహించినట్లు నిందితుల వాంగ్మూలాలను ద్వారా సిట్ అధికారులు ఒక నిర్ధారణలకు వచ్చినట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్ అయిన తరువాత సంభాషణలను ఎవరెవరికి పంపించారు అనే విషయంపై కూడా ఆరా తీసినట్లు తెలిసింది. నిందితులతో మాట్లాడాల్సిన అవసరం ఎందుకు వచ్చిందనే విషయంపై కూడా సిట్ అధికారులు సంతోష్‌రావును ఆరా తీశారు. సిట్ అడిగిన పలు ప్రశ్నలకు సంతోష్‌రావు చెప్పిన సమాధానాలను వీడియో రికార్డు చేశారు. మరికొన్ని ప్రశ్నలకు ఆయన మౌనం వహించినట్లు సమాచారం. ఎస్ఐబి అధికారుల ద్వారా అప్పటి ప్రతిపక్ష నేతల ఫోన్‌లపై నిఘా పెట్టినట్లు సంతోష్‌రావుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ కోణంలో కూడా ఆయన్ని సిట్ అధికారులు ప్రశ్నించారు. ప్రతిపక్ష నేతలు, వ్యాపారవేత్తలు,సొంత పార్టీలోని అసమ్మతి నేతల ఫోన్లపై నిఘా పెట్టమని మీరేమైన ఎస్ఐబి అధికారులను ఆదేశించారా అని ప్రశ్నించారు.

# సోషల్ మీడియా నిషేధం

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించిన చర్చలు మంగళవారం ఉదయం వరకూ కొనసాగాయి. ఎట్టకేలకు 131–21 తేదీతో బిల్లును సభ్యులు ఆమోదించారు. ఇక ఈ బిల్లును ఇప్పుడు ఎగువసభకు పంపుతారు. ఎగువసభ ఆమోదం పొందిన తర్వాత ఈ బిల్లు చట్టరూపం తీసుకుంటుంది. మేక్రాన్ రినైజాన్స్‌పార్టీకి దిగువసభలో నాయకత్వం వహిస్తున్న గాబ్రియేల్ అత్తల్ ఒక ప్రకటన చేస్తూ ఫిబ్రవరి నాటికి ఎగువసభ బిల్లును ఆమోదిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికలు పిల్లల్లో వలస మనస్తత్వాన్ని పెంచుతున్నాయని విమర్శించారు. 'యూరప్‌లో మేమే మార్గదర్శిగా ఉంటాం, మా పిల్లలు, యువకుల మనసులను తీర్చిదిద్దుతాం, దేశ విధిరాతను స్వతంత్ర ఆలోచనల దిశగా మారుస్తాం' అన్నారు. బిల్లు ఆమోదం ఫ్రాన్స్‌లో పిల్లలను, వారి బాల్యాన్ని కాపాడేందుకు తీసుకున్న అతిపెద్ద చర్యగా దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేట్ మేక్రాన్ అభివర్ణిస్తూ ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. గత ఏడాది డిసెంబరులో అండర్–16 పిల్లలకు సోషల్ మీడియాను అందుబాటులో లేకుండా చేస్తూ ఆస్ట్రేలియా పార్లమెంటు చట్టం చేసింది. ఆ స్ఫూర్తితో అనేక దేశాలు పునరాలోచనలో ఉన్నాయి. సోషల్ మీడియా వల్ల స్క్రీన్ టైమ్ పెరిగిపోయి పిల్లల్లో నిద్రలేమి సమస్యలు వస్తున్నాయని, వారు బాల్యాన్ని కోల్పోతూ, తీవ్ర ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారని అనేక ఫిర్యాదులు సర్వత్రా వస్తున్నాయి. 'అమెరికా వేదికలైనా, చైనా వేదికలైనాగానీ మా పిల్లలు, టీనేజర్ల భావోద్వేగాలు అమ్మకానికి సిద్ధంగా లేవు లేదా వారికి అనుగుణంగా మార్చుకోవడానికి సిద్ధంగా లేవు,' అని గడచిన శనివారంనాడే ఒక వీడియో ప్రసారంటో మేక్రాన్ హెచ్చరిక చేశారు.




# ఐదు రోజులే పనిచేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

నాగేశ్వర్, శ్రీకాంత్ మిశ్రా (ఎల్ఐసి), ఎఐబిఇఎ నేతలు రవీంద్రనాథ్, పి.వి.కృష్ణా రావు, సమద్ ఖాన్ (ఎఐబిఇఎ), శాండిల్య(ఎన్‌సిబిఇ), ఫణికుమార్(ఎఐబిఒఎ), రాజ్‌కుమార్ (ఎఐబిఒసి), అర్జున్(ఐఎన్‌బిఒసి), వెంకటరామయ్య (బిఇఎఫ్ఐ) పాల్గొన్నారు. ఈ సందర్భంగా యుఎఫ్‌బియు కన్వీనర్ అంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సభలో రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ) తో పలు దఫాలుగా చర్చలు జరిగినప్పటికీ, తమ డిమాండ్లపై స్పష్టమైన హామీ లభించలేదన్నారు. ఐదు రోజుల పని దినాల అమలు వల్ల ఉద్యోగుల పనితీరు, జీవన సమతుల్యత మెరుగవుతుందని తెలిపారు. 2015 నుంచి తమ డిమాండ్ పెండింగ్‌లోనే ఉందని, ఆర్‌బిఐ, నాబార్డ్, సెబి, ఎల్ఐసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికే వారానికి 5 రోజుల పనివిధానం అమలవుతోందని, బ్యాంకుల్లోనూ అమలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా, ఇంతవరకు కార్యరూపం దాల్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక రంగంతో ముడిపడి ఉన్న అన్ని సంస్థలకు శని, ఆదివారాలు సెలవు అమలవుతున్నదని, బ్యాంకు ఉద్యోగులకు కూడా అమలు చేయాలన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించి, వారి మద్దతుతో సాధించాలని చెప్పారు. వెంకటరామయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న 8లక్షల మంది బ్యాంకు ఉద్యోగులు రూ.400లక్షల కోట్ల లావాదేవీలు జరుపుతున్నారని, బ్యాంకుల్లో సిబ్బంది కొరత, పని ఒత్తిడితో ఉద్యోగులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని, గత సంవత్సర కాలంలో నలుగురు ఉన్నత స్థాయి బ్యాంకు ఉద్యోగులు పని ఒత్తిడి భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 90శాతం బ్యాంకింగ్ లావాదేవీలు డిజిటల్ రూపంలోనే జరుగుతున్నాయని ప్రభుత్వాలే చెబుతున్నాయని, ఇప్పటికే రెండవ, నాలుగవ శనివారాలు సెలవు అమలవుతున్నందున ప్రభుత్వం ఇచ్చిన హామీ మేర కు మిగతా రెండు శనివారాలు కూడా సెలవు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ)తో జరిగిన ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా ఆరు నెలల్లోనే 5 రోజుల పని దినాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని, కానీ రెండేళ్లు గడిచినా ఆ హామీ నెరవేరలేదని విమర్శించారు. బ్యాంకు ఉద్యోగుల నాణ్యమైన డిమాండ్ అమలు చేయకపోతే రానున్న రోజుల్లో నిరవధిక సమ్మె చేసి ఐదు రోజుల పనిదినాలను సాధించుకుంటామని ఉద్యోగులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎఐబిఇఎ నాయకులు ఉదయ్ భాస్కర్, అజయ్‌కుమార్, నల్లప రెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

# వనజాతరకు వెళ్లొద్దాం

(మొదటి పేజీ తరువాయి)

అవుతున్నారు. అలాగే 20 లక్షల మంది భక్తులను సురక్షితంగా జాతరకు చేర్చేందుకు ఆర్‌టిసి కార్యాచరణ రూపొందించింది. భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య, ఆరోగ్యశాఖతో పాటు నీటిపారుదలశాఖ, ఆర్ డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ తదిరత శాఖలన్నీ కూడా సిద్ధమయ్యాయి. భక్తులకు సెల్ సిగ్నల్స్ సమస్య ఉత్పన్నం కాకుండా భారీగా మొబైల్స్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. మేడారం జా తరలో అత్యంత కీలకమైనది పోలీస్ శాఖనే. ట్రాఫిక్‌తో పాటు శాంతిభద్ర తల భారం ఆ శాఖపైనే ఉండటంతో పోలీసులు అత్యాధునిక టెక్నాలజీని వాడుతున్నారు. జాతరలో 13వేల మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గత జాతరలో సుమారు 30వేల మంది భక్తులు తప్పి పోయిన నేపథ్యంలో ఈసారి జియోట్యాగ్ టెస్ట్ మిస్సింగ్ పర్సన్స్ ట్రాకింగ్ వ్యవస్థను తీసుకవచ్చారు. వృద్ధులు, పిల్లలకు పస్రా తాడ్వాయి మార్గాల్లో క్యూఆర్ కోడ్ గల జియోట్యాగ్‌లను కడుతారు. దీంతో ఎవరైనా తప్పిపోయినా ఈ ట్యాగ్‌ను స్కాన్ చేస్తే వివరాలు తెలిసిపోతాయి. అపుమానాస్పద వస్తువులను గుర్తించే రియల్ టైమ్ అలర్ట్ సిస్టమ్ను కూడా సిద్ధం చేశారు. అలాగే టీజీ క్వెస్ట్ అత్యాధునిక ఏఐ డ్రోన్ వ్యవస్థను జాత రలో వినియోగిస్తున్నారు. ఎఐ డ్రోన్లు జాతరలో గస్తీ నిర్వహించనున్నాయి. అలాగే జాతరలో 450 సీసీ కెమెరాలు, 20 డిస్ప్లే ప్యానల్స్ వినియోగిస్తున్నారు. క్లౌడ్ కౌంటింగ్ కెమెరాలు, పేస్ రికగ్నైజేషన్ కెమెరాలను కూడా క్యూలైన్లు, అధికంగా భక్తులు ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు. చేస్తున్నారు. అలాగే 42 పార్కింగ్ స్థలాలు, 37 హోల్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. వరంగల్ నుంచి పస్రా వరకు నాలుగు కిలో మీటర్లకు ఒకటి చొప్పున పోలీస్ ఔట్ పోస్టులను ఏర్పాటు చేశారు.

## వైద్యఆరోగ్యశాఖ సేవలు

మేడారం జాతరలో వైద్యశాఖ సేవలు కీలకంగా మారాయి. ఈసారి 50 పడకల ఆస్పత్రితో పాటు ప్రత్యేకంగా 30 హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేశారు. 5,192 మంది మెడికల్, పారా మెడికల్ సిబ్బందిని నియమించారు. జాతర అనంతరం కూడా వ్యాధులు ప్రబలకుండా 10మెడికల్ క్యాంపులు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు ములుగు జిల్లా ఆస్పత్రి, ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రిల్లో వైద్య సేవలు అందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 108 వాహనాలను 15 అందుబాటులో ఉంచుతున్నారు. మరో 15 మొబైల్ అం బులెన్స్ లను కూడా జాతరకు తరలిస్తున్నారు.

## టిజిఎస్ ఆర్‌టిసి ఏర్పాట్లు

మేడారం మహాజాతరకు ఆర్‌టిసి విస్తృతంగా ఏర్పాట్లు చేసిం ది. జాతరకు రాష్ట్ర నలుమూలల నుంచి 20 లక్షల మంది భక్తులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. 4వేల ఆర్టీసీ బస్సులను సిద్ధం చేసింది. 10,441 మంది సిబ్బందిని నియమించి సేవలను విస్తృత పరిచేందుకు ఏర్పాట్లు చేసింది. వరంగల్ రీజియన్‌లో 51 పాయింట్లను ఏర్పాటు. చేసింది. అలాగే జాతరకు వెళ్లలేని భక్తుల కోసం ఆర్టీసీ వినూత్న తరహాలో కొత్త స్కీం ప్రవేశ పెట్టింది. 30మంది భక్తులు ఉంటే ఇంటికే ఆర్టీసీ బస్సును పంపి స్తుంది. ఇప్పటికే మేడారం ప్రసాదాన్ని (బెల్లం) భక్తులకు ఇంటికి చేర్చేందుకు ప్రత్యేకంగా కార్గో సర్వీసు ప్రారంభించింది. అలాగే బస్సు సౌకర్యాలు, చార్జీలు, రూట్ మ్యాప్ తదితర వివరాల కోసం ప్రత్యేకంగా మేడారం విత్ ఆర్టీసీ పేరుతో ఓ యాప్‌ను రూపొందించింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com